శుక్రవారం
6•3•2020
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 251
• పేజీలు : 12 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

WWW.NTNEWS.COM
/NTDAILYONLINE




## తమిళనాడుకు తాగునీరు

**ఆ రాష్ట్ర విజ్ఞప్తికి సీఎం కేసీఆర్ అంగీకారం**

**కేసీఆర్‌ను కలిసిన తమిళనాడు మంత్రుల బృందం**

**ఏపీ సీఎంతోనూ మాట్లాడిన ముఖ్యమంత్రి**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తమిళనాడు ఎదుర్కొంటున్న ఇబ్బందుల నేపథ్యంలో ఆ రాష్ట్రానికి తాగునీటిని సరఫరా చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సూత్రప్రాయంగా అంగీకరించారు. ఏపీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనూ మాట్లాడి సానుకూలంగా నిర్ణయం తీసుకోవాలని సూచించారు. తమిళనాడు మంత్రులు ఎస్పీ వేలుమణి, డీ జయకుమార్, పబ్లిక్ వర్క్స్‌శాఖ కార్యదర్శి డాక్టర్ కే మణివాసన్, సలహాదారు ఎం షీలాప్రియ తదితరులు గురువారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తమ రాష్ట్రంలో తీవ్ర తాగునీటి ఎద్దడి ఉన్నదని.. దానిని ఎదుర్కొనేందుకు సహకరించాలని అభ్యర్థించారు. ఈ సమావేశంలో రాష్ట్రమంత్రులు కేటీఆర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సీఎస్ సోమేశ్‌కుమార్, నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రజత్‌కుమార్, సీఎంవో అధికారులు నర్సింగ్‌రావు, స్మితాసబర్వాల్, ఓఎస్డీ శ్రీధర్ దేశ్‌పాండే, సీఈలు మురళీధర్‌రావు, నరసింహారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. ఈ విషయంపై

మిగతా 2వ పేజీలో

• వ్యాక్సిన్ క్యాపిటల్‌గా హైదరాబాద్



గురువారం ప్రగతిభవన్‌లో ప్రముఖ ఫార్మా కంపెనీ 'సనోఫి' అంతర్జాతీయ భాగస్వామ్యాల అధిపతి ఫ్యాబ్‌రైస్ జీయోఫ్‌ఫ్రేకు జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి కే తారకరామారావు. చిత్రంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి కూడా ఉన్నారు.

3

## ఆ ఇద్దరికి కరోనా లేదు

**ఆరోగ్యంగానే తెలంగాణ స్థానికులు**



- దుబాయ్ నుంచి వచ్చిన ఒక్కరికే వైరస్
- త్వరలోనే డిశ్చార్జి
- వ్యాధిలక్షణాలుంటేనే వైద్య పరీక్షల నిర్వహణ
- మంత్రి ఈటల రాజేందర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా పరీక్షలు నిర్వహించిన ఇద్దరు అనుమానితులకు వ్యాధి లేదని నిర్ధారణ అయిందని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ ప్రకటించారు. అనుమానిత లక్షణాలున్న అపోలోలోని శానిటరీ వర్కర్, ఇటలీ వెళ్లి వచ్చిన మైండ్‌స్పేస్‌లోని డీఎస్‌ఎం ఉద్యోగినికి చెందిన నివేదికలను కేంద్ర ఆరోగ్యసంస్థ వెల్లడించిందని,, వారిద్దరికీ కొవిడ్-19 సోకలేదని స్పష్టంచేశారు. గురువారం కోఠిలోని కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో ఒక్కరికి కూడా కొవిడ్-19 సోకలేదని పునరుద్ఘాటించారు. గాంధీలో చికిత్స పొందుతున్న వ్యక్తికి దుబాయ్‌లో అంటుకొన్నదని, ఆ వ్యక్తి కూడా త్వరలోనే డిశ్చార్జి అవుతాడని తెలిపారు. కొవిడ్-19 గాలిద్వారా వ్యాప్తిచెందదని, ఎవరూ ఆందోళన చెందనక్కరలేదని

మిగతా 2వ పేజీలో

# దేశం దారెటు?

**నానాటికీ క్షీణిస్తున్న జీడీపీ • ఐసీయూలో భారత ఆర్థిక వ్యవస్థ!**

- వారంలో 2వేల పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్
- మదుపరుల సంపద 12 లక్షల కోట్లు మాయం
- వృద్ధిరేటుపై నీలినీడలు
- ద్రవ్యోల్బణం విజృంభణ
- పతనావస్థలో రూపాయి మారకం విలువ
- వేధిస్తున్న పెట్టుబడుల కొరత
- తోడైన నిరుద్యోగం

అటు ఆర్థిక మందగమనం, ఇటు కరోనా ఉపద్రవం. దిగజారుతున్న కొనుగోలు శక్తి, పడిపోతున్న స్థూల దేశీయోత్పత్తి. పతనమవుతున్న రూపాయి విలువ! గణాంకాలు తడబడుతున్నాయి. అంచనాలు భయపెడుతున్నాయి. అంతర్జాతీయ పరిణామాలకు తోడు దేశ ఆర్థిక నిర్వహణలో లోపాలు పెను శాపాలుగా మారాయి. దీంతో 23 ఏండ్ల తర్వాత తొలిసారి భారత జీడీపీ దారుణంగా క్షీణించింది. వరుసగా ఆరు త్రైమాసికాల నుంచి క్షీణదిశలోనే ఉన్న వృద్ధిరేటు గత త్రైమాసికంలో ఆరేండ్ల కనిష్ఠానికి జారుకుంది. కొత్త పెట్టుబడులు రావడం లేదు. పారిశ్రామిక సూచిక నేలచూపు చూస్తున్నది. నిరుద్యోగిత పెరిగి పోతున్నది. కరోనా వైరస్ కారణంగా వెలిసిన అడ్డుగోడలతో అనేక రంగాలు ఆటుపోట్లు ఎదుర్కొంటున్నాయి. పరిస్థితిని చక్కదిద్దేందుకంటూ కేంద్రం తీసుకుంటున్న చర్యలు క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదు. పన్నులు ఆశించినంతగా వసూలుచేసుకోలేని కేంద్రం, రాష్ట్రాలకు వాటాలు పంచడంలో విఫలమై తాత్సారం చేస్తున్నది. ఇది ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తున్న తెలంగాణ వంటి రాష్ట్రాల మీద పెను ప్రభావం చూపిస్తున్నది. ఇది ఎక్కడిదాకా? దేశం పయనమెటు?

8

• టెస్కాబ్ చైర్మన్‌గా రవీందర్‌రావు



గురువారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌కు చిత్రపటాన్ని అందజేస్తున్న టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, వైస్‌చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు నిరంజన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, డీసీసీబీ చైర్మన్లు చిట్టి దేవేందర్‌రెడ్డి, కూరాకుల నాగభూషణం, కాంబ్లే నామ్‌దేవ్, నిజాంపాషా, బీ మనోహర్‌రెడ్డి కూడా ఉన్నారు.

4

## నేటినుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

2



గురువారం హైదరాబాద్‌లోని మైండ్‌స్పేస్‌లో విధులకు హాజరైన టెకీలు

## ఐటీ కారిడార్‌లో నో ఎఫెక్ట్

యథావిధిగా విధులకు హాజరైన ఉద్యోగులు, సిబ్బంది

2



## పొత్తూరి ఇకలేరు

**పెద్దదిక్కు కోల్పోయిన పాత్రికేయ ప్రపంచం**

- తెలంగాణ ఉద్యమానికి మద్దతునిచ్చిన పాత్రికేయుడు: సీఎం కేసీఆర్ సంతాపం
- జర్నలిజానికి వన్నెతెచ్చారు: మంత్రి కేటీఆర్ నివాళి
- మహాప్రస్థానంలో ముగిసిన అంత్యక్రియలు
- తరలివచ్చిన పాత్రికేయగణం

**హైదరాబాద్ /సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ/ అహ్మద్‌నగర్:** సుప్రసిద్ధ పాత్రికేయుడు, ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ పొత్తూరి వెంకటేశ్వర్‌రావు (86) గురువారం ఉదయం కన్నుమూశారు. కొంతకాలంగా 'మల్టిపుల్ మైలోమా' అనే బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న పొత్తూరి.. మూడు నెలలపాటు బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందారు. మూడురోజుల క్రితం పరిస్థితి విషమించడంతో ఇంటికి తీసుకొనివెళ్లారు. గురువారం ఉదయం 8.40 గంటలకు పొత్తూరి తుదిశ్వాస విడిచారు. పొత్తూరి మృతి పట్ల ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు. పత్రిక, సామాజిక సేవారంగాల్లో

మిగతా 3వ పేజీలో

**చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 47.00 | రిటైల్ లైవ్ | 69.00 |
| డ్రెస్‌డ్ | 100.00 | స్కిన్‌లెస్ | 114.00 |

**గుడ్ల ధరలు (వందకు) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 275.00 | రంగారెడ్డి | 275.00 |
| మెదక్ | 275.00 | కరీంనగర్ | 278.00 |
| వరంగల్ | 278.00 | డజన్ ధర | 54.00 |

## నెత్తురోడ్డుతున్న యువత



**ప్రమాద మృతుల్లో 35 ఏండ్ల లోపువారే అధికం**

**మద్యం మత్తే ప్రధాన కారణం • ద్విచక్రవాహనాలతోనే ఎక్కువ యాక్సిడెంట్లు**

**2018లో 1.51 లక్షల మంది మృతి • రోడ్ సేఫ్టీ అథారిటీ నివేదిక వెల్లడి**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అభివృద్ధిలో దేశానికి వెన్నుదన్నుగా నిలవాల్సిన యువత రోడ్డు ప్రమాదాలకు బలవుతూ కన్నవారికి కడుపుకోత మిగుల్చుతున్నది. మృతుల్లో 35 ఏండ్లలోపు యువతీ, యువకులే అత్యధికంగా ఉటున్నారు. వీరిలో ఎక్కువమంది పట్టపగలే మద్యం మత్తులో అదుపుతప్పి బైకులపై నుంచి కిందపడటం వల్లనే మరణిస్తున్నారు. 1970 నుంచి 2018 వరకు దేశవ్యాప్తంగా జరిగిన రోడ్డు ప్రమాదాలను సమగ్రంగా పరిశీలించి కేంద్ర రోడ్డు భద్రతా సంస్థ విడుదలచేసిన నివేదికలు ఈ విషయాలను స్పష్టం చేస్తున్నాయి. 1970లో దేశవ్యాప్తంగా జరిగిన 1.14 లక్షల ప్రమాదాల్లో దాదాపు 15 వేల మంది మృతిచెందగా 70 వేలమంది గాయపడ్డారు. ఈ సంఖ్యలు ఏటేటా పెరుగుతున్నాయి. 2018లో రోడ్డు ప్రమాదాల సంఖ్య 4.67 లక్షలకు, మృతుల సంఖ్య 1.51 లక్షలకు చేరింది. ఈ ప్రమాదాల్లో 67 శాతం ద్విచక్ర వాహనాల వల్లనే జరిగాయి. మొత్తం మృతుల్లో యువతీ, యువకులే 74 శాతం ఉన్నారు. 2016లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 18 నుంచి 35 ఏండ్లలోపు వయసున్న 69,851 మంది మృతిచెందగా.. ఈ సంఖ్య 2017లో 73,793కు, 2018 సంవత్సరంలో 72,757కు చేరింది. ప్రమాదాలు ఎక్కువగా వీధుల్లోనే జరుగుతున్నట్లు

మిగతా 4వ పేజీలో



## నిర్భయ దోషులకు 20న ఉరి

- మరోసారి ఢిల్లీ కోర్టు డెత్ వారంట్లు
- న్యాయపరమైన మార్గాలు బంద్
- ఈసారి శిక్ష అమలు ఖాయం!

5

**మహిళల టీ20 ప్రపంచకప్**

## ఫైనల్స్‌కు భారత్



హర్మన్‌ప్రీత్ కౌర్

- ఇంగ్లండ్‌తో సెమీస్ వర్షార్పణం
- గ్రూప్ దశ పాయింట్లతో ముందంజ
- ఆదివారం ఫైనల్లో ఆసీస్‌తో అమీతుమీ

వివరాలు ఆటలో



నార్సింగ్ పోలీస్‌స్టేషన్ వద్ద ఎంపీ రేవంత్‌రెడ్డి

## డ్రోన్ కేసులో రేవంత్ అరెస్ట్

**14రోజుల రిమాండ్.. చర్లపల్లి జైలుకు తరలింపు**

**హైదరాబాద్ సిటీబ్యూరో/మణికొండ, నమస్తే తెలంగాణ:** రంగారెడ్డి జిల్లా మియాఖాన్‌గూడలోని ఓ ప్రైవేట్ ఫాంహౌజ్‌పైకి డ్రోన్ కెమెరా పంపి రహస్యంగా చిత్రీకరించిన కేసులో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎంపీ రేవంత్‌రెడ్డిని నార్సింగి పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఎయిర్‌క్రాఫ్ట్ యాక్ట్ నిబంధనలను ఉల్లంఘించిన ఈ కేసులో బుధవారం ప్రవీణ్‌పాల్‌రెడ్డి, విజయసింహారెడ్డి, జైపాల్‌రెడ్డి, రాజేశ్, శివ, ఓంప్రకాశ్‌రెడ్డిని

మిగతా 4వ పేజీలో

**నిజామాబాద్ స్థానిక ఎమ్మెల్సీ స్థానానికి**

## ఏప్రిల్ 7న ఉప ఎన్నిక

**షెడ్యూల్ విడుదల ..12 నుంచి నామినేషన్లు**

**ఎమ్మెల్సీని కైవసం చేసుకోనున్న టీఆర్‌ఎస్**

**హైదరాబాద్/నిజామాబాద్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి ఏప్రిల్ 7న ఎన్నిక నిర్వహించనున్నారు. ఉప ఎన్నిక షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికలసంఘం గురువారం విడుదలచేసింది. టీఆర్‌ఎస్ తరపున ఈ స్థానానికి ప్రాతినిధ్యం వహించిన రేకులపల్లి భూపతిరెడ్డి పార్టీ ఫిరాయించడంతో 2019 జనవరి 16న అనర్హత వేటుపడింది. ఖాళీగా ఉన్న ఈ స్థానానికి ఈ నెల 12 నుంచి 19 వరకు నామినేషన్ల స్వీకరణ, 20న పరిశీలన, 23న ఉపసంహరణ ప్రక్రియ ఉంటుంది. అదేరోజున అభ్యర్థుల తుదిజాబితా ప్రకటిస్తారు. అనివార్యమైతే ఏప్రిల్ 7న ఎన్నికలు నిర్వహించి 9న ఓట్లను లెక్కిస్తారు. ఎన్నికయ్యే ఎమ్మెల్సీ పదవీకాలం 2022 జనవరి నాలుగో తేదీ వరకు ఉంటుంది. రాష్ట్రంలో 2019 జూన్‌లో మున్సిపాలిటీ పాలకవర్గాల గడువు ముగిసింది. భూపతిరెడ్డిపై అనర్హత వేటు తర్వాత అవసరమైన సంఖ్యలో ఓటర్లు (స్థానిక సంస్థల ప్రతినిధులు) లేక ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నిర్వహించలేదు. ఇటీవల మున్సిపల్ ఎన్నికలు పూర్తవడంతో అవసరమైన సంఖ్యలో ఓటర్లు ఉన్నందున కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదలచేసింది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ఓటుహక్కు వినియోగించుకోవడానికి అర్హులు. నిజామాబాద్ జిల్లాలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు అత్యధికులు టీఆర్‌ఎస్‌కు చెందినవారే. దీంతో ఈ స్థానాన్ని టీఆర్‌ఎస్ అభ్యర్థి సులువుగా గెలుచుకోనున్నారు.

**రెండు కోర్టుల్లోనూ ఎదురుదెబ్బ**

గతంలో టీఆర్‌ఎస్ తరపున భూపతిరెడ్డి నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరించిన భూపతిరెడ్డి.. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తో కయ్యానికి కాలుదువ్వి అధిష్ఠానం ఆగ్రహానికి గురయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున రూరల్ నియోజకవర్గం నుంచి పోటీచేసి ఓడిపోయారు. అప్పటికే ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలంతా భూపతిరెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అధిష్ఠానాన్ని కోరారు. పార్టీ ఫిరాయింపు నేపథ్యంలో మండలి చైర్మన్ అనర్హత వేటువేశారు. దీన్ని వ్యతిరేకిస్తూ భూపతిరెడ్డి హైకోర్టుకు వెళ్లగా ఎదురుదెబ్బ తగలడంతో సుప్రీంకోర్టు తలుపుతట్టారు. అనర్హత వేటు సబబేనని అక్కడా అదే తీర్పురావడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది.

## తగ్గిన పీఎఫ్ వడ్డీరేటు

**8.50 శాతంగా నిర్ణయించిన ఈపీఎఫ్‌వో**

ఏడేండ్లలో ఇదే కనిష్ఠం

12

## ఏడుగురు కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్

బడ్జెట్ సమావేశాలు ముగిసేవరకూ వేటు

పేపర్లు చించి పోడియంపై విసిరినందుకు స్పీకర్ నిర్ణయం

• విహారానికొచ్చిన విదేశీ పక్షులు



గురువారం సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ పెద్ద చెరువులో కనువిందు చేస్తున్న వలస పక్షులు



గురువారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఉప్పల్ టీఆర్ఎస్ మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఎంకే బద్రుద్దీన్. రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడంపట్ల ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు. చిత్రంలో హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్సీ సలీం తదితరులు ఉన్నారు.






తిప్పేశ్వర్ నుంచి హింగోలి వరకు భాగస్వామి కోసం పులి తిరిగిన ప్రాంతం (మార్క్‌చేసిన మార్గం)

# నీ కోసమే ఈ అన్వేషణ!

భాగస్వామి కోసం వెతుకులాట
2100 కి.మీ. దాటిన ప్రయాణం
అలుపెరగకుండా ఓ పులి ప్రయత్నం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆశ చావలేదు..అన్వేషణ ఆగలేదు! కొండాకోన, కాలువ దాటాలి.. భాగస్వామిని వెతికిపట్టాలి! నీ కోసమే ఈ అన్వేషణ! నీ ధ్యాసలో ఈ ఆలాపన! విరహవేదన.. నరకయాతన! కాలమే దీపమై దారిచూపదా! అంటూ భాగస్వామి కోసం అలుపెరగకుండా ప్రయాణిస్తున్నదో పులి. ఏకంగా 2,100 కిలోమీటర్లు దాటినా నడక ఆపలేదు. మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి మొదలైన వెతుకులాట ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని కవ్వాల్ అభయారణ్యం మీదుగా కొనసాగింది. మహారాష్ట్ర జిల్లాల పరిధిలోని అటవీ ప్రాంతంలో తిరుగుతూ ప్రస్తుతం హింగోలి అభయారణ్యానికి చేరింది. గెలుపుపొందే వరకు అలుపులేదన్నట్టుగా విశ్రమించకుండా శ్రమిస్తూనే ఉన్నది. సినిమాల్లో లవర్ కోసం దేశాలు దాటి వెతకడం మామూలే. ఫోన్లు, గూగుల్ మ్యాప్‌తో తెలియని ప్రదేశంలోనూ ఆచూకీ కనుక్కోవచ్చు.అది రీల్ లైఫ్, రియల్ లైఫ్ సాహసం అంటే ఈ పులిదే. పులిని చూస్తే మనకు భయం. ప్రజలకు దొరికితే దానికి చావు తథ్యం. ఈ పరిస్థితుల్లో భాగస్వామి కోసం అలుపెరగకుండా ప్రయాణిస్తూనే ఉన్నది.

**జీపీఎస్‌తో కదలికలు గుర్తింపు**

యుక్తవయస్సు పులులు సరైన భాగస్వామిని వెతికేందుకు వందల కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తాయి. మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అభయారణ్యం ఈ యువపులి పుట్టినప్రాంతం. తడోబా, తిప్పేశ్వర్ అభయారణ్యాల్లో రేడియోకాలర్లను వినియోగిస్తున్నారు. తిప్పేశ్వర్ సాంక్చువరీలో చిక్కిన ఈ యువ పులికి అక్కడి అధికారులు గత ఏడాది ఫిబ్రవరిలో రేడియోకాలర్ అమర్చారు. జీపీఎస్ ద్వారా కదలికలను పసిగట్టగా తిప్పేశ్వర్ నుంచి తెలంగాణలోని కవ్వాల్ అభయారణ్యం మీదుగా హింగోలి వరకు 2,100 కిలోమీటర్లకుపైగా ప్రయాణించినట్టు గుర్తించారు. మొత్తం పదిజిల్లాలను దాటి మరాఠ్వాడ ప్రాంతంలోని అజంత, ఎల్లోర ప్రాంత అడవులు దాటి హింగోలికి చేరింది. ఆగకుండా నడక కొనసాగిస్తూనే ఉన్నది. మహారాష్ట్ర ఐఎఫ్ఎస్ అధికారి ప్రవీణ్‌కాస్వాన్ పులిఫొటోతోపాటు, అది తిరిగిన ప్రాంత మ్యాప్‌ను ట్విట్టర్‌లో పోస్టుచేశారు. పులి పగటిపూట ఆకలి తీర్చుకొనేందుకు వేటాడుతూ, రాత్రివేళ భాగస్వామి వేటలో నిమగ్నమైందని ఆయన తెలిపారు.





గురువారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌తో భేటీ అయిన తమిళనాడు మంత్రి జయకుమార్‌ను సత్కరిస్తున్న ఐటీశాఖ మంత్రి కేటీఆర్. చిత్రంలో తమిళ మంత్రి వేలుమణి కూడా ఉన్నారు.

## తమిళనాడుకు తాగునీరు

మొదటిపేజీ తరువాయి...

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రితోనూ సంప్రదింపులు జరుపాల్సి ఉన్నందున తమిళనాడు ముఖ్యమంత్రి నుంచి తమ ఇరువురికీ అధికారికంగా లేఖలు రాయించాలని ఆ రాష్ట్ర మంత్రులకు సూచించారు. తర్వాత మూడు రాష్ర్టాల అధికారులు, నిపుణులస్థాయిలో సమావేశం ఏర్పాటుచేసి.. తదుపరి కార్యాచరణ తీసుకోవడానికి వీలుంటుందని వివరించారు. ఇది విజయవంతమైతే మూడు రాష్ర్టాలు దేశానికే ఆదర్శంగా మారుతాయని తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారం విషయంలో రాష్ర్టాల మధ్య సుహృద్భావపూరితమైన వాతావరణం ఉండాలని.. పొరుగు రాష్ర్టాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో ఉండాలని అభిలషించారు. తమిళనాడు తాగునీటి సమస్యను నీతి ఆయోగ్ సమావేశాల్లో పలుమార్లు లేవనెత్తానని సీఎం కేసీఆర్ తెలిపారు. లోక్‌సభలో టీఆర్ఎస్ ఎంపీలు కూడా రెండు, మూడుసార్లు ఈ విషయంపై మాట్లాడారని వివరించారు. తాగునీటి సమస్యతో తమిళనాడు బాధపడటం దేశమంతా సిగ్గుపడాల్సిన అంశమని పేర్కొన్న సీఎం.. దేశంలో లభించే మొత్తం 70వేల టీఎంసీల జలాలలో సాగునీటి అవసరాలు తీరగా 30వేల టీఎంసీలు మిగిలి ఉంటాయని తెలిపారు. ఇందులో 10 వేల టీఎంసీలతో దేశం మొత్తం తాగునీటి అవసరాలు తీర్చవచ్చని వివరించారు.

**తాగునీటిపై వ్యూహంతో ఉండండి**

తాగునీటి సమస్య పరిష్కారంపై తమిళనాడు ప్రభుత్వం ప్రత్యేక వ్యూహాన్ని కలిగిఉండాలని ఆ రాష్ట్ర ప్రతినిధి బృందానికి సీఎం కేసీఆర్ సూచించారు. తమిళనాడు తాగునీటి అవసరాలపై దేశవ్యాప్తంగానూ అవగాహన అవసరమని, అందరూ సహృదయంతో అర్థంచేసుకున్ననాడే ఈ సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. పొరుగురాష్ట్ర ముఖ్యమంత్రిగా, భారతీయుడిగా తమిళనాడుకు సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. తమిళనాడు ప్రతినిధిబృందం అభ్యర్థనను ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఫోన్‌చేసి చెప్పారు. ఇందుకు సూత్రప్రాయంగా అంగీకరించిన విషయాన్ని, తమిళనాడు ప్రతినిధిబృందం సభ్యులకు ఇచ్చిన సూచనలను వివరించారు. తమిళనాడులో తాగునీటి ఇబ్బందులు తెలిసిన విషయమే కాబట్టి.. ఆ రాష్ర్టానికి నీరందించాల్సిన అవసరం ఉన్నదని కేసీఆర్ ఈ సందర్భంగా ఏపీ సీఎంకు తెలిపారు.

## హైవేలపై అండర్‌పాస్‌లు నిర్మించాలి

**రాజ్యసభలో బడుగుల లింగయ్యయాదవ్**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణలో జాతీయరహదారుల పక్కన ఉన్న అన్ని పట్టణాలు, గ్రామాల్లో అండర్‌పాస్‌లు, బ్రిడ్జిలు, సర్వీసురోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని టీఆర్ఎస్ రాజ్యసభసభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ విజ్ఞప్తిచేశారు. గురువారం రాజ్యసభ జీరోఅవర్‌లో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ -విజయవాడ జాతీయరహదారిపై చౌటుప్పల్, గుండ్రాంపల్లి, చిట్యాల, సూర్యాపేట, దురాజ్‌పల్లిలో అండర్‌పాస్‌లు, సర్వీసు రోడ్లులేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హుజూర్‌నగర్, నేరేడుచర్ల పట్టణాల్లోనూ అండర్‌పాస్‌లు నిర్మించాలని కోరారు.

**ముహూర్తం**

సూర్యోదయం: 6.30 గంటలకు

సూర్యాస్తమయం: 6.18 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం ఏకాదశి ఉదయం 11.48 వరకు, తదుపరి ద్వాదశి, నక్షత్రం: పునర్వసు ఉదయం 10.39 వరకు, తదుపరి పుష్యమి, అమృతఘడియలు: ఉదయం 8.20 నుంచి 9.53 వరకు, రాహుకాలం: ఉదయం 10.56 నుంచి మధ్యాహ్నం 12.24 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.52 నుంచి 9.39 వరకు, తిరిగి మధ్యాహ్నం 12.48 నుంచి 1.35 వరకు, వర్జ్యం: సాయంత్రం 6.08 నుంచి 7.38 వరకు.



## కరోనాకు ప్రత్యేక నిధులు

**లోక్‌సభలో కేంద్రాన్ని కోరిన నామా**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా మహమ్మారిని తరిమికొట్టేందుకు కేంద్రప్రభుత్వం రాష్ర్టాలకు తక్షణమే ప్రత్యేక నిధులు విడుదల చేయాలని లోక్‌సభలో టీఆర్ఎస్ పక్షనేత నామా నాగేశ్వర్‌రావు కోరారు. గురువారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల్లో భాగంగా దేశంలో కరోనా వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో అంతేవేగంతో దానిని అరికట్టాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఇందుకు అవసరమైన పరికరాలు, యంత్రాలు, క్రిటికల్ ఎక్విప్‌మెంట్‌ను రాష్ర్టాలకు వెంటనే సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు. తెలంగాణలో అధికార యంత్రాంగం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకున్నదని చెప్పారు. ప్రత్యేకవార్డులను ఏర్పాటుచేయడంతోపాటు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని తెలిపారు.

**లోకం పోకడ**




# ఆ ఇద్దరికి కరోనా లేదు



గురువారం కోఠిలోని కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఈటల రాజేందర్. చిత్రంలో డీఎంఈ, టీవీవీపీ కమిషనర్ కే రమేశ్‌రెడ్డి, ప్రజారోగ్యశాఖ డైరెక్టర్ జీ శ్రీనివాసరావు, ఐపీఎం డైరెక్టర్ శంకర్ కూడా ఉన్నారు.

మొదటిపేజీ తరువాయి...

చెప్పారు. ఎలాంటి పరిస్థితులు వచ్చినా ఎదుర్కొనే సత్తా రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నదన్నారు. దుబాయ్ నుంచి వచ్చిన వ్యక్తి మినహా రాష్ట్రంలో మరెవరికీ ఈ వైరస్ సోకలేదని పేర్కొన్నారు. కరోనాపై ఎవరూ అతిగా స్పందించవద్దని.. వైరస్ సోకిందంటూ ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ కార్యాలయాన్ని ఖాళీచేయడం సరికాదని ఈటల చెప్పారు. ఐటీ కంపెనీలు బాధ్యతగా మెలగాలని.. నెగెటివ్ ప్రచారం వల్ల బాధ కలుగుతున్నదన్నారు. వైరస్ నియంత్రణకు అన్నిరకాల చర్యలు తీసుకొంటున్నామన్నారు. ప్రభుత్వం తీసుకొన్న చర్యలను కేంద్ర ప్రభుత్వం కూడా ప్రశంసించిందని చెప్పారు. కరోనాపై ప్రజలకు అవగాహన కల్పించడంలో మీడియా సహకరించిందని తెలిపారు.

**వైరస్ లక్షణాలుంటేనే పరీక్షలు**

కొందరు వ్యక్తులు అనవసర భయంతో జలుబు, దగ్గు ఉన్నదంటూ పరీక్షలకోసం గాంధీ దవాఖానకు వస్తున్నారని, వైరస్ లక్షణాలున్న వారికి మాత్రమే నిర్ధారణ పరీక్షలుచేస్తామని మంత్రి ఈటల స్పష్టంచేశారు. అర్జెంటీనా నుంచి హైదరాబాద్ వచ్చిన కొందరు కొవిడ్ -19 పరీక్షలకు విజ్ఞప్తిచేశారని, మరికొందరు ఫోన్‌చేసి అడుగుతున్నారని చెప్పారు. ఇన్‌ఫెక్షన్ లేనివారికి ఆ పరీక్షలుచేయడం కుదరదన్నారు. అనుమానం ఉంటే.. డబ్బులు ఉంటే చేసే పరీక్షలు ఇవి కావని తెలిపారు. ఐసొలేషన్ వార్డులు దవాఖానల్లోనే కాకుండా ఇండ్లల్లోనూ పెట్టుకోవచ్చని.. ఆ సదుపాయం లేని సందర్భంలోనే దవాఖానకు తరలించాలని చెప్పారు. కొవిడ్-19 నిరోధానికి ఏర్పాటుచేసిన కమిటీలు నిరంతరం పనిచేస్తాయని చెప్పారు. సమావేశంలో డీఎంఈ, టీవీవీపీ కమిషనర్ కే రమేశ్‌రెడ్డి, ప్రజారోగ్యశాఖ డైరెక్టర్ జీ శ్రీనివాసరావు, ఐపీఎం డైరెక్టర్ శంకర్ పాల్గొన్నారు.

**అపోహలు తిప్పికొట్టాలి**

కొవిడ్-19 వ్యాప్తిపై ప్రజల్లో నెలకొన్న భయాలు, అపోహలు తిప్పికొట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని ఈటల పేర్కొన్నారు. కరోనావ్యాప్తిని నియంత్రించేందుకు ఏర్పాటైన కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ సమావేశ మందిరంలో సర్వేలెన్స్ వైద్యసిబ్బందితో సమావేశమయ్యారు. సర్వేలెన్స్ సేవలకోసం 200 మంది మెరికల్లాంటి వైద్య సిబ్బందిని ఎంపికచేసి శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. కొవిడ్-19 నియంత్రణకు కృషిచేయడానికి జిల్లాలనుంచి వచ్చిన అధికారులు, వైద్యసిబ్బందిని అభినందించిన మంత్రి.. విపత్కర పరిస్థితుల్లో పనిచేసిన సిబ్బందికి అదనపు వేతనంతోపాటు సర్టిఫికెట్ ఇవ్వాలని ఆదేశించారు.

**ప్రజల భయంతో ఆటలాడొద్దు**

కొవిడ్-19 విస్తరిస్తుందన్న ఆలోచనతో ప్రజలు విపరీతంగా మాస్కులు కొంటున్నారని, వారి భయాన్ని సొమ్ముచేసుకోవాలని ప్రయత్నించడం సరికాదని ఈటల అన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారు.. వారి సమీపంలో ఉన్నవారు మాత్రమే మాస్క్ ధరించాలని.. ఇతరులకు అక్కర్లేదని చెప్పారు. ప్రజల భయంతో వ్యాపారంచేస్తే సహించబోమని, అధికధరలకు మాస్కులను అమ్మే మందుల షాపులను శాఖాపరంగా తనిఖీచేయించి చర్యలు తీసుకుంటామని ఈటల హెచ్చరించారు.

## హోమియో మందుల పంపిణీ

**రామంతాపూర్:** కొవిడ్-19 వైరస్‌పై ఆందోళనవద్దని, ప్రభుత్వం అన్నివిధాలుగా చర్యలు తీసుకొంటున్నదని ఆరోగ్యశాఖ మంత్రి ఈటల తెలిపారు. గురువారం రామంతాపూర్‌లోని ప్రభుత్వం హోమియో వైద్యశాలలో కరోనా ప్రివెంటివ్ మందులను మంత్రి పంపిణీచేశారు. అనంతరం మాట్లాడుతూ.. మన ఉష్ణోగ్రతలకు, కరోనా వైరస్ బతుకదని.. అనుకోని పరిస్థితుల్లో వ్యాప్తిచెందితే గట్టి చర్యలు తీసుకొంటున్నామని చెప్పారు. ప్రజలుకూడా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. హోమియో వైద్యాన్ని నమ్మేవారు చాలా మంది ఉన్నారన్నారు. రెండుకోట్ల మందికి సరిపడా మందులకోసం నిధులు ఇస్తామని పేర్కొన్నారు. హోమియోపతి రోగనిరోధకశక్తిని పెంచుతుందన్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో కొవిడ్-19 నిరోధానికి ఇప్పటివరకు 30 వేలమందికి కరోనా మందు ఆర్సెనిక్ ఆల్బం మాత్రలను పంపి



ణీచేసినట్టు ప్రభుత్వ హోమియో వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లింగరాజు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**హైకోర్టులో హోమియోపిల్స్ పంపిణీ**

హైకోర్టు బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులకు రోగనిరోధక శక్తిని పెంపొందించే హోమియో పిల్స్‌ను పంపిణీ చేశారు. చీఫ్‌జస్టిస్ ఆర్ఎస్ చౌహాన్ న్యాయవాదులకు మందులు అందజేశారు.

**ప్రైవేటు యాజమాన్యాలతో భేటీ**

కొవిడ్-19 తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేకచర్యల దృష్ట్యా ఐసొలేషన్ సేవలు అందించేందుకు ప్రైవేటు దవాఖానల యాజమాన్యాలతో ఈటల సమావేశమయ్యారు. ఈ వ్యాధి తీవ్రరూపం దాల్చకముందే ముందుజాగ్రత్తలు తీసుకోవాలని సీఎం కేసీఆర్ ఆదేశించిన నేపథ్యంలో ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఇందుకు ప్రైవేటు దవాఖానలు అంగీకరించాయి. కొవిడ్-19 వైరస్ అనుమానిత లక్షణాలున్న వారికి పరీక్షలు నిర్వహించి శాంపిళ్లను గాంధీ దవాఖానకు పంపాలని సూచించారు. అనుమానితుల నుంచి శాంపిళ్ల సేకరణ, వైద్య చికిత్సవంటివి ప్రొటోకాల్ ప్రకారమే జరుగాలన్నారు. వైద్య చికిత్స విధానం, ఐసొలేషన్ వార్డుల్లో ఉంచాల్సిన పరికరాలు, చికిత్సకు అయ్యే ఖర్చును ప్రభుత్వం నిర్ణయిస్తుందని.. నిబంధనలకు లోబడే చికిత్సలు అందించాలని కోరారు. వైరస్ పట్ల వైద్యులు, సిబ్బందికి అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.

## ప్రభుత్వ చర్యలు భేష్: అడ్వకేట్ జేఏసీ

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** కరోనాను నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొన్న చొరవ ప్రశంసనీయమని అడ్వకేట్ జేఏసీ పేర్కొన్నది. వైరస్ బయటపడ్డ వెంటనే మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు, ప్రజలను అప్రమత్తంచేయడం ద్వారా సమర్థంగా వ్యవహరించిందని జేఏసీ నేతలు కొంతం గోవర్ధన్‌రెడ్డి, తూడి శ్రీధర్‌రావు, తిరుమల్‌రావు, చక్రధర్‌రెడ్డి, శ్యాంకుమార్, జే శ్రీనివాస్‌రెడ్డి, దుర్గానందం అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ.. గాంధీ దవాఖానలో ఐసొలేటెడ్ వార్డును ఏర్పాటుచేయడం,



గురువారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతున్న అడ్వకేట్ జేఏసీ నేతలు

సీఎం కేసీఆర్ రూ.100 కోట్లను విడుదల చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ నియంత్రణకు చర్యలు చేపట్టడంతో వైరస్ ప్రభావం తగ్గిందని పేర్కొన్నారు.

## కేరళ వెళ్లిన రాష్ట్ర బృందం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ నిరోధానికి కేరళ ప్రభుత్వం తీసుకొన్న చర్యలపై అధ్యయనం చేసేందుకు 12 మంది వైద్య నిపుణులు, అధికారుల బృందం గురువారం తిరువనంతపురం వెళ్లింది. బృందంలో జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ సంతోష్, సీడీఎం ప్రతినిధి పంకజ, గ్రామీణాభివృద్ధిశాఖ డిప్యూటీకమిషనర్ రవీందర్, రంగారెడ్డి డీపీవో పద్మజ, విద్యాశాఖ ప్రతినిధి రమణకుమార్, ఆర్టీసీ ఈడీ యాదగిరి, గాంధీ, చెస్ట్ దవాఖానల సూపరింటెండెంట్లు శ్రవణ్‌కుమార్, మహబూబ్‌ఖాన్, డీఎంహెచ్‌వో వెంకట్, ఎస్టీఈఎంఐపీవో రఘు, ఐడీఎస్పీ పీవో శివబాలాజీరెడ్డి, స్టేట్‌ప్రోగ్రాం ఆఫీసర్ సత్యం ఉన్నారు.

**పర్యవేక్షణ కమిటీలకు అధికారుల విభజన**

కొవిడ్-19 నిరోధక చర్యల్లో భాగంగా ప్రభుత్వం ఏర్పాటుచేసిన కమిటీలకు అధికారులను నియమించారు. రాష్ట్రస్థాయి పర్యవేక్షణ కమిటీకి చైర్మన్‌గా వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్, సభ్యులుగా వైద్య, ఆరోగ్యశాఖ స్పెషల్‌చీఫ్ సెక్రటరీ ఏ శాంతికుమారి, డబ్ల్యూహెచ్‌వో రాష్ట్ర కోఆర్డినేటర్ ఉంటారు. హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కమిటీలో హైదరాబాద్ కలెక్టర్ శ్వేతామహంతి, డీఎంఈ రమేశ్‌రెడ్డి, ఐపీఎం డైరెక్టర్ శంకర్, డీఎంఈ పరిధిలోని అధికారులు వాణి, విమల థామస్, డీపీహెచ్ తరపున అనిత గ్రేస్‌ను నియమించారు. సర్వేలెన్స్ కమిటీలో ప్రజారోగ్యశాఖ డైరెక్టర్ జీ శ్రీనివాస్‌రావు, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల డీఎంహెచ్‌వోలు, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ బీ సంతోష్, డబ్ల్యూహెచ్‌వో ప్రతినిధులు ఇద్దరు ఉన్నారు. ఐఈసీ కమిటీలో ఎన్‌హెచ్‌ఎం నోడల్ అధికారి.. ఐఅండ్‌పీఆర్ శాఖ ప్రతినిధి ఉన్నారు. ప్రొక్యూర్‌మెంట్ కమిటీలో టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ చంద్రశేఖర్‌రావు, టీసాక్స్ డైరెక్టర్ ప్రీతీమీనా ఉన్నారు. ట్రైనింగ్ అండ్ కెపాసిటీ బిల్డింగ్ కమిటీలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ (ఐఐహెచ్ఎఫ్ డబ్ల్యూ) డైరెక్టర్ అలుగు వర్షిణి, డబ్ల్యూహెచ్‌వో ప్రతినిధులు ముగ్గురిని నిర్ణయించారు.

**హైదరాబాద్‌లో ఢిల్లీ బృందం**

కొవిడ్-19ను ఎదుర్కొనేందుకు తెలంగాణ చేపట్టిన చర్యలను అంచనావేసేందుకు కేంద్ర బృందం హైదరాబాద్ వచ్చింది. ముందుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో నిర్ధారణ పరీక్షల విధానాన్ని పరిశీలించింది. గాంధీ దవాఖానను సందర్శించింది. కోఠిలో ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని పరిశీలించింది.

**ఫికర్ మత్ కరోనా!**

## వైరస్ కట్టడికి విస్తృత చర్యలు

- గాంధీ, ఫీవర్, చెస్ట్ హాస్పిటళ్లలో ఏర్పాట్లు
- ప్రైవేటు దవాఖానల్లోనూ చికిత్స
- హైకోర్టుకు వెల్లడించిన రాష్ట్రప్రభుత్వం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ వ్యాపిని కట్టడిచేయడానికి పటిష్ఠచర్యలు తీసుకుంటున్నట్టు రాష్ట్రప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. కరోనా నేపథ్యంలో హోలీ వేడుకలను జరుపకుండా ఆదేశాలు జారీచేయడంతోపాటు వైరస్ విస్తరించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై చీఫ్‌జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ అభిషేక్‌రెడ్డి నేతృత్వంలోని ధర్మాసనం గురువారం మరోమారు విచారణ చేపట్టింది. ప్రివెంటివ్ మెడిసిన్ విభాగం డైరెక్టర్ డాక్టర్ శంకర్ స్వయంగా హాజరై కోర్టుకు వివరాలు తెలియజేశారు. అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదనలు కొనసాగిస్తూ.. కరోనా వైరస్ నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నదని వివరించారు. హైదరాబాద్‌లోని గాంధీ, ఫీవర్, చెస్ట్‌హాస్పిటళ్లలో ఐసొలేషన్ వార్డులు ఏర్పాటుచేశామని, ఆయా దవాఖానల్లో 100 పడకల వరకు అందుబాటులో ఉన్నాయన్నారు. కంటోన్మెంట్‌లోని ఆర్మీ, అనంతగిరిలోని చెస్ట్ హాస్పిటళ్లలో 250 పడకలతో వార్డులు ఏర్పాటుచేసినట్టు తెలిపారు. ప్రైవేటు దవాఖానల్లోనూ ఐసొలేషన్ వార్డులు ఏర్పాటుచేస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా 19 వైరాలజీ ల్యాబ్‌లను ఏర్పాటుచేయాలని నిర్ణయించిందని, అందులో భాగంగా తెలంగాణలో నూతన ల్యాబ్ ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే గాంధీలో ఉన్న ల్యాబ్ 24 గంటలు పనిచేస్తున్నదని వివరించారు. డైలీ మానిటరింగ్ సిస్టం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. కరోనా కట్టడి విషయంలో విజయవంతమైన కేరళలో విధానాలను పరిశీలించేందుకు 12 మంది వైద్యుల బృందాన్ని అక్కడికి పంపిస్తున్నట్టు తెలిపారు. విచారణను ధర్మాసనం ఈ నెల 12వ తేదీకి వాయిదావేసింది.



ఐటీ కారిడార్‌లోని మైండ్‌స్పేస్‌లో స్ప్రేయర్‌తో ఔషధాలను చల్లేందుకు సిద్ధమవుతున్న సిబ్బంది

## ఐటీ కారిడార్‌లో నో ఎఫెక్ట్

**విధులకు హాజరైన టెకీలు**

**కొండాపూర్:** కొవిడ్-19 అనుమానిత కేసుతో కలకలం రేగిన మాదాపూర్ ఐటీ కారిడార్‌లో గురువారం ప్రశాంత వాతావరణం నెలకొన్నది. ఈ ప్రాంతంలో పనిచేస్తున్న టెకీలు యథావిధిగా విధులకు హాజరయ్యారు. ఐటీ సంస్థలు తమ ఉద్యోగుల భద్రతకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకొంటున్నాయి. మాస్కులతోపాటు శానిటైజర్లను అందుబాటులో ఉంచుతున్నాయి. మైండ్‌స్పేస్ భవనసముదాయంలోని పెగా సిస్టమ్స్ తన ఉద్యోగులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. కరోనా వైరస్‌పై అసత్య ప్రచారాలను నమ్మవద్దని సంస్థ ఎండీ సుమన్‌రెడ్డి ఉద్యోగులను కోరారు.

## వైరాలో దంపతులకు కరోనా అనుమానం

**శాంపిల్స్ సేకరించనున్న వైద్యులు**

**మయూరి సెంటర్ (వైరా):** కొవిడ్-19 లక్షణాలు ఉన్నాయన్న అనుమానంతో ఖమ్మం జిల్లా వైరా మండలం విప్పలమడక గ్రామానికి చెందిన దంపతులను గురువారం రాత్రి ఖమ్మం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వీరు జర్మనీలోని బెర్లిన్‌లో ఉంటున్న తమ కూతురు వద్దకు గత ఏడాది వెళ్లి ఫిబ్రవరి 20న స్వగ్రామానికి చేరుకొన్నారు. గత రెండు రోజులుగా ఆ మహిళకు జలుబు చేసి దగ్గు రావడంతో గురువారం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు వెళ్లగా అక్కడి వైద్యులు ఐఎంఏ వైద్యులద్వారా డీఎంహెచ్‌వోకు సమాచారమిచ్చారు. అప్రమత్తమైన వైద్యారోగ్యశాఖ అధికారులు ప్రభుత్వ దవాఖానకు పిలిపించి వైద్యపరీక్షలకోసం హడావుడిచేయడంతో భయపడిపోయిన దంపతులు తిరిగి విప్పలమడకకు చేరుకొన్నారు. విషయం తెలుసుకొన్న డీఎంహెచ్‌వో గురువారం రాత్రి ఆ మహిళతోపాటు ఆమె కుటుంబంలో మరో ఇద్దరిని అంబులెన్స్‌ద్వారా ఖమ్మంలోని కరోనా ప్రత్యేకవార్డుకు తరలించారు. వారి నుంచి శుక్రవారం రక్తనమూనాలు సేకరించి, వ్యాధి నిర్ధారణకు పుణె వైరాలజీ సెంటర్‌కు పంపనున్నట్లు డీఎంహెచ్ మాలతి, ఆర్ఎంవో బొల్లికొండ శ్రీనివాస్‌రావు తెలిపారు.

**22 మందికి వైద్యపరీక్షలు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కొవిడ్-19 వైరస్ అనుమానిత లక్షణాలున్నవారికి చేపట్టే నిర్ధారణ పరీక్షల్లో భాగంగా గురువారం 22 మందికి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యారోగ్యశాఖ ప్రత్యేక బులెటిన్ వెలువరించింది. ఇప్పటివరకు 215 మందికి పరీక్షలు జరుపగా ఒకరికి మాత్రమే పాజిటివ్ నమోదైనదని పేర్కొన్నది. 215 మందిలో 169 మందికి వ్యాధి లక్షణాలు లేవని తేలిందని.. మరో 45 మందికి సంబంధించిన నివేదికలు రావాల్సి ఉన్నదని తెలిపింది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో గురువారం 3,740 మందికి థర్మల్‌స్క్రీనింగ్ పరీక్షలు చేసినట్లు బులెటిన్‌లో పేర్కొన్నారు. ఇప్పటివరకు 22,790 మందికి థర్మల్ స్క్రీనింగ్ చేసినట్లు వెల్లడించారు.

## నేటినుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు శుక్రవారంనుంచి ప్రారంభంకానున్నాయి. గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ ఉదయం 11గంటలకు ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. అనంతరం అసెంబ్లీ, శాసనమండలి సమావేశాల ఎజెండాను ఖరారు చేయడానికి బీఏసీ సమావేశం కానుంది. ఈ నెల 8న (ఆదివారం) ఆర్థికశాఖ మంత్రి టీ హరీశ్‌రావు శాసనసభలో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నట్టు సమాచారం. దీనిపై శాసనసభ బీఏసీ సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఇదిలాఉండగా.. అసెంబ్లీ సమావేశాలకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. బడ్జెట్‌పై ఇప్పటికే ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సమీక్షించారు. ఆర్థికశాఖ అధికారులకు పలు సూచనలు జారీచేశారు. మొత్తం 14 పనిదినాలకు తగ్గకుండా సమావేశాలు జరుగనున్నాయి. ఎన్నిరోజులు, ఎన్నిగంటలపాటు సమావేశాలుండాలన్నది కూడా బీఏసీ నిర్ణయించనున్నది.

# వ్యాక్సిన్ క్యాపిటల్‌గా హైదరాబాద్

- డిజిటల్ డ్రగ్ డిస్కవరీలో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు
- 'సనోఫీ' కంపెనీ ప్రతినిధులతో మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అద్భుతమైన మానవ వనరులు, అధునాతన సాంకేతికతలు అందుబాటులో ఉన్న తెలంగాణలో డిజిటల్ డ్రగ్ డిస్కవరీ లాంటి వినూత్న రంగాల్లో పెట్టుబడులకు అనేక అవకాశాలున్నాయని పురపాలక, ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కే తారక రామారావు అన్నారు. ప్రముఖ ఫార్మా కంపెనీ 'సనోఫీ' అంతర్జాతీయ భాగస్వామ్యాల అధిపతి ఫ్యాబ్రైస్ జీయోఫ్రే గురువారం ప్రగతిభవన్‌లో మంత్రి కేటీఆర్‌తో సమావేశమై తెలంగాణలో తమ సంస్థ నిర్వహిస్తున్న కార్యకలాపాలు, భవిష్యత్ ప్రణాళికల గురించి వివరించారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన వినూత్న విధానాలపై 'సనోఫీ' ప్రతినిధులు ఆసక్తి కనబరిచారు. అంతర్జాతీయ వ్యాక్సిన్ క్యాపిటల్‌గా హైదరాబాద్ రూపాంతరం చెందిందని, ఇక్కడ వ్యాక్సిన్ల తయారీతోపాటు సంబంధిత రంగంలో పెట్టుబడులకు విస్తృత అవకాశాలున్నాయని మంత్రి కేటీఆర్ తెలిపారు. తెలంగాణలో ఫార్మారంగానికి, లైఫ్ సైన్సెస్ ఎకో సిస్టంను మరింత బలపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను కేటీఆర్ వివరించారు. 2020 ఏడాదిని తెలంగాణ ప్రభుత్వం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంవత్సరంగా ప్రకటించిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేస్తూ.. ఇప్పటికే పలు దిగ్గజ ఫార్మా కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో భాగస్వాములయ్యేందుకు సుముఖత వ్యక్తంచేశాయని తెలిపారు. సనోఫీ సంస్థ కూడా తెలంగాణ ప్రభుత్వంతో కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. అన్నివిధాలా సహకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంటుందని కేటీఆర్ తెలిపారు. మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, సనోఫీ కంపెనీ దక్షిణాసియా జనరల్ మేనేజర్ అన్నపూర్ణదాస్, శాంతా బయోటెక్ చైర్మన్ కేఐ వరప్రసాద్‌రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## మూగ బాలుడి చికిత్సకు మరో 2 లక్షలు

**బండలింగంపల్లివాసికి మంత్రి కేటీఆర్ అండ**

**ఎల్లారెడ్డిపేట:** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లికి చెందిన మూగ బాలుడి చికిత్స కోసం ఐటీ, పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు మరో రూ.2 లక్షలు సాయం చేశారు. చికిత్స కోసం వారం కిందట రూ. 3 లక్షలు మంజూరుచేసిన విషయం తెలిసిందే. చీకట్ల లక్ష్మి, కనకయ్య దంపతుల కొడుకు సాత్విక్ పుట్టుమూగ. బాలుడికి హైదరాబాద్‌లోని ఈఎన్టీ దవాఖానలో పరీక్షలు చేసిన వైద్యులు.. చికిత్సకోసం రూ.5 లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పారు. విషయాన్ని బండలింగంపల్లివాసులు కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. వారం కిందట రూ.3 లక్షలు, గురువారం మరో రూ.2 లక్షలు మొత్తం రూ.5 లక్షలను ఎల్వోసీ మంజూరు చేశారని గురువారం బండలింగంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ బాల్‌రాజ్ నర్సాగౌడ్ చెప్పారు. అండగా నిలిచిన మంత్రి కేటీఆర్‌కు బాలుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



## ఆపద్బంధు కింద 5 జిల్లాలకు 87 లక్షలు

- పెండింగ్ బిల్లులు క్లియర్‌చేస్తూ ఉత్తర్వులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆపద్బంధు పథకం కింద ఐదు జిల్లాలకు రూ.87 లక్షల పెండింగ్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదలచేసింది. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీచేసింది. వికారాబాద్ జిల్లాకు రూ.38.50 లక్షలు, వనపర్తికి రూ.32 లక్షలు, మేడ్చల్-మల్కాజిగిరికి రూ.9 లక్షలు, కరీంనగర్‌కు రూ.3 లక్షలు, యాదాద్రి-భువనగిరికి రూ.4.50 లక్షలు విడుదలయ్యాయి. ఈ పథకం కింద 2010-11 నుంచి 2017-18 వరకు రూ.2.89 కోట్లను ప్రభుత్వం గతంలోనే మంజూరుచేసింది. వివిధ కారణాల వల్ల నిలిచిపోయిన రూ.87 లక్షలను ఇప్పుడు ఇచ్చింది.

## ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

- రెండోరోజు 96.31 శాతం హాజరు
- 22 మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. గురువారం నిర్వహించిన ద్వితీయ సంవత్సరం సెకండ్ లాంగ్వేజీ పేపర్- 2 పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 4,18,944 మంది విద్యార్థులకు 4,03,459 (96.31శాతం) మంది హాజరయ్యారు. 15,483 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాలేదు. రాష్ట్రంలో మొత్తం 22 మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదైనట్టు ఇంటర్ బోర్డు సెక్రటరీ సయ్యద్ ఒమర్ జలీల్ తెలిపారు. ఇందులో నిజామాబాద్‌లో 2, యాదాద్రిలో 5, రంగారెడ్డిలో 12, మహబూబ్‌నగర్, మెదక్, నారాయణపేట జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున మాల్‌ప్రాక్టీస్ కేసులను అధికారులు బుక్‌చేశారని చెప్పారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు సంబంధించి ప్రశ్నాపత్రం బుక్‌లెట్ సెట్-బీ కోడ్‌ను నిర్ణయించారు.

## టెన్త్ హాల్‌టికెట్ల పంపిణీ ప్రారంభం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఈ నెల 19వ తేదీనుంచి ప్రారంభంకానున్న పదో తరగతి పరీక్షల హాల్‌టికెట్ల పంపిణీ ప్రక్రియ ప్రారంభించినట్టు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ ఏ సత్యనారాయణరెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 5.50 లక్షల మంది విద్యార్థులు పరీక్షలకు ఫీజు చెల్లించారని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా స్కూల్ హెడ్ మాస్టర్లకు హాల్‌టికెట్లు అందజేస్తున్నామని చెప్పారు. తమ స్కూళ్ల నుంచి విద్యార్థులు వాటిని పొందవచ్చన్నారు. పరీక్షలకు వారంరోజుల ముందు ఎస్‌ఎస్‌సీ బోర్డు వెబ్‌సైట్‌లో కూడా హాల్‌టికెట్లను అందుబాటులో ఉంచుతామని, ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని సూచించారు. పరీక్షల నిర్వహణకు అన్నిఏర్పాట్లు పూర్తిచేస్తున్నామని వివరించారు.

# ధైర్యమే ఆయుధం

- నేటితరం మహిళలు, యువతులు అధైర్యపడవద్దు
- రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ ఉద్బోధ
- హైదరాబాద్ సిటీపోలీస్ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**సుల్తాన్‌బజార్:** నేటితరం మహిళలు, యువతులు, విద్యార్థినులు ధైర్యంగా ముందుకుసాగాలని, ధైర్యమే ఆయుధమని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ పేర్కొన్నారు. హైదరాబాద్ సిటీపోలీస్, షీ టీమ్స్, భరోసా కేంద్రాల సంయుక్తాధ్వర్యంలో కోఠి మహిళా కళాశాలలో గురువారం అంతర్జాతీయ మహిళాదినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గవర్నర్ ఆయా రంగాలలో ఉత్తమ ప్రతిభ కనబరచిన మహిళలకు అవార్డులను అందజేసి సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మహిళల భద్రతకోసం పోలీసుల చేస్తున్నకృషి అభినందనీయమన్నారు. తాను తంజావూరు మెడికల్ కళాశాలలో విద్యార్థినిగా ఉన్న సమయంలో ర్యాగింగ్‌కు పాల్పడిన సీనియర్లను అడ్డుకున్నానని చెప్పారు. మహిళలు, యువతులు, విద్యార్థినులు



గురువారం కోఠి మహిళా కాలేజీలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళాదినోత్సవంలో మాట్లాడుతున్న గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్

ఆత్మరక్షణ విద్యలో శిక్షణపొంది తమనుతాము రక్షించుకుంటూనే ఇబ్బందులకు గురిచేసేవారిని అక్కడే శిక్షించాలని చెప్పారు. పిరికిపందలా ఆత్మహత్యలు చేసుకోవద్దని హితవుపలికారు. హుస్సేన్‌సాగర్‌లో దూకి ఆత్మహత్యకు ప్రయత్నించిన సుమారు 200 మంది మహిళలను కాపాడిన లేక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ధనలక్ష్మిని ప్రత్యేకంగా అభినందించారు. నగర పోలీస్ కమిషనర్ అంజనీకుమార్ మాట్లాడుతూ.. నగరంలో షీటీమ్స్, భరోసా కేంద్రాలతో మహిళలకు ప్రత్యేక రక్షణ కల్పిస్తున్నామని చెప్పారు. యువతులు, విద్యార్థినులు ఎటువంటి ఆపదలో ఉన్నా 100కు డయల్‌చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెషన్స్‌జడ్జి సునీత, పద్మశ్రీ అవార్డు గ్రహీత ఐఎఫ్‌ఎస్‌వో ఎండీ మంజులవాణి, వనితా టీవీచానెల్ వ్యవస్థాపకురాలు తుమ్మల రమాదేవి, ప్రాసిక్యూషన్ డైరెక్టర్ వైజయంతి, ఫిట్‌నెస్ గురు దినాజ్, కోఠి మహిళాకళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రోజారాణి, ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శశికళారెడ్డి, డీసీపీలు రమేశ్‌రెడ్డి, బాబురావు, కరుణాకర్‌రెడ్డి, అదనపు డీసీపీ గోవింద్‌రెడ్డి, సునీతారెడ్డి, ఏసీపీలు పీ దేవేందర్, శ్రీనివాస్‌రెడ్డి, జ్యోతి, ప్రసాద్, శ్రీదేవి, సీఐలు కే సుబ్బరామిరెడ్డి, పీజీరెడ్డి, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.



మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి

## రాష్ట్రంలో మహిళల భద్రతకు పెద్దపీట

- టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి
- సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మహిళలు ధైర్యంగా, భరోసాగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకొంటున్నదని, మహిళల భద్రకు పెద్దపీట వేస్తున్నదని టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. మహిళలున్నచోటే లక్ష్మీదేవి ఉంటుందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని టీఎన్జీవో ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సమాజం ఎంతో అభివృద్ధి చెందుతున్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో మహిళలపై అఘాయిత్యాలు చోటుచేసుకోవడం బాధాకరమన్నారు. మహిళలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, మహిళా విభాగం అధ్యక్షురాలు రేచల్, కోశాధికారి రామినేని శ్రీనివాస్‌రావు, హైదరాబాద్ జిల్లా, సిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌ఎం ముజీబ్ హుస్సేన్, రాయకంటి ప్రతాప్, ప్రభాకర్, శ్రీకాంత్, ప్రతినిధులు లక్ష్మణ్, బుచ్చిరెడ్డి, వెంకటేశ్వర్లు, కొండల్‌రెడ్డి, చంద్రశేఖర్, ఉమాదేవి, గీత, అనిత, లలిత, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఐటీలో అద్భుత పురోగతి

- ఎగుమతుల్లో దేశానికే తెలంగాణ ఆదర్శం
- 'ఇండియా సాఫ్ట్-2020' సదస్సులో మంత్రి ఎర్రబెల్లి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సమాచార సాంకేతిక పరిజ్ఞాన (ఐటీ) ఎగుమతుల్లో తెలంగాణ అద్భుత పురోగతిని సాధిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం హెచ్‌ఐసీసీలో 'ఇండియా సాఫ్ట్-2020' 20వ సదస్సు ప్రారంభం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐటీ ఎగుమతుల్లో తెలంగాణ గతేడాది 17 శాతం, ఈ ఏడాది 18 శాతం వృద్ధి సాధించిందని, 8 శాతంగా ఉన్న జాతీయ సగటు వృద్ధితో పోలిస్తే ఇది ఎంతో ఎక్కువని తెలిపారు. యాపిల్, అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్ లాంటి ప్రపంచస్థాయి కంపెనీలకు హైదరాబాద్ సరైన వేదికగా నిలుస్తున్నదని, ఈ సంస్థలన్నీ తమ రెండో అతిపెద్ద క్యాంపస్‌లను హైదరాబాద్‌లోనే ఏర్పాటుచేశాయని పేర్కొన్నారు. ఐటీ సంస్థలు గతేడాది హైదరాబాద్‌లో 14 మిలియన్ల చదరపు ఆఫీస్ స్పేస్‌ను వినియోగించుకొన్నాయని, ఇది దేశంలోనే అత్యధికమని స్పష్టంచేశారు. ఇండియాలోనే అతిపెద్ద ఇంక్యుబేషన్ సెంటర్ అయిన టీ-హబ్ ప్రస్తుతం రెండో కేంద్రాన్ని ప్రారంభించనున్నదని, ఇది ప్రపంచంలోనే రెండో అతిపెద్ద ఇంక్యుబేషన్ సెంటర్‌గా నిలుస్తుందని చెప్పారు. ప్రపంచంలోనే అత్యుత్తమ పర్యావరణ పరిస్థితులు తెలంగాణలో ఉన్నాయని, ఐటీ రంగానికి కేంద్రమైన బెంగళూరు నగరాన్ని హైదరాబాద్ అధిగమించడం ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ సంయుక్త కార్యదర్శి అరుణ్‌గోయల్ మాట్లాడుతూ.. దేశంలో డిజిటల్ టెక్నాలజీ విప్లవం ప్రారంభమైందని, ఐటీరంగంలో భారత్ గ్లోబల్ లీడర్‌గా నిలుస్తుందని చెప్పారు. ఈ సదస్సులో ఇండియా సాఫ్ట్ చైర్మన్ నలిన్‌కోహ్లీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ చైర్మన్ మన్‌దీప్‌సింగ్‌పురి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు వీహబ్ బాసట

- రాష్ట్రప్రభుత్వ సహకారంతో ఔత్సాహికులకు చేయూత
- సంస్థ ద్వితీయ వార్షికోత్సవంలో సీఈవో దీప్తి రావుల



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వివిధ రంగాలపట్ల ఆసక్తిగల మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని వీహబ్ సీఈవో దీప్తి రావుల ఆకాంక్షించారు. దేశంలోనే మొదటిసారిగా మహిళా పారిశ్రామికవేత్తల కోసం ఏర్పాటుచేసిన ఇంక్యుబేటర్ 'వీ-హబ్' అని, ఇటువంటిది ఏ రాష్ట్రంలోనూ లేదని పేర్కొన్నారు. సంస్థ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మహిళా పారిశ్రామికవేత్తలను బలోపేతం చేసేందుకే వీహబ్ పనిచేస్తుందని చెప్పారు. ఔత్సాహిక మహిళలకు సాంకేతిక, ఆర్థిక, విధానపరమైన సహకారాన్ని అందిస్తున్నామని తెలిపారు. మహిళా పారిశ్రామికవేత్తలు ఎదుర్కొంటున్న మార్కెటింగ్ సమస్యను అధిగమించేలా వారిని ప్రోత్సహిస్తూ, అవకాశాలు కూడా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. రంగాలవారీగా మొదటి విడతలో 26 ఇంక్యుబేటర్లను ప్రోత్సహించామని, రెండోవిడతలో 16 ఇంక్యుబేటర్లకు ప్రోత్సహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో అవకాశంకోసం ఎదురుచూస్తున్న, నైపుణ్యం కలిగిన మహిళా పారిశ్రామికవేత్తలకు సహకారం అందజేస్తున్నట్టు చెప్పారు. తెలంగాణలోని 9 జిల్లాల్లో ఇంక్యుబేషన్, యాక్సిలరేషన్ కార్యక్రమం కొనసాగుతున్నదని దీప్తి రావుల తెలిపారు. పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు విద్యార్థిదశ నుంచే బాలికలు దృష్టిసారించే లా వీహబ్ పనిచేస్తుందన్నారు. 62 స్టార్టప్‌లకు వీహబ్ ద్వారా నేరుగా ప్రోత్సాహం అందించామని, ప్రతినెలా 200కుపైగా బయటనుంచి వచ్చే స్టార్టప్‌లకు అవసరమైన చేయూతను ఇస్తున్నామని దీప్తి పేర్కొన్నారు. వచ్చే ఏడాది నాటికి అన్ని జిల్లాల్లో ఇంక్యుబేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు.

# నూతన సచివాలయం అవసరం

- ప్రస్తుత పిటిషన్లకు విచారణార్హత లేదు
- హైకోర్టుకు తెలిపిన ఏజీ బీఎస్ ప్రసాద్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తలమానికంగా నిలిచే సమీకృత సచివాలయ భవనం రాష్ట్రానికి అవసరమని ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. సచివాలయ నిర్మాణం విషయంలో ప్రభుత్వం ముందుకు వెళ్లేలా ఆదేశాలు జారీచేయాలని అడ్వకేట్ జనరల్ బండా శివానంద ప్రసాద్ హైకోర్టుకు విజ్ఞప్తిచేశారు. ప్రస్తుత సచివాలయ భవనాల కూల్చివేతపై దాఖలైన పిటిషన్లపై చీఫ్ జస్టిస్ రాఘవేంద్ర సింగ్ చౌహాన్, జస్టిస్ అభిషేక్‌రెడ్డి ధర్మాసనం గురువారం మరోమారు విచారణ చేపట్టింది. ఏజీ వాదనలు కొనసాగిస్తూ.. నూతన సచివాలయ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లకు విచారణార్హత లేదని, రాజకీయ ప్రత్యర్థులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పిటిషన్లు వేశారని పేర్కొన్నారు. ప్రైవేటు వ్యక్తుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తే కోర్టులు అడ్డుకోవచ్చుని, ప్రస్తుతం నిర్మించతలపెట్టిన భవనం రాష్ట్ర పరిపాలనకు కేంద్రంగా ఉండే సచివాలయమని తెలిపారు. ప్రస్తుత పిటిషన్లకు విచారణార్హత లేదని, వాటిని కొట్టేయాలని విజ్ఞప్తిచేశారు. మరోవైపు పిటిషనర్లు రేవంత్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్‌రావు తరపు న్యాయవాదులు వాదనలు కొనసాగిస్తూ ప్రభుత్వ నిర్ణయం ఏకపక్షమని పేర్కొన్నారు.

**ప్రభుత్వానికి సెల్యూట్**

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తరపున సీనియర్ న్యాయవాది సత్యంరెడ్డి వాదనలు వినిపిస్తూ నీటిపారుదల రంగంలో ప్రభుత్వం గొప్ప కృషి చేస్తున్నదని, ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వ చొరవ గొప్పదని కొనియాడారు. కాళేశ్వరం తదితర ప్రాజెక్టులు కడుతున్న ప్రభుత్వానికి సెల్యూట్ చేస్తామని తెలిపారు. ప్రస్తుతం పనిచేస్తున్న సచివాలయ భవనాలను కూల్చకుండా అడ్డుకోవాలని కోరారు. వాదనలు నమోదుచేసుకున్న ధర్మాసనం.. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదావేసింది.


**OSMANIA UNIVERSITY, HYDERABAD**
**NOTIFICATION**
**TSLAWCET / TSPGLCET-2020**
(Conducted under the aegis of TSCHE, Government of Telangana State, Hyderabad)

TS Law Common Entrance Test **(TSLAWCET-2020)** for admission into 3/5 years L.L.B. Courses and TS PG Law Common Entrance Test **(TSPGLCET-2020)** for admission into 2-years **LL.M.** courses offered by State Universities in Telangana including their affiliated colleges for the academic year **2020-21** will be conducted by Osmania University, Hyderabad Telangana State. Eligible candidates shall apply only through online mode from **06-03-2020 to 06-04-2020** (without late fee), and may log onto **https://lawcet.tsche.ac.in** for detailed information.

| Test | Date and Time | Registration Fee |
|---|---|---|
| TS LAWCET-2020 | 27-05-2020 (11.00 AM - 12.30 PM) | Rs. 800 (Rs. 500/- for SC/ST & PH) |
| TS PGLAWCET-2020 | 27-05-2020 (11.00 AM-12.30 PM) | Rs. 1000/- (Rs. 800/- for SC/ST & PH) |

The Registration fee may be paid at **TS/AP online Centres in Telangana State and Andhra Pradesh,** and also **through payment gateway** mentioned in Application.
**Date: 02-03-2020** **Convener**
**Place: Hyderabad** **TSLAWCET/TSPGLCET-2020**
DIPR R.O. No. 800-PP/CL/Advt/1/2019-20, Dt: 05-03-2020

**KAKATIYA UNIVERSITY, WARANGAL**
**TSICET-2020 NOTIFICATION**
(Telangana State Integrated Common Entrance Test for MBA and MCA Courses Conducted on Behalf of TSCHE)

A Common Entrance Test, designated as Telangana State Integrated Common Entrance Test-2020 (TSICET-2020) of Telangana State will be conducted (as per G.O.Ms.No. 25, dated:19-03-2004; G.O.Ms.No. 108, dated: 30-07-2005; G.O.Ms.No.66, dated:15-07-2011, and G.O.Ms. No.5, dated: 02-08-2014; G.O.Ms.No.7, dated: 05-08-2014; G.O.Ms.No.33, dated: 31-12-2014, and G.O.Ms.No. 22, dated: 27-07-2019 of Higher Education Department) by Kakatiya University, Warangal for admission into first year. a) **Master of Business Administration (M.B.A.)** and b) **Master of Computer Applications (M.C.A)** for the academic year 2020-21 in the State of Telangana.
**Eligible Candidates who wish to apply for TSICET-2020 may submit their applications through online mode only from 09-03-2020 to 30-04-2020 (without late fee)**. The detailed information regarding the eligibility, syllabus and model paper, related instructions, procedure for online submission of applications, online examination, the list of online examination centers and Mock Tests are also available on the website https://icet.tsche.ac.in

| DATE OF TSICET-2020 EXAMINATION | TIME OF THE TEST | REGISTRATION FEE |
|---|---|---|
| 20-05-2020 (Wednesday) | (FN) 10.00 A.M to 12.30 P.M | Rs. 650/- |
| | (AN) 2.30 P.M. to 5.00 P.M. | Rs. 450/- (in case of SC/ST |
| 21-05-2020 (Thursday) | (FN) 10.00 A.M. to 12.30 P.M. | and Differently Abled Candidates) |

The Registration fee may be paid at TS/AP Online Centres in TS and AP, and also through payment gateway (Credit Card/Debit Card/Net Banking)
**Warangal, Date: 06-03-2020** **CONVENER, TSICET-2020**
DIPR R.O. No. 799-PP/CL/Advt/1/2019-20, Dt: 05-03-2020

**APPOINTMENTS**

**Join The Educational Leader**
Recognition, Name and A-SIX DIGIT PAY PACKAGE !
Invites experienced teachers to train the next generation students with the latest methodologies in State / CBSE orientation
**Sri Chaitanya School**
Techno Curriculum
The right mentor for IIT (JEE), Medical, Olympiad & all other Competitive Exams
SRI CHAITANYA
**PRINCIPALS** P.G with B.Ed., must have 5-10 years exp.
**VICE PRINCIPALS** P.G with B.Ed., must have 2-3 years exp.
**PRE-PRIMARY INCHARGES** P.G/Graduates with B.Ed./PPTTC, min. 2 years exp.
**PRIMARY INCHARGES** P.G/Graduates with B.Ed., min. 3 years exp.
**Teachers for Pre-Primary, Primary & High School**
PG/Graduate/B.Ed, with at least 2 years experience in teaching Maths, Physics, Chemistry, Biology, Botany, Zoology, Gen. Science, Social, Hindi, English, Sanskrit, Telugu, French, Computers, Calligraphy (Handwriting).
**Reasoning & Arithmetic, Social faculty for Civil Service Batch.**
**Civil aspirants who successfully cleared mains will be given higher pay.**
Teachers for PET, Dance, Music, Karate, Yoga, Arts & Crafts | DTP Operators
Receptionists | Board Incharges with at least 2 years experience.
Accountants: B.Com, M.Com, MBA (freshers/experienced)
Store Incharges: UG/PG (freshers/experienced)
**WALK-IN 7th, 8th & 14th, 15th of March 2020**
for an Interview with original certificates
between 9.00 am and 5.00 pm at the centres mentioned below
(OR) mail your resume within a week to: recruitment@srichaitanyaschool.net

| | |
|---|---|
| Suncity (Hyderabad) | H.No: 1-2/1, Shanthi Nagar Colony, Oop: Kasturba Gandhi National Memorial Trust, Hydershakote, Suncity, RR District Ph : 9000905208 / 9000947700 |
| S R Nagar | D. No: 7-1-621/280 & 281, 254 & 255 - 3RT, Above SBI Bank, S. R. Nagar, Hyderabad, 500038 Ph : 8008904121 / 0204 / 4279 |
| Dilsuknagar | H.No:3-10/A,Hanuman Nagar, Behind Swagath Restaurant, Chaitanyapuri,Hyderbad-500060. Ph : 8008904850 / 4851 / 4852 |
| Kompally 4 | Sri Chaitanya School, Beside SNR Garden, Kompally, Hyderabad Ph : 9000934141,8978145584 |
| Kukatpally | Plot No:6, beside post office, Balaji Nagar, Kukatpally-500072. Ph : 9000925544, 9000944399, 9000921091 |
| Serilingampally | Plot No:20, 21, Ajay Function Hall, Huda Trade Center,Beside Nallagandla Flyover, Serilingampally, Rangareddy(D)-500019. Ph : 9000962518, 9000903675, 8008904133 |
| East Maredpally | 10-3-18/4, Opp: Oriental Bank Of Commerce, East Maredpally, Hyderabad - 500026. Ph : 7702789709,9000905501 |
| Ecil 4 | P.No. A/10, Electronic Complex, Kushaiguda, ECIL X Road, Hyderabad-500062 Ph : 9000979888 /8008904846 |
| Mehdipatnam | Plot No:3, Santosh Nagar Colony, St.Ann's Women's college Road, Opp. Ratandeep Super Market, Mehdipatnam, Hyd: 500028 Ph : 8008575165,8008575142 |
| Nallakunta | H.No:1-9-1104 To 1112,Opp Lane To Durgabai Deshmukh Hospital, Vidyangar,Adikmet, Hyderbad-500044 Ph : 8008900193,8008575139, 9000999522 |
| Kodad | Sai Mourya towers,Near Sana College,Kodad, (Post& MD) Suryapet-Pin 508206 Ph : 8008904875 / 4872, 9000097677 |

www.srichaitanyaschool.net




2016లో పొత్తూరి వెంకటేశ్వర్‌రావు జన్మదినం సందర్భంగా ఆయన ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలియజేస్తున్న సీఎం కేసీఆర్ (ఫైల్)



గురువారం హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని నివాసంలో పొత్తూరి పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

# పొత్తూరి ఇకలేరు

మొదటిపేజీ తరువాయి...

ఆయనచేసిన కృషిని కొనియాడారు. తెలంగాణ ఉద్యమసమయంలో పొత్తూరి వెంకటేశ్వర్‌రావు అందించిన నైతిక మద్దతును సీఎం గుర్తుచేసుకొన్నారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. పొత్తూరి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తెలుగు జర్నలిజానికి వన్నెతెచ్చిన వ్యక్తుల్లో ఒకరిగా పొత్తూరి చరిత్రలో నిలిచిపోతారని పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ కొనియాడారు. నిఖార్సయిన జర్నలిజంతో ఎందరికో మార్గదర్శిగా నిలిచిన వ్యక్తి పొత్తూరి అని ఆర్థికమంత్రి హరీశ్‌రావు అన్నారు. ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు మహమూద్ అలీ, ఎర్రబెల్లి దయాకర్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఇంద్రకరణ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, ప్రణాళికాసంఘం వైస్‌చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, డీజీపీ మహేందర్‌రెడ్డి, ఆర్టీఐ కమిషనర్ కట్టా శేఖర్‌రెడ్డి, మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు జూలూరు గౌరీశంకర్ తదితరులు పొత్తూరి మృతి పట్ల తమ సంతాపాన్ని తెలియజేశారు. పొత్తూరి మరణవార్త తెలియగానే పాత్రికేయులు, ప్రముఖులు ఆయన ఇంటికి చేరుకొని నివాళులర్పించారు. ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, ఎమ్మెల్యే క్రాంతికిరణ్, ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, సీనియర్ పాత్రికేయులు కే శ్రీనివాస్‌రెడ్డి, కే శ్రీనివాస్, కే రామచంద్రమూర్తి, ఏబీకే ప్రసాద్, ఐ వెంకట్రావు, దేవులపల్లి అమర్, సీఎం సీపీఆర్వో వనం జ్వాలా నరసింహారావు, విద్యావేత్త చుక్కా రామయ్య, ప్రముఖ కవి, కార్టూనిస్ట్ దేవీప్రియ, వంశీ రామరాజు, ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్, వనమాల, వకుళాభరణం రామకృష్ణ, పాశం యాదగిరి, గద్దర్, రమా మెల్కోటే, రాందాస్, టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి విరహత్ అలీ, ఐజేయూ కార్యదర్శి నరేందర్‌రెడ్డి, ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కేఎన్ హరి , నవతెలంగాణ సంపాదకుడు వీరయ్య, మానవ హక్కులవేదిక సభ్యులు ఎస్ జీవన్ కుమార్, బండారు శ్రీనివాస్‌రావు, అంజద్ అలీఖాన్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పొత్తూరి వెంకటేశ్వర్‌రావు పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రగాఢ సంతాపాన్ని తెలిపింది. పొత్తూరి అంత్యక్రియలు గురువారం సాయంత్రం మహాప్రస్థానం శ్మశానవాటికలో ముగిశాయి. ఆయనకు భార్య సత్యవాణి (79), ఇద్దరు కుమారులు ప్రేమగోపాల్, రహీ ప్రకాశ్, ఇద్దరు కుమార్తెలు వాత్సల్య, పద్మజ ఉన్నారు.

**గొప్ప ఆధ్యాత్మికవేత్త**

బాహ్య ప్రపంచానికి పొత్తూరి వేంకటేశ్వరరావు గొప్ప పాత్రికేయుడిగా, రచయితగా మాత్రమే తెలుసు. కానీ ఆయన గొప్ప ఆధ్యాత్మిక సాధకుడు. కుర్తాళ శ్రీసిద్ధేశ్వరీపీఠ ధర్మాధికారిగా వ్యవహరించారు. ఆయన ఓ కర్మయోగి. అటువంటి మేధావి, మైత్రీ హృదయుడైన పొత్తూరి మరణం.. బాల్యమిత్రుడిగా నాకు, కుర్తాళం పీఠానికి తీరనిలోటు

– శ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి, కుర్తాళం సిద్ధేశ్వరీ పీఠం

**నైతిక విలువలున్న మానవతామూర్తి**

జర్నలిస్ట్‌గానే కాక మానవతా, నైతిక విలువలు కాపాడిన పాత్రికేయుడిగా పొత్తూరి వెంకటేశ్వర్‌రావు ప్రసిద్ధిగాంచారు. మీడియాలో ఐదు దశాబ్దాలకు పైగా సేవలందించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రెస్‌అకాడమీ చైర్మన్‌గా పనిచేశారు. ఆయన 1934 ఫిబ్రవరి 8న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా పొత్తూరులో వెంకటసుబ్బయ్య, గంగమ్మ దంపతులకు జన్మించారు. ఈనాడు, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ, ఉదయం, వార్త మొదలైన పత్రికల్లో సుదీర్ఘకాలం సంపాదకుడిగా పనిచేశారు. వెంకటేశ్వర్ రావు 1957లో ఆంధ్రజనత పత్రికతో పాత్రికేయ ప్రస్థానం ప్రారంభించారు. సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ అంశాలపై అనేక రచనలుచేశారు.

## సెన్సార్‌బోర్డు ప్రాంతీయ అధికారిగా బాలకృష్ణ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సెంట్రల్ బోర్డు ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సెన్సార్ బోర్డ్) ప్రాంతీయ అధికారిగా వీ బాలకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ అధికారయిన ఆయన ఇప్పటివరకు సమాచార, ప్రసార మంత్రిత్వశాఖలో క్షేత్ర ప్రచార అధికారిగా, యోజన తెలుగు మాసపత్రిక ఎడిటర్‌గా, ఆలిండియా రేడియో న్యూస్ ఎడిటర్‌గా, పత్రికా సమాచార కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఇద్దరు ఉపరాష్ట్రపతుల వద్ద సమాచార అధికారిగా పనిచేసి బదిలీపై హైదరాబాద్ సెన్సార్‌బోర్డు ప్రాంతీయ అధికారిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇకనుంచి ఎలాంటి జాప్యంలేకుండా సెన్సార్ ధ్రువీకరణపత్రాలను జారీచేస్తానని తెలిపారు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన దవాఖాన - 1, భద్రాచలం ఏరియా దవాఖాన - 1కి అధునాతన అంబులెన్స్‌లను మంజూరుచేస్తూ జారీచేసిన ఉత్తర్వులను గురువారం హైదరాబాద్‌లో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు అందజేస్తున్న హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (హడ్కో) రీజినల్ చీఫ్ ఎల్వీఎస్ సుధాకర్‌బాబు

# పారాసెటమాల్ చాలు!

**కరోనాపై ఆందోళన వద్దన్న**
**ప్రముఖ శాస్త్రవేత్త గగన్‌దీప్ కంగ్**



గగన్‌దీప్ కంగ్

**న్యూఢిల్లీ, మార్చి 5:** కరోనా గురించి అంతగా భయపడాల్సిన అవసరంలేదని ప్రముఖ శాస్త్రవేత్త గగన్‌దీప్ కంగ్ తెలిపారు. కరోనా సోకినట్టు నిర్ధారితమైన ప్రతి ఐదు కేసుల్లో నలుగురు తమకు తాముగా కోలుకునే అవకాశాలు అధికంగా ఉన్నాయని తెలిపారు. దగ్గు, జ్వరం తగ్గడానికి పారాసెటమాల్ వంటి మందుల్ని వాళ్లు తీసుకుంటే సరిపోతుందన్నారు. మిగిలిన ఒక్కరు మాత్రమే డాక్టర్‌ని సంప్రదించాలన్నారు. 'కరోనా గురించి ప్రతి ఒక్కరూ అంతగా భయపడాల్సిన అవసరం లేదు. రోజూ మనం ఎన్నో వైరస్‌లకు ప్రభావితం అవుతుంటాం. అయితే వాటి నుంచి కాపాడుకోవడానికి చేతుల్ని పరిశుభ్రంగా కడుక్కోవడం, క్రిముల్ని చంపే ద్రవాలతో ఇంట్లో నేలను శుభ్రంగా తుడుచుకోవడం, ముఖాన్ని తరుచూ చేతులతో తడుముకోకుండా ఉంటే సరిపోతుంది' అని గగన్‌దీప్ తెలిపారు. 'ఫ్లూ'తో పోలిస్తే కరోనా కొంత తీవ్రమైన వ్యాధి అయినప్పటికీ, 'సార్స్' అంతటి ప్రమాదకరమైనది కాదన్నారు. పెద్ద వయస్కులు, గుండెజబ్బులతో బాధపడేవారు, బీపీ, డయాబెటిస్ ఉన్నవారికి ఇది సోకే అవకాశం ఎక్కువగా ఉందన్న గగన్‌దీప్.. శ్వాస సమస్యలతో బాధపడుతున్న వారు మాత్రం వీలైనంత తొందరగా వైద్య సహాయం తీసుకోవాలని సూచించారు.

## మోదీ పర్యటన రద్దు



**న్యూఢిల్లీ:** ప్రధాని మోదీ పర్యటనపై కొవిడ్-19 ప్రభావం పడింది. బెల్జియం రాజధాని బ్రస్సెల్స్‌లో ఈ నెల 13 నుంచి ఇండో-ఈయూ సదస్సు జరుగాల్సి ఉన్నది. అయితే ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో కార్యక్రమం వాయిదా పడిందని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రవీశ్‌కుమార్ తెలిపారు. వైద్యాధికారుల సూచన మేరకు మోదీ తన పర్యటనను రద్దు చేసుకున్నారన్నారు. అదేవిధంగా ఇరాన్‌లోని భారతీయుల్లో ఎవరికీ వైరస్ సోకలేదని తెలిపారు. మన దేశానికి చెందిన నిపుణులు త్వరలో ఖోమ్ నగరంలో ల్యాబ్ ఏర్పాటుచేస్తారన్నారు.

## దుబాయ్‌లోని భారతీయ బాలికకు వైరస్

**అబుదాబి:** దుబాయ్‌లో నివసిస్తున్న 16 ఏండ్ల భారతీయ బాలికకు కరోనా సోకింది. ఆమె తండ్రి ఐదు రోజుల కిందటే విదేశాల నుంచి తిరిగి వచ్చినట్టు గుర్తించారు. ఆయన ద్వారా బాలికకు వైరస్ సోకిందని అధికారులు భావిస్తున్నారు. బాలికతోపాటు ఆమె కుటుంబ సభ్యులందరినీ వైద్యుల పర్యవేక్షణలో ఉంచి పరీక్షిస్తున్నారు. ఆ బాలిక ప్రస్తుతం దుబాయ్‌లోని 'ఇండియన్ హైస్కూల్'లో చదువుతున్నదన్నారు. ముందస్తు చర్యగా గురువారం నుంచి ఆ సంస్థకు చెందిన పాఠశాలలను మూసివేస్తున్నట్టు ప్రకటించారు. విద్యార్థులు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

## ఢిల్లీలో 31 వరకు స్కూళ్లు బంద్



**న్యూఢిల్లీ:** కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఢిల్లీలోని ప్రాథమిక పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. పిల్లలు త్వరగా వ్యాధిబారిన పడే అవకాశాలు ఉండటంతో ఈ నెల 31 వరకు సెలవులు ఇస్తున్నట్టు ఢిల్లీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా తెలిపారు. పైస్థాయి విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది యథావిధిగా హాజరు కావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. మరోవైపు వైరస్ వ్యాప్తిచెందే అవకాశం ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని కార్యాలయాల్లో బయోమెట్రిక్ హాజరును నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశించింది.





కేరళలో 'కరోనా' వార్డు నుంచి వ్యర్థాలను బయటికి తెస్తున్న సిబ్బంది (ఫైల్)

# దిక్సూచి.. కేరళ

**కరోనా నియంత్రణలో దేశానికే ఆదర్శం**
**ముగ్గురు రోగులకు విజయవంతంగా చికిత్స**
**వ్యాధి వ్యాప్తి చెందకుండా కట్టుదిట్టమైన చర్యలు**

**తిరువనంతపురం:** కరోనా వైరస్‌పై కేరళ ప్రభుత్వం సాధించిన విజయం దేశానికి దిక్సూచిలా నిలుస్తున్నది. భారత్‌లో మొట్టమొదటి కరోనా కేసులు కేరళలో నమోదైన సంగతి తెలిసిందే. చైనాలోని వుహాన్ నుంచి వచ్చిన ముగ్గురు వైద్యవిద్యార్థులకు వైరస్ సోకింది.కేరళ వైద్యులు వారికి చికిత్స అందించి కోలుకొనేలా చేశారు. ప్రస్తుతం వారు స్వేచ్ఛగా తిరుగుతున్నారు. దీంతో ఇప్పుడు దేశం మొత్తం కేరళ వైపు చూస్తున్నది. ఈ నేపథ్యంలో కొవిడ్-19 నియంత్రణకు తాము తీసుకున్న చర్యలను కేరళ వైద్యాధికారులు వివరించారు. అవి..

- కేరళలో వైద్యారోగ్యశాఖ మంత్రి, ఆ శాఖ ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయిలో ఉన్న హెల్త్ వర్కర్ల వరకు బలమైన నెట్‌వర్క్ నిర్మించారు.
- కరోనా ప్రభావిత దేశాల నుంచి వచ్చిన వారికి పరీక్షలు నిర్వహించారు. వైరస్ సోకిన లక్షణాలు ఏమాత్రం కనిపించినా దవాఖానకు తరలించారు.
- రోగులకు చికిత్స అందించేందుకు శిక్షణ పొందిన వైద్యసిబ్బందిని నియమించారు. పరిస్థితిపై ఉన్నతాధికారులు రోజువారీ సమీక్షిస్తున్నారు.
- చికిత్స కోసం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ రూపొందించిన మార్గదర్శకాలను పాటిస్తున్నారు.
- రోగులకు 'హెచ్1ఎన్1' సహా శ్వాసకోస వ్యాధులకు సంబంధించిన అన్ని చికిత్సలు అందించారు. నిర్దేశిత స్థాయిలో యాంటీబయోటిక్స్, పోషకాహారం అందిస్తున్నారు.
- కేరళలో మంగళవారం నాటికి 23 మందిని దవాఖానల్లో ఉంచారు. 388 మందిని ఇండ్లకే పరిమితం చేశారు. 411 మంది అనుమానితులపై నిఘా ఉంచారు.

**28 రోజులు ఇండ్లల్లోనే..**

కేంద్రం మార్గదర్శకాల ప్రకారం.. విదేశాల నుంచి వచ్చినవారు, దవాఖాన నుంచి డిశ్చార్జి అయిన కరోనా బాధితులు 14 రోజులపాటు ఇండ్లకే పరిమితం కావాలి. కానీ.. కేరళ ప్రభుత్వం దీనిని 28 రోజులపాటు అమలు చేస్తున్నది. వారిపై నిఘా ఉంచుతున్నది. కరోనా లక్షణాలు కనిపిస్తున్నాయేమోనని ఎప్పటికప్పుడు పరీక్షిస్తున్నది.

**మానసికంగా.. సామాజికంగా అండ**

కరోనా బాధితులు మానసికంగా, సామాజికంగా సమస్యలు ఎదుర్కొంటున్నట్టు గుర్తించారు. బాధితుల్లో ఒత్తిడి, అత్యుత్సాహం వంటి మానసిక సమస్యలున్నట్టు గమనించారు. కరోనా అనుమానితులను, వారి కుటుంబాలను కలువడానికి, కనీసం వారు నివసించే వీధిలోకి వెళ్లడానికి కూడా స్థానికులు సాహసించడం లేదు. వారి వ్యాపారాలు కూడా నడవడం లేదు. పాఠశాలల్లోనూ వెక్కిరింపులు తప్పడం లేదు. దీనిని నివారించేందుకు కేరళ ప్రభుత్వం ఎస్‌ఎంఎస్‌ల ద్వారా, సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నది. బాధితుల ఫోన్లకు స్ఫూర్తినిచ్చే సందేశాలు పంపుతున్నది. దవాఖానలో, గృహ నిర్బంధంలో ఉన్నవారికి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నది. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 215 మందిని ప్రత్యేకంగా నియమించింది.

# కరోనా కట్టడికి చర్యలు

- **దేశవ్యాప్తంగా 28,529 మంది అనుమానితులపై నిఘా**
- **వైరస్ ప్రభావిత దేశస్థులకు వీసాలు రద్దు**
- **అన్ని రాష్ట్రాల్లో ప్రత్యేక వైద్య బృందాల ఏర్పాటు**
- **పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి హర్షవర్ధన్ ప్రకటన**
- **యూపీకి చెందిన వ్యక్తికి వైరస్.. 30కి పెరిగిన కేసులు**



**న్యూఢిల్లీ, మార్చి 5:** కరోనా వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు కేంద్రం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నదని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్ తెలిపారు. నియంత్రణ చర్యల్లో భాగంగా 28,529 మంది అనుమానితులపై నిఘా పెట్టామన్నారు. ప్రస్తుత పరిస్థితులపై గురువారం ఆయన పార్లమెంట్‌లో ప్రకటన చేశారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. ఈ నెల 4వ తేదీ నాటికి దేశవ్యాప్తంగా 29 మందికి వైరస్ సోకినట్టు నిర్ధారణ అయ్యిందన్నారు. వారందరి పరిస్థితి నిలకడగా ఉన్నదని చెప్పారు. వ్యాధి వ్యాప్తిని నియంత్రించేందుకు ఆరోగ్యశాఖతోపాటు ప్రభుత్వ శాఖలన్నీ సమిష్టిగా పనిచేస్తున్నాయన్నారు. పరిస్థితిపై ప్రధాని మోదీ స్వయంగా సమీక్షిస్తున్నారని తెలిపారు. వైరస్ ప్రభావం అధికంగా ఉన్న ఇటలీ, ఇరాన్, దక్షిణ కొరియా, జపాన్‌వాసులకు ఈ నెల 3వ తేదీ వరకు జారీ చేసిన అన్ని వీసాలను రద్దు చేసినట్టు తెలిపారు. భారతీయులు చైనా, ఇరాన్, ద.కొరియా, ఇటలీ, జపాన్‌కు అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని సూచనలు జారీ చేశామన్నారు.

**వారందరూ సురక్షితం**

చైనా నుంచి భారత్‌కు తరలించిన వారెవరికీ వైరస్ సోకలేదని చెప్పారు. మొదటి విడుతలో తీసుకొచ్చిన 654 మందిని, రెండో విడుతలో తరలించిన 112 మందిని 14 రోజులపాటు పరీక్షించామని తెలిపారు. పరీక్షల్లో నెగిటివ్ రావడంతో వారిని ఇండ్లకు పంపించామని వెల్లడించారు. జపాన్‌లోని డైమండ్ ప్రిన్సెస్ నౌక నుంచి తరలించిన 124 మందికి కూడా వైరస్ సోకలేదని తేలిందన్నారు. వారిని ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ఉంచామని, వారి ఆరోగ్యం నిలకడగా ఉన్నదన్నారు.

**మరో కరోనా కేసు నమోదు**

ఉత్తరప్రదేశ్‌లోని గజియాబాద్‌కు చెందిన ఒక వ్యక్తికి వైరస్ సోకినట్టు నిర్ధారించారు. అతడు ఇటీవలే ఇరాన్ నుంచి వచ్చినట్టు గుర్తించారు. దీంతో బాధితుల సంఖ్య 30కి చేరింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మరికొన్ని మార్గదర్శకాలను జారీ చేసింది. అన్ని రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు తక్షణ ప్రతిస్పందన బృందాలను ఏర్పాటుచేయాలని స్పష్టం చేసింది. ఇటలీ, దక్షిణ కొరియా తదితర కరోనా ప్రభావిత దేశాల నుంచి భారత్‌కు వచ్చేవారు ముందుగా వైద్య పరీక్షలు చేయించుకొని బయలుదేరాలని ఆదేశించింది. కొవిడ్-19 సోకలేదని అక్కడి వైద్య నిపుణులు ఇచ్చే నివేదికను కచ్చితంగా వెంట తెచ్చుకోవాలని చెప్పింది. ఆ పత్రాలను పరిశీలించిన తర్వాతే వారిని భారత్‌లోకి అనుమతిస్తామని స్పష్టం చేసింది. ఈ నిబంధన ఈ నెల 10వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని తెలిపింది. విదేశాల నుంచి తిరిగి వచ్చేవారు తమ పూర్తి వివరాలతో దరఖాస్తు నింపాలని ఆదేశించింది. మరోవైపు వైరస్ సోకిన 14 మంది ఇటలీ యాత్రికులను ఐటీబీపీ క్యాంప్ నుంచి గుర్గావ్‌లోని మేదాంత హాస్పిటల్‌కు తరలించి, చికిత్స అందిస్తున్నారు. మరో వ్యాధిగ్రస్థుడు, పేటీఎం సంస్థ ఉద్యోగి.. ఇటీవల 91 మందిని కలిసినట్టు అధికారులు గుర్తించారు. వారిలో ఐదుగురిని దవాఖానకు తరలించి వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. మిగతావారి కోసం వెతుకుతున్నారు.



గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో మాస్కులు ధరించి పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు




# అటకెక్కిన చదువులు

- **22 దేశాల్లో విద్యాసంస్థలకు సెలవులు**
- **30 కోట్ల మంది విద్యార్థులు ఇండ్లకే పరిమితం**

**రోమ్, మార్చి 5:** కరోనా వైరస్ ప్రభావం విద్యారంగంపైనా పడింది. ప్రస్తుతం దాదాపు 80 దేశాల్లో 95వేలకుపైగా బాధితులు నమోదయ్యారు. మరణాల సంఖ్య 3,200 దాటింది. ఈ నేపథ్యంలో ఆయా దేశాల ప్రభుత్వాలు పాఠశాలలకు సెలవులు ప్రకటిస్తున్నాయని యునెస్కో అధ్యక్షుడు ఆడ్రీ అజౌలే తెలిపారు. బుధవారం ప్రపంచవ్యాప్తంగా 13 దేశాలు పూర్తిగా, తొమ్మిది దేశాల్లోని వైరస్ ప్రభావిత ప్రాంతాల్లో సెలవులు ప్రకటించారని వెల్లడించారు. దీంతో గురువారం దాదాపు 30 కోట్ల మంది ఇండ్లకే పరిమితం అయ్యారన్నారు. చైనాలో నెల రోజులకుపైగా విద్యార్థులు ఇండ్లకే పరిమితం అయ్యారు. స్కూళ్ల మూసివేత ఇలాగే కొనసాగితే చదువులో దేశాల మధ్య అసమానతలు తీవ్రస్థాయికి చేరుతాయని, విద్యాహక్కుకు ముప్పుగా పరిణమిస్తుందని ఆడ్రీ ఆందోళన వ్యక్తంచేశారు. ఇటలీలో దేశవ్యాప్తంగా ఉన్న విద్యాసంస్థలకు ఈ నెల 15 వరకు, దక్షిణకొరియాలో ఈ నెల 23 వరకు, జపాన్‌లో ఈ నెల మొత్తం సెలవులు ప్రకటించారు. ఫ్రాన్స్‌లో వైరస్ ప్రభావిత ప్రాంతాల్లోని 120కి పైగా పాఠశాలలు మూతపడ్డాయి.

**చైనా తర్వాత ఇటలీ, ఇరాన్..**

చైనా తర్వాత ఇరాన్, ఇటలీలో కరోనా కేసులు అధికంగా నమోదయ్యాయి. ఇటలీలో 11 నగరాలకు వైరస్ పాకింది. 107 మంది మృతిచెందగా, మూడువేల మంది బాధితులు చికిత్స పొందుతున్నారు. ఇరాన్‌లో మృతుల సంఖ్య 92కు, బాధితుల సంఖ్య 2,900కు పెరిగింది. ప్రజలు శుక్రవారం సామూహిక ప్రార్థనలకు దూరంగా ఉండాలని ఇరాన్ ప్రభుత్వం ఆదేశించింది. స్విట్జర్లాండ్‌లో మొదటి కరోనా మృతి, దక్షిణాఫ్రికాలో మొదటి కరోనా కేసు నమోదైంది. అమెరికా, ఇజ్రాయెల్ తమ సంయుక్త సైనిక విన్యాసాలను రద్దు చేశాయి. ప్రపంచవ్యాప్తంగా కొవిడ్-19 సోకిన వారిలో 3.4 శాతం మంది మరణించారని డబ్ల్యూహెచ్‌వో తెలిపింది. ఆరోగ్యంగా, పరిశుభ్రంగా ఉన్నవారిపై వైరస్ ప్రభావం అంతగా ఉండదని పేర్కొన్నది.



ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో రోడ్డు వెంట శుద్ధీకరణ పనులు చేపడుతున్న సిబ్బంది

## దేశవ్యాప్తంగా కరోనా..

- మధ్యప్రదేశ్‌లోని మూడు కుటుంబాలకు చెందిన ఏడుగురు గత నెల ఇటలీ నుంచి తిరిగొచ్చినట్టు గుర్తించారు. ముందస్తు చర్యగా వారిని ప్రత్యేక గదిలో ఉంచి పరీక్షలు నిర్వహించారు. వారికి వైరస్ లేదని తేలింది.
- యూపీలో ఇప్పటివరకు 175 మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా, 157 మందికి వైరస్ సోకలేదని తేలినట్టు మంత్రి జైప్రతాప్ సింగ్ తెలిపారు. మిగిలినవారిలో ఆరుగురికి పాజిటివ్ రాగా, చికిత్స అందిస్తున్నామని చెప్పారు.
- సిక్కిం ప్రభుత్వం ఇన్నర్ లైట్ పర్మిట్ (ఐఎల్‌పీ)ల జారీని నిలిపివేసింది. విదేశీయులు సిక్కింలో పర్యటించాలంటే ప్రభుత్వం నుంచి ఐఎల్‌పీ పొందాల్సి ఉంటుంది.
- రాష్ట్రపతి భవన్‌లోని మొఘల్ గార్డెన్స్‌లోకి సందర్శకుల ప్రవేశంపై శనివారం నుంచి నిషేధం విధించారు.
- ఉద్యోగులకు ఫ్లూ లక్షణాలు ఉంటే ఇంటి నుంచి పనిచేసేందుకు అనుమతించాలని కర్ణాటక ప్రభుత్వం కోరింది.
- కరోనా ప్రభావిత దేశాల నుంచి వచ్చిన 452 ఓడలను అధికారులు పోర్టుల్లో నిలిపివేశారు. అందులోని 16,076 మంది సిబ్బంది, ప్రయాణికులకు పరీక్షలు నిర్వహించారు. వారిని నౌకల నుంచి దిగనీయడం లేదు.

## జేమ్స్‌బాండ్‌కు కరోనా దెబ్బ




**లండన్, మార్చి 5:** ప్రపంచంలోని ఏ మూలకైనా చొచ్చుకెళ్లి మిషన్‌ను పూర్తిచేసే 'జేమ్స్ బాండ్' కూడా కరోనా దెబ్బకు బెంబేలెత్తాడు. జేమ్స్‌బాండ్ సిరీస్‌లోని తాజా సినిమా 'నో టైమ్ టు డై'. డానియల్ క్రెగ్ హీరోగా నటిస్తున్నారు. ఈ చిత్రం ఏప్రిల్ రెండోవారంలో ప్రపంచవ్యాప్తంగా విడుదల కావాల్సి ఉన్నది. అయితే.. కరోనా దెబ్బకు అనేక దేశాల్లో ప్రజలు సినిమాలకు దూరంగా ఉండటం, అతిపెద్ద మార్కెట్ అయిన చైనాలో థియేటర్లు మూతపడటంతో జేమ్స్ బాండ్ వెనక్కి తగ్గాడు. ఈ చిత్రాన్ని నవంబర్ 12వ తేదీకి వాయిదా వేస్తున్నట్టు నిర్మాతలు గురువారం ప్రకటించారు.

## టైటానిక్ కెప్టెన్‌లా ప్రభుత్వ ప్రకటన

**న్యూఢిల్లీ:** కరోనాపై కేంద్రం పార్లమెంట్‌లో చేసిన ప్రకటనపై రాహుల్ పెదవి విరిచారు. 'కరోనా వైరస్ గురించి భయపడవద్దని, పరిస్థితి అదుపులోనే ఉన్నదని కేంద్ర ఆరోగ్య మంత్రి హర్షవర్ధన్ చెప్తున్నారు. ఆయన మాటలు.. మన నౌక ఇంకా మునిగిపోలేదు కాబట్టి ప్రయాణికులు భయపడకూడదని టైటానిక్ కెప్టెన్ ప్రయాణికులతో చెప్పినట్లు ఉన్నాయి' అని రాహుల్ ఎద్దేవా చేశారు. కరోనాను అరికట్టడంతోపాటు దాని వ్యాప్తిని నిరోధించడానికి కార్యాచరణ ప్రణాళికతో ప్రభుత్వం ముందుకురావాల్సిన అవసరం ఉన్నదన్నారు.

## బెత్లెహాం చర్చి మూసివేత

**బెత్లెహాం:** కరోనా కేసులు నమోదవుతున్నాయనే అనుమానాల నేపథ్యంలో బెత్లెహాం చర్చిని తాత్కాలికంగా మూసివేస్తున్నట్టు గురువారం పాలస్తీనా అధికారులు ప్రకటించారు. ఏసుక్రీస్తు జన్మస్థలంగా పేరుగాంచిన బెత్లెహాం నగరంలో ఓ హోటల్‌లో అనుమానిత కేసులు నమోదైన నేపథ్యంలో స్థానిక చర్చిలు, మసీదులు, ఇతర సంస్థలను మూసివేయాలని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వశాఖ పిలుపునిచ్చింది. గ్రీకు పర్యాటకుల బృందం ఫిబ్రవరిలో ఆ హోటల్‌ను సందర్శించిందని, వారిలో ఇద్దరు ఇప్పుడు వైరస్‌బారిన పడ్డారని చెప్పింది. హోటల్‌లోని నలుగురు కార్మికుల్లోనూ వైరస్ లక్షణాలు ఉన్నాయన్నది.

## శానిటైజర్లు, ఫేస్‌మాస్కులకు మస్తు గిరాకీ

**న్యూఢిల్లీ:** కరోనా కేసులు వరుసగా వెలుగుచూస్తుండటంతో ఢిల్లీలో శానిటైజర్లు, ఫేస్‌మాస్కులకు డిమాండ్ అనూహ్యంగా పెరిగింది. ప్రజలు మెడికల్ షాపులకు పరుగులు పెడుతున్నారు. గంటల తరబడి లైన్లలో నిలబడుతున్నారు. అయితే చాలా చోట్ల 'నో స్టాక్' బోర్డులు దర్శనం ఇస్తున్నాయి. ఒకవేళ ఉన్నా.. రెట్టింపు ధరకు అమ్ముతున్నారు.

## కుక్కలు, పిల్లులతో వైరస్ సంక్రమించదు

**హాంకాంగ్, మార్చి 5:** కుక్క, పిల్లి వంటి పెంపుడు జంతువుల ద్వారా మనుషులకు కరోనా వైరస్ సంక్రమించదని యూనివర్సిటీ ఆఫ్ హాంకాంగ్ శాస్త్రవేత్తలు తెలిపారు. హాంకాంగ్ ప్రభుత్వ జంతు సంరక్షణ విభాగానికి చెందిన క్వారంటైన్ కేంద్రంలోని ఓ శునకంలో తక్కువ మోతాదులో కరోనా లక్షణాలు కనిపించినట్టు వాళ్లు చెప్పారు. ఆ కుక్కకు ఓ మనిషి ద్వారానే ఈ వైరస్ సోకినట్టు గుర్తించామని తెలిపారు. కరోనా సోకిన కుక్కలు, పిల్లుల నుంచి ఆ వైరస్ సంక్రమించనప్పటికీ, వాటికి దూరంగా ఉండటం మంచిదని, ఆ జంతువులను నిర్బంధంలో ఉంచాలని శాస్త్రవేత్తలు సలహానిస్తున్నారు.

# సహాయ కేంద్రాల్లో 'వైరస్' కలకలం

- **పలు అనారోగ్య సమస్యలతో ఢిల్లీ బాధితులు సతమతం**
- **44కి పెరిగిన హింస మృతులు**
- **పరిహారం పెంచిన ఢిల్లీ సర్కార్**
- **ఆప్ నేత తాహిర్ అరెస్ట్**



**న్యూఢిల్లీ, మార్చి 5:** మత ఘర్షణలతో అట్టుడికిన దేశ రాజధాని ఢిల్లీని ప్రస్తుతం 'కరోనా' వణిస్తున్నది. సర్వం కోల్పోయి సహాయ కేంద్రాల్లో తలదాచుకున్న హింసాకాండ బాధితులు అనారోగ్యంతో సతమవుతున్నారు. ముస్తాఫాబాద్‌లోని ఈద్గా వద్ద ఉన్న సహాయ కేంద్రంలో పలువురు జలుబు, జ్వరం, దగ్గు, వాంతులతో ఇబ్బంది పడుతున్నారు. ఢిల్లీలో ఇప్పటికే ఒకరికి 'కరోనా' సోకిన నేపథ్యంలో వీరంతా ఆందోళన చెందుతున్నారు. పలు వైద్య సంఘాలు ఉచిత శిబిరాలు ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేస్తున్నాయి. పరిశుభ్రత పాటించాలని, చేతులను శుభ్రపరచుకోవాలని వారికి సూచిస్తున్నాయి. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజల్, మంత్రి గోపాల్ రాయ్ గురువారం అల్లర్ల ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు.

**మృతుల సంఖ్యపై సందిగ్ధం**

హింసాకాండ మృతుల సంఖ్యపై సందిగ్ధం నెలకొన్నది. రెండు ప్రభుత్వ దవాఖానల్లో కొన్ని గుర్తించని మృతదేహాలు ఉండటంతో మరణించిన వారిసంఖ్యను 53గా అధికారులు గురువారం పేర్కొన్నారు. అయితే వారు హింసాకాండలోనే చనిపోయారో లేదో నిర్ధారణకాకపోవడంతో సంఖ్యను 44గా నిర్ధారించారు. మత ఘర్షణలకు సంబంధించి 654 కేసులు నమోదు చేసి 1820 మందిని అరెస్ట్ చేసినట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు.

**తాహిర్ పిటిషన్ కొట్టివేత**

ఆప్ కౌన్సిలర్ తాహిర్ హుస్సేన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఐబీ అధికారి అంకిత్ శర్మను హత్యచేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న తాహిర్.. కొన్నాళ్లుగా పరారీలో ఉన్నాడు. లొంగిపోయేందుకు అతడు దాఖలుచేసిన పిటిషన్‌ను ఢిల్లీ కోర్టు గురువారం కొట్టివేసింది. దీంతో ఢిల్లీ పోలీసులు తాహిర్‌ను అరెస్ట్ చేశారు. మరోవైపు ఫిబ్రవరి 24న చాంద్‌బాగ్‌లో అల్లరిమూకలు పోలీసులపై రాళ్ల దాడిచేస్తున్న వీడియో వెలుగుచూసింది. కొందరు మహిళలు కూడా ఈ దాడిలో పాల్గొన్నారు. మత ఘర్షణల్లో సర్వం దోపిడీకి గురైన బాధితులకు ఇచ్చే పరిహారాన్ని రూ.లక్షకు, పాక్షికంగా వస్తువుల దోపిడీకి గురైన వారికి రూ.50 వేలు పరిహారం ఇచ్చేందుకు ఢిల్లీ ప్రభుత్వం నిర్ణయించింది. ధ్వంసమైన పాఠశాలలకు రూ.10 లక్షలు ఇవ్వనున్నారు.

## నిరాశకు గురయ్యా!



**చైన్నై:** తమిళ సూపర్‌స్టార్ రజినీకాంత్ నిరాశకు గురయ్యారట. రాజకీయ ప్రవేశం కోసం 2018లో ప్రారంభించిన రజినీ మక్కల్ మండ్రం(ఆర్‌ఎంఎం)సంస్థ జిల్లా కార్యదర్శులతో ఆయన గురువారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన 'నిరాశ' వ్యాఖ్యలు చేశారు. ఇందుకు గల కారణాలను సమయం వచ్చినప్పుడు చెప్తానని మీడియాతో అన్నారు. కమల్‌హాసన్‌తో కలిసి పనిచేయడాన్ని కాలమే నిర్ణయిస్తుందని చెప్పారు. సీఏఏ, ఎన్పీఆర్ ప్రకటన, అనంతర పరిణామాలపై రజినీకాంత్ ఇటీవల పలుమార్లు అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

## కోయంబత్తూరులో ఉద్రిక్తత

**కోయంబత్తూరు:** తమిళనాడులోని కోయంబత్తూరులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గురువారం గణపతి ప్రాంతంలోని ఓ మసీదుపై కొందరు పెట్రోల్ సీసాను, కోవైపుదుర్‌లోని మరో ప్రార్థనా స్థలంపై రాళ్లు విసిరినట్లు వార్తలొచ్చాయి. వెంటనే అప్రమత్తమైన పోలీసులు.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా సున్నిత ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించారు. సీఏఏ మద్దతు ర్యాలీలో పాల్గొని తిరిగి వెళ్తున్న హిందూ మున్నాని జిల్లా కార్యదర్శి మదుక్కరై ఆనంద్ మీద గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి దాడిచేశారు. ఈ నేపథ్యంలోనే రెండు మసీదులపై దాడులు జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ రెండు ఘటనలపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మరోవైపు హిందూ మున్నాని శుక్రవారం ఒక రోజు బంద్‌కు పిలుపునిచ్చింది. కాగా, శాంతిని విశ్వసించని వారే మసీదుపై పెట్రోల్ బాంబు విసిరారని తమిళనాడుకు చెందిన జమాత్ పేర్కొంది. ముస్లింలకు, మసీదులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరింది.

# 20న ఉరి

- **నిర్భయ కేసులో మరోసారి డెత్ వారెంట్లు జారీ**
- **ఈసారి శిక్ష ఖాయం!**

**న్యూఢిల్లీ, మార్చి 5:** నిర్భయ కేసులో నలుగురు దోషులకు ఢిల్లీలోని ట్రయల్ కోర్టు మరోసారి డెత్ వారెంట్లు జారీ చేసింది. ఈ నెల 20న ఉదయం 5.30 గంటలకు వారిని ఉరి తీయాలని ఆదేశాలు జారీ చేసింది. దోషులకు న్యాయపరంగా ఉన్న అన్ని అవకాశాలు మూసుకుపోవడంతో ఈసారి ఉరి అమలు ఖాయంగా కనిపిస్తున్నది. దోషులు ఇప్పటికే అన్ని న్యాయపరమైన అవకాశాల్ని వినియోగించుకున్నారని ఢిల్లీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై గురువారం విచారణ చేపట్టిన అదనపు సెషన్స్ జడ్జి ధర్మేంద్ర రాణా తాజా డెత్ వారెంట్లు జారీ చేశారు. మరణశిక్ష అమలును వాయిదా వేసేందుకు నిర్భయ దోషులు అక్షయ్ కుమార్ సింగ్ (31), పవన్ గుప్తా (25), వినయ్ శర్మ (26), ముకేశ్ కుమార్ సింగ్ (32) ఇప్పటికే పలుమార్లు ప్రయత్నిస్తూ వచ్చారు. న్యాయపరమైన అవకాశాల పేరిట వారు పిటిషన్లు దాఖలు చేయడంతో ఉరి అమలు తేదీ ఇప్పటికే మూడుసార్లు వాయిదా పడింది. తొలిసారి ఈ ఏడాది జనవరి 22న, ఫిబ్రవరి 1న రెండోసారి డెత్ వారెంట్లు జారీ అయినప్పటికీ ఉరి వాయిదా పడింది. మార్చి 3న మరోసారి ఉరితీయాలని డెత్‌వారెంట్లు జారీ అయినప్పటికీ పవన్ గుప్తా రాష్ట్రపతి క్షమాభిక్షకు దరఖాస్తు చేసుకోవడంతో మరోసారి ఉరి అమలు వాయిదా పడింది. అతడి క్షమాభిక్ష పిటిషన్‌ను రాష్ట్రపతి తిరస్కరించడంతో ఢిల్లీ ప్రభుత్వం బుధవారం డెత్‌వారెంట్ల జారీపై పిటిషన్ వేసింది. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం దోషులకు కొత్త డెత్ వారెంట్లు జారీ చేసింది.

**నలుగురికి ఒకేసారి ఉరిపై..**

నిర్భయ కేసులో నలుగురు దోషుల్ని ఒకేసారి ఉరి తీయాలన్న ఢిల్లీ హైకోర్టు ఆదేశాల్ని సవాల్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై మార్చి 23న విచారణ చేపడుతామని సుప్రీంకోర్టు గురువారం పేర్కొంది. అయితే, దోషుల్ని మార్చి 20న ఉరి తీయాలని ట్రయల్ కోర్టు తాజాగా డెత్ వారెంట్లను జారీ చేసిందని కేంద్రం తరుపున వాదనలు వినిపిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. శిక్ష అమలును జాప్యం చేయడానికి దోషులు పలు ఎత్తుగడలు వేస్తూ న్యాయవ్యవస్థను పరిహసించారని ఆరోపించారు. వాదనలు విన్న జస్టిస్‌లు ఆర్ భానుమతి, అశోక్ భూషణ్, ఎస్ బోపన్నతో కూడిన సర్వోన్నత ధర్మాసనం.. మార్చి 23న విచారణ చేపడుతామని, దీనిపై ఎలాంటి వాయిదాల్ని అనుమతించబోమని తెలిపింది.



నిర్భయ దోషులు వరుసగా అక్షయ్ ఠాకూర్, పవన్ గుప్తా, వినేశ్ శర్మ, ముఖేశ్ సింగ్

## సీఎంగా 20 ఏండ్లు

**నవీన్ పట్నాయక్ ఘనత**

**భువనేశ్వర్:** ఒడిశా ముఖ్యమంత్రి, బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ సీఎంగా గురువారంతో 20 ఏండ్లు పూర్తిచేసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు చెప్పిన ఆయన, రాష్ట్రంలోని 4.5 కోట్ల ప్రజల సాధికారత కోసం మరింత కాలం అధికారంలో ఉంటానన్నారు. 2000 మార్చి 5న తన తండ్రి బిజూ పట్నాయక్ జయంతి రోజున నవీన్ పట్నాయక్ తొలిసారి సీఎంగా ప్రమాణం చేశారు. 73 ఏండ్ల రాజకీయ కురువృద్ధుడైన ఆయన ఒడిశాలో వరుసగా ఐదుసార్లు అధికారంలోకి వచ్చారు.





దేశంలో కరోనా వైరస్ గురించి భయపడాల్సిన పనిలేదు. కరోనా వైరస్‌ను నియంత్రించటం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. అన్నివిధాలా వైరస్‌ను అదుపు చేస్తున్నది.

**హర్షవర్ధన్, కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి**

దేశంలో కరోనా వైరస్ నియంత్రణలో ఉన్నదని కేంద్ర ఆరోగ్య శాఖామంత్రి చెబుతున్నారు. ఇది మునుగుతున్న టైటానిక్ నావ గురించి ప్రయాణికులు భయపడకూడదని, మునగటం లేదని చెప్పినట్లు ఉన్నది. ఇప్పటికైనా ప్రభుత్వం కరోనా వైరస్ గురించి పకడ్బందీ చర్యలు చేపట్టాలి.

**రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు**



**చరిత్రలో నేడు**



1869

రష్యా రసాయన సంఘానికి 'మూలకాల ఆవర్తన పట్టిక'ను సమర్పించిన దిమిత్రి మెండలీవ్.

1886

అమెరికాలో మొదటిసారి నర్సుల పత్రిక 'నైటింగేల్' ప్రచురణ ప్రారంభం.





1964

ముహమ్మద్ అలీగా పేరు మార్చుకున్న బాక్సర్ కాసియస్ క్లే. బానిసత్వానికి చిహ్నంగా ఉన్నదని పేరును త్యజిస్తున్నట్లు ప్రకటన.

ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ మానవహక్కుల కమిషన్ సీఏఏపై సుప్రీంకోర్టులో పిటిషన్ వేయటం అసాధారణ చర్య. ఇది అవాంఛితమైనది. అంతేకాకుండా భారత అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవటం లాంటిదే. కొంతమంది సీఏఏపై సుప్రీంలో ఫిర్యాదు చేసినట్లు, యూఎన్ హై కమిషనర్ వ్యవహరించటం ఆక్షేపణీయం. ఈ విషయంలో భారత ప్రభుత్వానికి సహకరిస్తామని చెప్పినా కోర్టు వారి సహకారాన్ని అంగీకరించదు. అయితే కేంద్రం కూడా అందరి హక్కులను పరిరక్షించాల్సిన అవసరం ఉన్నది.

**ది హిందూ**

జనవరి, ఫిబ్రవరి నెలల్లో దేశవ్యాప్తంగా కేవలం మూడు కరోనా కేసులు మాత్రమే నమోదయ్యాయి. అవి నేటికి 28కి చేరాయి. వైరస్ విస్తరణ, నియంత్రణ, బాధితుల విషయంలో అనేక దేశాలు వివిధ పద్ధతులను అనుసరిస్తున్నాయి. ఈ విషయంలో భారత్ పారదర్శకంగా వ్యవహరించాలి. విస్తరణ, బాధితుల సంఖ్యలో వాస్తవాలు చెబుతూ ప్రజలను అప్రమత్తం చేయాలి. అలాగే సమూహ కార్యక్రమాలకు దూరంగా ఉండేలా చూడాలి. ప్రధాని మోదీ హోలీకి దూరంగా ఉంటున్నట్లు ప్రకటించటం ముదావహం. అందరూ అప్రమత్తతతో వ్యవహరించటమే కరోనాకు కళ్లెం.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**



# రచ్చే ప్రధానమా!

పార్లమెంటు ఉభయసభల్లో చర్చకు బదులు రచ్చ చేయడం ఆందోళనకర స్థాయికి చేరుకున్నది. గురువారం కాంగ్రెస్ పార్టీకి చెందిన ఏడుగురు ఎంపీలను స్పీకర్ లోక్‌సభ నుంచి బహిష్కరించ వలసి రావడం చట్టసభల్లో పరిస్థితిని ప్రతిబింబిస్తున్నది. సోమవారం నుంచి ప్రతిపక్షాలు సభకు అంతరాయం కలిగిస్తూనే ఉన్నాయి. లోక్‌సభలో సోమవారం నాడు అధికార, ప్రతిపక్షసభ్యుల మధ్య తోపులాట సాగడం ఒక అవాంఛనీయ ఘటన. ఆ తర్వాత రోజూ కార్యక్రమాలకు ఆటంకం కలగడంతో స్పీకర్ ఓం బిర్లా వివిధ రాజకీయపక్షాల పెద్దలతో సమావేశం ఏర్పాటుచేశారు. కానీ ఆయన ప్రయత్నాలు ఫలించలేదు. సభలోని ఘటన పట్ల ఆవేదన చెందిన స్పీకర్ రెండురోజుల పాటు పార్లమెంటుకు వచ్చి కూడా అధ్యక్ష స్థానంలో కూర్చోలేదు. ఆ తర్వాత కూడా అదే గందరగోళం. సభాధ్యక్ష స్థానం ముందు భాగంలోకి చొచ్చుకువచ్చి రచ్చ చేస్తే చర్య తీసుకుంటామని స్పీకర్ హెచ్చరించారు. వరుస ఆటంకాలు చివరికి కాంగ్రెస్ సభ్యుల బహిష్కరణకు దారితీసాయి. రాజ్యసభలోనూ కార్యక్రమాలు సజావుగా సాగడం లేదు. కాంగ్రెస్ తదితర ప్రతిపక్షాల సభ్యులు అంతరాయం కలిగిస్తుండటంతో ఆగ్రహించిన రాజ్యసభ చైర్మన్ 'ఇది పార్లమెంటా లేక బజారా' అని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో ఇటీవల జరిగిన అల్లర్లపై సభలో చర్చించాలని కాంగ్రెస్ పార్టీ పట్టు పడుతున్నది. హోలీ అనంతరం పదకొండవ తేదీన చర్చ జరపడానికి స్పీకర్ హామీ ఇచ్చారు. కాదు వెంటనే చర్చించాలని కాంగ్రెస్ పార్టీ పట్టుపడుతున్నది. ఈ విషయమై చర్చ సాగేవరకు ఇతర చర్చలకు అంతరాయం కలిగిస్తూనే ఉంటామని అంటున్నది. ఏ అంశంపై అయినా ఒక మెట్టు దిగడానికి ఇరుపక్షాలూ సిద్ధంగా ఉండాలి. నాలుగురోజులు అటూఇటూ ఏదో ఒక దగ్గర అంగీకారానికి వస్తే బాగుండేది.

**మన ప్రజాస్వామ్యం అనేక సవాళ్ళను ఎదుర్కొంటున్నది. అయినా సవాళ్ళను ఎదుర్కొనే పరిణతి భారతీయ సమాజానికి ఉందని అనేక సందర్భాల్లో రుజువైంది. మన రాజ్యాంగ వ్యవస్థలు కూడా బలంగా ఉన్నాయి. రాజ్యాంగ పరిధిలో సంక్షోభాలను అధిగమించడం మనకు కొత్త కాదు. ఈ వాస్తవాలను విదేశాలకు నిర్ద్వంద్వంగా చెప్పగలిగే నైతిక స్థైర్యం మనకు ఉండాలి. ఏ మాత్రం అవకాశం దొరికినా మన దేశంపై వేలెత్తి చూపడానికి కొన్ని దేశాలు సిద్ధంగా ఉన్నాయి. మనలో మనం ఎట్లా ఉన్నా ఇతర దేశాలకు తలదూర్చే అవకాశం ఇవ్వకూడదు.**

సభా కార్యక్రమాలకు ఏ పార్టీ అటంకం కలిగించినా గర్హనీయమే. ప్రతిపక్షమంటే గొడవలు చేయడమనే సంస్కృతి రాజకీయపక్షాల్లో పేరుకుపోయింది. బీజేపీ కూడా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇదేవిధంగా వ్యవహరించింది. 2009 నుంచి 2014లో అధికారంలోకి వచ్చేవరకు బీజేపీ ప్రతిపక్షంగా నిరంతరం ఆటంకాలు కలిగించింది. లోక్‌సభ కార్యక్రమాలు 2009లో 93 శాతం జరిగితే, 2013 నాటికి 46 శాతానికి పడిపోయాయి. ఆటంకాలు కలిగించడం కూడా సభా కార్యక్రమాలలో భాగమే అని ఆ పార్టీ నాయకులు సమర్థించుకున్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తేవడానికి, వివిధ అంశాలపై ఒత్తిడి పెట్టడానికి ప్రతిపక్షాలు గొడవలు చేయడం ఏ దేశ పార్లమెంటులోనైనా మామూలే. కానీ ఆటంకాలే ఎక్కువై సభా కార్యక్రమాలు తగ్గడం పార్లమెంటు ప్రమాణాల పతనానికి సూచన. పార్లమెంటు సమావేశాలు ప్రారంభం కావడానికి ముందు శుక్రవారం నాడు స్పీకర్ ఓం బిర్లా ఒక సందర్భంలో మాట్లాడుతూ- సభా కార్యక్రమాలకు ఆటంకం కలుగకుండా నివారించడానికి చట్టాన్ని తెస్తున్నట్టు వెల్లడించారు. తాము తేబోయే చట్టం కఠినంగా ఉంటుందనీ, రాష్ట్రాల శాసనసభలకు కూడా వర్తిస్తుందని తెలిపారు. సభాకార్యక్రమాలకు అంతరాయాలను నివారించడంపై కొంతకాలంగా చర్చ సాగుతున్నది. గతేడాది నవంబర్‌లో సభాపతుల సమావేశంలో కూడా ఈ విషయమై చర్చ జరిగింది. కనీసం చట్టం తేవడం వల్లనైనా సభా కార్యక్రమాలు గౌరవప్రదంగా సాగితే మంచిదే.

మన ప్రజాస్వామ్యం అనేక సవాళ్ళను ఎదుర్కొంటున్నది. అయినా సవాళ్ళను ఎదుర్కొనే పరిణతి భారతీయ సమాజానికి ఉందని అనేక సందర్భాల్లో రుజువైంది. మన రాజ్యాంగ వ్యవస్థలు కూడా బలంగా ఉన్నాయి. రాజ్యాంగ పరిధిలో సంక్షోభాలను అధిగమించడం మనకు కొత్త కాదు. ఈ వాస్తవాలను విదేశాలకు నిర్ద్వంద్వంగా చెప్పగలిగే నైతిక స్థైర్యం మనకు ఉండాలి. ఏ మాత్రం అవకాశం దొరికినా మన దేశంపై వేలెత్తి చూపడానికి కొన్ని దేశాలు సిద్ధంగా ఉన్నాయి. మనలో మనం ఎట్లా ఉన్నా ఇతర దేశాలకు తలదూర్చే అవకాశం ఇవ్వకూడదు. కానీ క్లిష్టసమస్యలు ఎదురైనప్పుడు పార్లమెంటుసభ్యులు కూడా రాజకీయాలే ప్రధానంగా వ్యవహరించడం వల్ల నవ్వేటోళ్ళ ముందు జారిపడినట్టవుతున్నది. పార్లమెంటు సభ్యులు బాధ్యత గల ప్రజా ప్రతినిధులు. వారు పార్లమెంటులో వ్యవహరించే తీరుపై ఎటువంటి ఆంక్షలు ఉండకూడదు. కానీ తదనుగుణమైన బాధ్యతను వారు కనబరచకపోవడమే విచారకరం. ఇప్పటికైనా పార్లమెంటు కార్యకలాపాలకు అంతరాయం కలుగకుండా అన్నిపక్షాల నాయకులూ రాజకీయాలకు అతీతంగా ఏకాభిప్రాయానికి రావాలి. స్వీయ క్రమశిక్షణ పాటిస్తే చట్టాల ద్వారా నియంత్రించవలసిన అవసరం రాదు. చెప్పుకోవడానికి కూడా గొప్పగా ఉంటుంది. కానీ సభ్యులలో ఆ హుందాతనం లోపించినప్పుడు చట్టం ద్వారా చక్కదిద్దడం తప్ప మరో మార్గం లేదు. మొదట్లో తెలంగాణ శాసనసభలో చర్చలు సజావుగా సాగలేదు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ విషయమై శ్రద్ధ కనబరచి ప్రజా సమస్యలపై, అభివృద్ధి కార్యక్రమాలపై నిర్విఘ్నంగా చర్చించే పరిస్థితులను నెలకొల్పారు. ఇది దేశవ్యాప్తంగా ప్రజా ప్రతినిధులు, ప్రజాస్వామ్యప్రియులు గుర్తించవలసిన అంశం.

ఖజానా



**మ్యాడం మధుసూదన్**

# 'లెక్క' తప్పని బడ్జెట్!

దేశ ఆర్థికాభివృద్ధిలో, జీఎస్టీ రాబడిలో తెలంగాణ కీలక భూమికను నిర్వర్తిస్తున్నది. ఇది కాదనలేని వాస్తవమని ఇటీవల హైదరాబాద్ పర్యటనలో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బహిరంగంగా అంగీకరించక తప్పలేదు. తెలంగాణ ఆర్థికపరిస్థితి మెరుగ్గా ఉందని, క్రమశిక్షణ ఎప్పుడూ తప్పలేదని కేంద్రం పార్లమెంట్ సాక్షిగా పలుసార్లు ప్రకటించింది.

నీళ్లు, నిధులు, నియామకాలు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ నినాదం. అదే నినాదంతో ఉద్యమాన్ని రాష్ట్ర సాధన గమ్యానికి చేర్చిన టీఆర్‌ఎస్ పార్టీ కొత్త రాష్ట్రం పాలనా పగ్గాలు చేపట్టింది. ఉద్యమపార్టీ తన నిర్దిష్టమైన వ్యూహంతో కొనసాగిస్తున్న పరిపాలన వల్ల మూడు నిర్దేశిత లక్ష్యాల స్వప్నం సాకారమవుతున్నది. నిధులు పెరుగుతున్నాయి. సముద్రంలో వృథాగా కలిసే నీళ్లు పంట పొలాలకు మళ్లుతున్నాయి. చకాచకా నియామకాలు జరుగుతున్నాయి. రాష్ట్ర ఆవిర్భావం జరిగిన వెంటనే సీఎం కేసీఆర్ చేపట్టిన పరిపాలనా సంస్కరణలు, సమగ్ర ప్రణాళికతో కూడిన విధానాలు రాష్ట్ర ఆర్థిక రథచక్రాలను పరుగులు పెట్టించాయి. తెలంగాణ రాష్ట్ర సంపద అంతకంతకు పెరుగుతున్నది. దేశంలోని పెద్ద రాష్ట్రాలను తలదన్నేలా సంపదను పెంచుకుంటూ సంపన్న రాష్ట్రంగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటున్నది. తెలంగాణ ఆవిర్భవించిన ఐదేండ్లలో రాష్ట్రం మొత్తం గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రొడక్ట్ సంపద (జీఎస్‌డీపీ) 4 లక్షల కోట్ల రూపాయల నుంచి రూ.8.8 లక్షల కోట్లను దాటింది. ఈ ఆర్థిక సంవత్సరంలో అది కాస్త 9.5 లక్షల కోట్లకు పెరిగే అవకాశం ఉన్నది. తలసరి ఆదాయ వృద్ధిలోనూ అగ్రభాగాన నిలిచింది. రాష్ట్ర సంపదను పెంచడమే కాకుండా రాష్ట్ర బడ్జెట్ రూపకల్పనలో దేశంలోనే ప్రత్యేకతను చాటుకుంటున్నది. రెవెన్యూ మిగులును సాధిస్తూ, ద్రవ్యలోటును నియంత్రణలో ఉంచుతూ, సంపద ఎక్కువ ఉన్నా అప్పులు తీసుకుంటూ ఆర్థిక క్రమశిక్షణ చాటుతూ దేశ బడ్జెట్‌కే దిక్సూచిగా నిలుస్తున్నది. దేశంలో బలమైన ఆర్థిక శక్తిగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌ల రూపకల్పనలో ఆచితూచి వ్యవహరిస్తున్నది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం వరుసగా 7వ వార్షిక బడ్జెట్‌ను ఈ నెల 8న చట్టసభల్లో ప్రవేశపెట్టబోతున్నది. వచ్చే ఆర్థిక సంవత్సరం 2020-21 వార్షిక బడ్జెట్‌ను పక్కా లెక్కలతో రూపొందించడానికి భారీగా కసరత్తు జరిగింది. ప్రతి పైసకు లెక్కతో బడ్జెట్‌కు రూపకల్పన జరిగింది. బడ్జెట్ అంటే ఆదాయవ్యయాల పట్టిక. ఏడాది కాలంలో వచ్చే రాబడి ఎంత, వ్యయం ఎంత అనే లెక్కలతో ప్రధానంగా బడ్జెట్‌ను రూపొందిస్తారు. ప్రస్తుత ఆర్థికపరిస్థితిని పరిగణనలోకి తీసుకొని వచ్చే 12 నెలలకు ముందుగానే అంచనా వేయాల్సి ఉంటుంది. ఉమ్మడి ఏపీలో ఆ అంచనాలు గంపగుత్తగా ఉండేవి. కానీ తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత బడ్జెట్ అంటే పక్కా లెక్కలతో పకడ్బందీ అంచనాలు అనే విధానానికి సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారు. గంపగుత్త లెక్కలకు స్వస్తి పలికారు. అంచనాలు, వాస్తవానికి అతిదగ్గరలో ఉండేలా వార్షిక బడ్జెట్‌లకు రూపకల్పన చేశారు. వాస్తవానికి రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత రాష్ట్రంలో సొంత రాబడులు భారీగా పెరిగాయి. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన సమయంలో రూ.37 వేల కోట్లుగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న పలు అభివృద్ధి, సంక్షేమ, శాంతిభద్రత చర్యల వల్ల పెట్టుబడులు, రాబడులు భారీగా పెరిగాయి. ప్రస్తుతం సొంత రాబడుల మొత్తం 70 వేల కోట్లకు చేరింది. రెవె న్యూ, క్యాపిటల్, ఇతర రాబడులను మొత్తం కలిపితే లక్షా 50 వేల కోట్ల వరకు పెరిగింది. సొంత రాబడులు ఏటా 17-21 శాతానికి పెరిగాయి. దానికి తగ్గట్టుగానే బడ్జెట్ సైజు పెరుగుతూ వచ్చింది. కానీ గతేడాది నుంచి ప్రపంచవ్యాప్తంగా ఎదురవుతున్న ఆర్థికపరమైన ఒడిదుడుకులు, దేశంలో నెలకొన్న ఆర్థికమాంద్యం నీడలు మన రాష్ట్ర వృద్ధిరేటుపై కూడా ప్రతికూల ప్రభావం చూపాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నెలకొన్న పరిస్థితులను మొదటినుంచి నిశితంగా పరిశీలిస్తున్న ప్రభుత్వం ఆచితూచి అడుగులు ముందుకువేస్తున్నది. గతేడాది సెప్టెంబర్‌లో ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్‌లో ముఖ్యమంత్రి బడ్జెట్ అంచనాలను భారీగా తగ్గించి ఆశ్చర్యపరిచారు. గత ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో 1,82,059.06కోట్లుగా ఉన్న వార్షిక బడ్జెట్‌ను సెప్టెంబర్‌లో ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్‌లో లక్షా 48 వేల కోట్లకు కుదించి ఆర్థిక నిపుణులను సైతం ఆశ్చర్యానికి గురిచేశారు. వాస్తవ బడ్జెట్ అంటే ఏమిటో కేసీఆర్ చేతల్లో చూపారు. రాష్ట్రం ఏర్పడిన నాటినుంచి రాబడులు బాగా పెరిగాయి. అదేస్థాయిలో బడ్జెట్ పెరిగింది. కానీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆర్థికమాంద్యం వల్ల



దేశ ఆర్థికాభివృద్ధిలో, జీఎస్టీ రాబడిలో తెలంగాణ కీలక భూమికను నిర్వర్తిస్తున్నది. ఇది కాదనలేని వాస్తవమని ఇటీవల హైదరాబాద్ పర్యటనలో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బహిరంగంగా అంగీకరించక తప్పలేదు. తెలంగాణ ఆర్థికపరిస్థితి మెరుగ్గా ఉందని, క్రమశిక్షణ ఎప్పుడూ తప్పలేదని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా పలుసార్లు ప్రకటించింది.

మన రాబడుల వృద్ధిరేటు బాగా తగ్గుతున్నది. ఈ విషయాన్ని ముందుగానే పసిగట్టిన ముఖ్యమంత్రి అధికారులను అప్రమత్తం చేశారు. రాబడుల వృద్ధిరేటు తగ్గుతున్నది. ఆ మేరకు బడ్జెట్‌ను తగ్గించామని, ఇందులో డాంబికాలకు ఆస్కారం లేదని సీఎం స్పష్టం చేయడం వాస్తవ బడ్జెట్‌కు అద్దం పడుతున్నది. ఏటా కనీసం 17 శాతం వరకు ఉన్న రాబడుల వృద్ధిరేటు ఈసారి 5-6 శాతానికే పరిమితమవుతున్నదని అంచనా వేశారు. వాస్తవానికి మన రాష్ట్రం ఏర్పడినప్పుడు లక్ష కోట్ల లోపే ఉన్న, బడ్జెట్ రాబడులు బాగా పెరుగడంతో 1,61,856 కోట్లకు చేరింది. కానీ రాబడుల్లో వృద్ధిరేటులో తేడా వచ్చే అవకాశం ఉందని తెలిసి సీఎం స్వయంగా బడ్జెట్ అంచనాలను తగ్గించి 1.46 లక్షల కోట్లకు కుదించారు. కేంద్ర బడ్జెట్‌లో ప్రతికూల నిర్ణయాలు కూడా బడ్జెట్‌పై ప్రభావం చూపుతున్నాయి.

రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలో అనేక అనుమానాలు, సందేహాలను పటాపంచలు చేస్తూ సుస్థిరపాలన, శాంతిభద్రతల పరిరక్షణ, పారదర్శక విధానాల వల్ల తెలంగాణ రాష్ట్రం నిపుణుల అంచనాలకు అందని రీతిలో ఆర్థిక ప్రగతి సాధించి దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. ఫలితంగా రాష్ట్ర సంపద పెరిగింది. గొలుసుకట్టుగా రాష్ట్ర సొంత రాబడులు పెరిగాయి. అభివృద్ధి, సంక్షేమానికి కేటాయించే నిధులు పెరిగాయి. సొంత రాబడుల వృద్ధిరేటులో, జీఎస్టీ వసూళ్లలో, ఆర్థికక్రమశిక్షణలో అగ్రస్థానంలో నిలిచి 'విస్‌డమ్ ఆఫ్ ఎకానమీ'ని ప్రదర్శించిన రాష్ట్రంగా దేశానికే దిక్సూచిగా మారింది. మొదటినుంచి పటిష్టమైన వ్యూహంతో జీఎస్టీ వసూళ్లను పెంచుకొని కేంద్రం నుంచి అతి తక్కువ నష్టపరిహారం తీసుకున్న రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచి కేంద్ర ప్రభుత్వ ప్రశంసలను అందుకుంటున్నది.

దేశ ఆర్థికాభివృద్ధిలో, జీఎస్టీ రాబడిలో తెలంగాణ కీలక భూమికను నిర్వర్తిస్తున్నది. ఇది కాదనలేని వాస్తవమని ఇటీవల హైదరాబాద్ పర్యటనలో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బహిరంగంగా అంగీకరించక తప్పలేదు. తెలంగాణ ఆర్థికపరిస్థితి మెరుగ్గా ఉందని, క్రమశిక్షణ ఎప్పుడూ తప్పలేదని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సాక్షిగా పలుసార్లు ప్రకటించింది. ఆర్థిక పరిపాలన, క్రమశిక్షణలో తెలంగాణ ముందుస్థానంలో ఉన్నదని కేంద్ర ప్రభుత్వ అధీనంలోని నీతి ఆయోగ్ తాజాగా నిర్వహించిన 'సస్టేనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్' ఇండెక్స్ సర్వేలో తేలింది. ఇక రాష్ట్రం మొత్తం సంపద జీఎస్‌డీపీ 8.66 లక్షల కోట్లకు పెరిగింది. తెలంగాణ ఆవిర్భవించిన 2013-14 ఆర్థిక సంవత్సరానికి 3.59లక్షల కోట్ల వరకు ఉన్న సంపద తెలంగాణ ప్రభుత్వ విధానాల వల్ల దాదాపు 3 రెట్ల వరకు పెరిగింది. దేశంలో అతివేగంగా సంపద పెరిగిన రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రస్థానంలో ఉన్నది. 2013-14లో స్థిరధరల వద్ద 5.4 శాతంగా ఉన్న జీఎస్‌డీపీ 2018-19నాటికి 10.5 శాతానికి పెరిగింది. ఇదే సమయంలో 5.5 శాతంగా ఉన్న కేంద్ర జీడీపీ 6 శాతానికే పరిమితమైంది. ఈ సారి మరీ దారుణంగా 4.5శా తానికి పరిమితం కావడం ఆందోళన కలిగిస్తున్నది. రాష్ట్రం ఏర్పడిన ఐదేండ్లలో స్థిరధరలు, ప్రస్తుత ధరలు రెండు కలిపి 13.90 శాతం వృద్ధిరేటును సాధించి ర్యాపిడ్ గ్రోత్ లో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. మన తర్వాత ఆంధ్రప్రదేశ్, కర్ణాటక నిలిచాయి. సంపద పెరగడంతో ప్రజల జీవన ప్రమాణం పెరిగింది. తలసరి ఆదాయం రూ.95 వేల నుంచి గతేడాది వరకు రూ.2.06 లక్షలకు పెరిగిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అతి తక్కువకాలంలో ఎక్కువ సంపదను, తలసరి ఆదాయాన్ని సాధించిన రాష్ట్రాల్లో తెలంగాణ అగ్రస్థానంలో నిలువడం విశేషం.

నివాళి

# భిన్నవాదాల కూడలి

పొత్తూరి వెంకటేశ్వరరావు జగమెరిగిన జర్నలిస్టు. 86 ఏండ్లు పూర్ణమిదం, పూర్ణఫలం అన్నట్లు సార్థక జీవనం గడిపి, విలువలను, ఆదర్శాలను తన అడుగుజాడలుగా వదిలి వెళ్లారు. దాదాపు అర్ధ శతాబ్దంగా తెలుగు ప్రజాక్షేత్రంలోనే ఉన్న పొత్తూరి తెరిచిన పుస్తకం. ఇప్పుడు కొత్తగా ఆయన గురించి చెప్పడానికి ఏమీ లేదనుకుంటే మనకే నష్టం. నిజానికి ఇప్పుడే పొత్తూరి గురించి ఎక్కువగా తెలుసుకోవాలి.

జర్నలిస్టుగా, ప్రధాన సంపాదకుడిగా ఆయన ముద్ర ఆయనకున్నది. పత్రిక యజమాని-సంపాదకుడు ఒకరే అవుతున్నకాలంలో బహుశా సంపాదకుడిగా స్వేచ్ఛగా బాధ్యతను నిర్వహించిన చివరి మనిషి పొత్తూరి. జర్నలిజం భాష, పరిభాష, అనువాదాలు, కొత్తపదాల వాడుక, పారిభాషిక పదాల నిఘంటువుల తయారీ, కొత్త తరం జర్నలిస్టులకు శిక్షణ పాఠాలు, పాత పత్రికల డిజిటలైజేషన్ లాంటి విషయాల్లో పొత్తూరి కృషి చెబితే చర్విత చర్వణం అవుతుంది. హైదరాబాద్ విజయనగర్ కాలనీ ఆయనింట్లో మెట్లెక్కి పైకి వెళ్ళగానే చుట్టూ ఎటుచూసినా పుస్తకాలే పుస్తకాలు. అందులో చక్కగా పేర్చిన టేబుల్ మీద డెస్క్ టాప్. ఆధునికులతో పోటీపడుతూ తెలుగు, ఇంగ్లీషులో ఆయన వ్యాసాలను ఆయనే టైప్ చేసుకుంటారు. నెట్లో లేటెస్ట్ విషయాలను ఫాలో అవుతారు. గ్రంథాలయం మధ్యలో ఒక వాలు కుర్చీ, చిన్న మంచం, పరుపు. నిత్య పఠనం పొత్తూరి బలం.



పొత్తూరి జర్నలిస్టుల్లో జర్నలిస్టు. ఆస్తికుల్లో ఆస్తికుడు. నాస్తికుల్లో నాస్తికుడు. మానవహక్కుల్లో ఉద్యమకారుడు. సంప్రదాయజ్ఞుల్లో సంప్రదాయవాది. అభ్యుదయవాదుల్లో అభ్యుదయకారుడు. విప్లవోద్యమాలకు మిత్రుడు. అధికారపీఠాల్లో పెద్దలకు ఆత్మీయుడు. ప్రతిపక్షాలకు సలహాదారుడు. తెలుగు భాషాప్రేమికుడు. తాను నొచ్చుకున్నా ఇతరులను నొప్పించని పెద్దమనిషి. అజాతశత్రువు. వివాదాస్పద అంశాల మధ్య వివాదం లేకుండా నడిచినవాడు. వైరుధ్యాల మధ్య వైవిధ్యంగా నిలబడినవాడు. పెద్దల్లో పెద్ద, చిన్నల్లో చిన్నగా మెలిగినవాడు. అందరి బంధువు అయినవాడు.

పేలాల్సిన అన్నల మందుపాతర మీద మాటను మంత్రించడం, ఎక్కుపెట్టిన పోలీసు తుపాకీ గొట్టానికి తనచేతిని అడ్డుపెట్టడం రెండూ పొత్తూరి ఒకే సమయంలో చేయగలిగారు. రాజ్యం, హింస, పౌరహక్కుల గురించి ఆయన ఎంత లోతుగా ఆలోచిస్తారో? వాల్మీకి రాముడు-రాముడి ఆదర్శాల గురించి అంతే లోతుగా ఆలోచిస్తారు. అధ్యయనం చేస్తారు. ఎందులో అయినా మంచిని చూసే గుణమేదో ఆయనకు స్వతహాగా అబ్బినట్లుంది. అందుకే విప్లవోద్యమ ఎర్రజెండాల వారు ఆయనతో కాఫీ తాగి వెళ్లిన వెంటనే అదే కుర్చీలో ఆయన ఎదురుగా సనాతనధర్మ కాషాయాంబరధారులు ఆధ్యాత్మిక విషయాలు మాట్లాడుతుంటారు.

ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షలు ఉద్యమరూపం తీసుకున్నప్పుడు ఆయన తెలంగాణను స్వప్నించారు, ప్రేమించారు. ఉద్యమానికి బాసటగా నిలిచారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినాక తెలంగాణను నిండు మనసుతో అభినందించారు. ఆశీర్వదించారు. భిన్నవాదాలకు పొత్తూరి ఎలా పొత్తు కుదిర్చారో నేటితరం అర్థం చేసుకోవాల్సి ఉన్నది. పరస్పర తీవ్ర వైరుధ్యాలున్న వారితో ఆయన దశాబ్దాల తరబడి హాయిగా ఎలా నడువగలిగారో నేటి సమాజం గమనించాల్సి ఉన్నది. వాదాలను, వేదాలను ఆయన ఒకే ఒరలో సునాయాసంగా ఎలా సర్దుబాటు చేశారో ఆధునికులు అర్థం చేసుకోవాల్సి ఉన్నది.

సమాజం పట్ల బాధ్యత అంటే సంపాదకీయాలు రాసి వెదజల్లడం కాదని పొత్తూరిని చూసి నేర్చుకోవాలి. సమాజంలో భాగం కావాలంటే సమాజంలోనే ఉండాలని పొత్తూరిని చూసి తెలుసుకోవాలి. చెప్పే మాటలకు-చేసే పనులకు తేడా ఉండకూడదనుకుంటే పొత్తూరిని చదవాలి. ముదిమి వయసు సవాలు చేస్తున్నా అంతరాంతరాల్లో సంఘం పట్ల సంఘర్షణ పురులు విప్పాలంటే పొత్తూరిని అధ్యయనం చేయాలి. బుద్ధిజీవి బాధ్యతగా ఎన్ని సమస్యల సముద్రాలను ఈదగలడో తెలుసుకోవాలంటే పొత్తూరిని అర్థం చేసుకోవాలి. చివరగా-మనిషితనపు మౌలికమైన పునాదులు గట్టిపడాలంటే పొత్తూరిని గట్టిగా పట్టుకోవాలి.

**- పమిడికాల్వ మధుసూదన్**

తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు.. అన్న నినాదంతో 2001, మే 31న బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ వేదికగా తెలంగాణ జర్నలిస్టు ఫోరం (టీజేఎఫ్) ఆవిర్భవించింది. స్వపరిపాలన, ఆత్మగౌరవం కోసం సాగుతున్న ఉద్యమంలో కదం, కదం కలిపి రాష్ట్రసాధనే లక్ష్యంగా టీజేఎఫ్ ఉద్యమాన్ని ప్రారంభించింది. 2001-2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడేదాకా సాగిన ఉద్యమంలో ప్రతి అడుగులో, ప్రతి మలుపులో టీజేఎఫ్ తనవంతు పాత్ర పోషించింది. రాష్ట్ర ఆవశ్యకతను వివరిస్తూ భావజాలవ్యాప్తి, తెలంగాణ కోసం రాజకీయపార్టీలను ఒక వేదిక మీదికి తీసుకురావడం, ఉద్యమంలో భాగమై ర్యాలీలు, ధర్నాలు, చర్చా వేదికలతో టీజేఎఫ్ రాష్ట్రసాధనలో భాగమైంది.

దేశ చరిత్రలోనే ఎప్పుడూ లేనివిధంగా రాష్ట్ర సాధనోద్యమంలో తెలంగాణ జర్నలిస్టులను టీజేఎఫ్ భాగస్వామ్యం చేసింది. 'జర్నలిస్టులు విశ్వ మానవులుగా ఉండాలి, జర్నలిస్టులకు ప్రాంతం ఏంటీ'? అన్న వాదాలకు టీజేఎఫ్ చెప్పిన సమాధానమొక్కటే.. 'మేం మొదటగా తెలంగాణ భూమిపుత్రులం, ఆ తర్వాతే జర్నలిస్టులం'అని. భిన్నవాదనలు, ఎన్నో విమర్శలకు సమాధానాలు చెప్పుకుంటూ ముందుకు సాగింది టీజేఎఫ్.

రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించిన టీడీపీ, సీపీఎం వంటి పార్టీలను సైతం

## జర్నలిస్టుల పతాక టీజేఎఫ్

తెలంగాణ నినాదంతో ఒకే వేదిక మీదకు తెచ్చిన ఘనత టీజేఎఫ్‌ది. సుందరయ్య విజ్ఞానకేంద్రం నుంచి ఇందిరాపార్కు వరకు నిర్వహించిన కలం కవాతు మొదలుకొని, రాష్ట్రం ఏర్పాటు చేయాలంటూ ఢిల్లీలో పార్లమెంట్ ముందు టీజేఎఫ్ చేసిన ధర్నా, అసెంబ్లీలో తెలంగాణ అనే అంశాన్ని చర్చకురాకుండా సమైక్యవాద పార్టీలు వ్యవహరించినప్పుడు మాక్ అసెంబ్లీ ఏర్పాటు, ఛలో అసెంబ్లీ, సాగరహారం వంటి పోరాటాల్లో అగ్రభాగాన నిలిచింది టీజేఎఫ్. డిసెంబర్ 23 ప్రకటన, తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలను ఎప్పటికప్పుడూ ఒడుపుతో, ఓర్పుతో రాష్ట్రసాధన కోసం కృషిచేసిన సంస్థ టీజేఎఫ్.

రాష్ట్రం కోసం ఘోరంగా పోరాడిన టీజేఎఫ్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత, టీజేఎఫ్ పోరాట వారసత్వానికి కొనసాగింపుగా 2014, మార్చి 9న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగిన జర్నలిస్టుల జాతరలో టీయూడబ్ల్యూజేగా ఆవిర్భవించింది. అదే సభలో వర్కింగ్ జర్నలిస్టులు అందరికీ అక్రిడిటేషన్ కార్డులు, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా హెల్త్‌కార్డు, ఇండ్ల స్థలాలు ఇప్పిస్తానని కేసీఆర్ హామీ ఇచ్చారు. సీఎం బాధ్యతలు చేపట్టిన కేసీఆర్ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలుచేస్తున్నారు. ఇండ్లస్థలాల విషయం న్యాయస్థానంలో కేసు ఉండటం వల్ల ఆలస్యం అవుతున్నది.

గత పోరాటస్ఫూర్తిని కొనసాగిస్తూ గతాన్ని సమీక్షించుకొని, వర్తమానాన్ని విశ్లేషించుకొని భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకునేందుకు టీయూడబ్ల్యూజే మార్చి 8న రాష్ట్ర మహాసభలను హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించుకుంటున్నది. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం అదే పోరాట స్ఫూర్తితో ముందుకు పోదామని జర్నలిస్టు లోకానికి పిలుపునిస్తున్నది.

**- ఎ.రమణకుమార్**

**(ఈ నెల 8న హైదరాబాద్‌లో టీయూడబ్ల్యూజే రాష్ట్ర మహాసభల సందర్భంగా..)**

**జనగళం**

### ఈసారైనా ఊరట కలిగేనా?

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నిర్భయ లైంగికదాడి, హత్య కేసులో నిందితులకు పాటియాలా హౌస్ కోర్టు మరోసారి ఉరిశిక్ష ఖరారు చేసింది. మార్చి 20న దోషులకు ఉరిశిక్ష అమలుకానున్నది. అయితే ఇప్పటికే మూడుసార్లు ఉరిశిక్ష వాయిదా పడుతూ వచ్చింది. ఈ సారైనా ఉరిశిక్ష అమలుజరిగి తమ కుటుంబానికి న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నామని నిర్భయ తల్లి అంటున్నారు. అయితే నిందితుడి క్షమాభిక్ష పిటిషన్ రాష్ట్రపతి తిరస్కరణకు గురికావడంతో ఈసారి నిదింతులకు ఉరిశిక్ష అమలయ్యే అవకాశం ఉన్నది.

**- సంధ్యారాణి విరగదిండ్ల, పరావత్‌పూర్, మహబూబ్‌నగర్**

### హోలీ వేడుకలకు దూరంగా ఉండాలి

కరోనా వైరస్ కారణంగా హోలీ వేడుకలకు దూరంగా ఉండాలని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో పాటు ప్రధాని నరేంద్ర మోదీ నిర్ణయం తీసుకోవటం అభినందనీయం. పెద్దమొత్తంలో స్నేహితులు, బంధువులు, కుటుంబసభ్యులు కలిసి రంగులు చల్లుకుంటూ చేసుకునే రంగుల పండుగ హోలీ. అయితే దేశంలో కరోనా వైరస్ ప్రభావం తక్కువగానే ఉన్నా ముందస్తు జాగ్రత్తలు పాటించటం అవసరం. ప్రజలందరూ సమూహ వేడుకలకు దూరంగా ఉంటే మంచిది.

**- బత్తిని లక్ష్మయ్య, మిర్యాలగూడ**

### హర్షణీయం

నలుగురు గుమిగూడితే చాలు కరోనా కబుర్లే. కరోనా వైరస్ యావత్ ప్రపంచాన్ని వణికిస్తున్నది. అయితే హైదరాబాద్‌లో కరోనా వైరస్ వ్యాపించిందంటూ జరుగుతున్న వదంతులను నమ్మవద్దు. అయినప్పటికీ ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటుండటం స్వాగతించాల్సిన విషయం. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శాఖా మంత్రి ఈటల రాజేందర్ ఎప్పటికప్పుడు మీడియాతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కరోనా వైరస్ ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ఎలాంటి పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నదో ప్రజలకు తెలియజేస్తుండటం హర్షణీయం. అయితే ఇందులో ప్రజల భాగస్వామ్యం అవసరం. అప్పుడే కరోనా వైరస్‌ను ఎదుర్కోవచ్చు. కాబట్టి సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మకుండా పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

**- మ్యాన శ్రీనివాస్, కరీంనగర్**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.** editpage@ntnews.com Fax-040-23291118

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com

## బ్రహ్మోత్సవాలకు ధర్మపురి ముస్తాబు

### నేటి నుంచి 18 వరకు వేడుకలు

**ధర్మపురి, నమస్తే తెలంగాణ:** అంత్యంత ప్రాచీన పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. శుక్రవారం నుంచి ఈ నెల 18 వరకు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. నృసింహుడి బ్రహ్మోత్సవాలకు తెలుగు రాష్ట్రాలతోపాటు మహారాష్ట్ర నుంచి భక్తులు తరలి రానున్నారు. ఏర్పాట్లపై మంత్రి కొప్పుల ఈశ్వర్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.



యాదాద్రి విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నిర్మాణాలు, గోపురాలు, ప్రాకారాలు అతి సుందరంగా దర్శనమిస్తున్నాయి.



## వైభవంగా రథోత్సవం

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్యవిమాన రథోత్సవాన్ని గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. మొదట బాలాలయంలో ఆ తరువాత కొండ కింద రథాన్ని ఊరేగించారు. భక్తులు స్వామివారి రథాన్ని లాగడానికి పోటీపడ్డారు. వేడుకల్లో ఈవో గీత, అనువంశిక ధర్మకర్త బీ నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.
- యాదాద్రి భువనగిరి ప్రతినిధి, నమస్తేతెలంగాణ





కార్యక్రమంలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

## మహనీయుల అడుగుజాడల్లో నడవాలి

### స్పీకర్ పోచారం పిలుపు

**బాన్సువాడ, నమస్తే తెలంగాణ:** మహనీయులు చూపిన బాటలో నడవాలని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి సూచించారు. గురువారం కామారెడ్డి జిల్లా బాన్సువాడలో నిర్వహించిన సేవాలాల్ జయంతి వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి, భోగ్ బండార్ నిర్వహించారు. స్వరాష్ట్రంలో టీఆర్ఎస్ సర్కార్ అధికారికంగా సేవాలాల్ ఉత్సవాలను నిర్వహిస్తున్నదని స్పీకర్ తెలిపారు.



గురువారం నల్లగొండ జిల్లాకేంద్రంలోని కురుస్తున్న వర్షం

## పలుజిల్లాల్లో అకాల వర్షం

**నమస్తేతెలంగాణ నెట్‌వర్క్:** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గురువారం అకాల వర్షం కురిసింది. వరంగల్, ములుగు, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో మధ్యాహ్నం తర్వాత ఒక్కసారిగా మబ్బులు కమ్ముకొని వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. వరంగల్ అర్బన్ జిల్లాలో దాదాపు రెండు గంటలపాటు కురిసిన వర్షంతో హన్మకొండలోని రోడ్లు జలమయమయ్యాయి. ధర్మసాగర్, కాజీపేట మండలాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో ఆరబోసిన మిర్చి తడిసింది. నల్లగొండ జిల్లాకేంద్రంలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురవగా, చండూరు, నకిరేకల్, కట్టంగూరు మండలాల్లో జల్లులు పడ్డాయి. సూర్యాపేట జిల్లాకేంద్రం, చివ్వెంల మండలంలో గంటపాటు ఎడతెరిపిలేకుండా వర్షం పడింది. సూర్యాపేట మార్కెట్‌లో కాంటా పూర్తయిన కందుల బస్తాలు తడిసిపోగా.. అప్రమత్తమైన రైతులు టార్పాలిన్లు కప్పడంతో నష్టం తగ్గింది. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని పలు గ్రామాల్లో కురిసిన వర్షంతో ఆరబోసిన మిర్చి తడిసింది.



గోదావరిఖనిలో పోలీసు అధికారులతో మాట్లాడుతున్న పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి

## దేశంలోనే తెలంగాణ పోలీస్ నంబర్ వన్

### పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్

**ఫెర్టిలైజర్‌సిటీ/సీసీసీ నస్పూర్:** దేశంలోనే తెలంగాణ పోలీసులు అన్ని రంగాల్లో నంబర్‌వన్‌గా గుర్తింపు సాధిస్తున్నారని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ అన్నారు. గురువారం మంచిర్యాల జిల్లా సీసీసీ నస్పూర్ కాలనీలో పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభించి, పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో నూతనంగా నిర్మిస్తున్న వన్ టౌన్ మోడల్ ఠాణా, పోలీస్ విశ్రాంతి భవనం, కమిషనరేట్ నూతన కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పోలీసులకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వడంతోపాటు వారికి కావాల్సిన సదుపాయాల కల్పనకు ప్రత్యేకంగా నిధులు కేటాయించిందన్నారు. హైదరాబాద్‌లోని పంజాగుట్ట, గచ్చిబౌలి, ఆదిభట్ల పోలీస్‌స్టేషన్లను సాంకేతిక పరిజ్ఞానంతో ఆధునీకరించిందని, పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌ను ఇతర రాష్ట్రాల సీఎంలు, ఉన్నతాధికారులు కొనియాడారన్నారు. జూబ్లీహిల్స్‌లో రోడ్డు నంబర్ 12లోని టెక్ టవర్ రూ.400 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నామనీ, 20 అంతస్తుల ఈ భవనం త్వరలోనే పూర్తవుతుందన్నారు.

## దమ్మాయిగూడ కమిషనర్‌పై బదిలీ వేటు

**మేడ్చల్ కలెక్టరేట్:** పట్టణ ప్రగతిలో నిర్లక్ష్యం వహించిన మరో కమిషనర్‌ను విధుల నుంచి తప్పించారు. మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ రామలింగం పట్టణ ప్రగతిలో నిర్లక్ష్యం వహించినట్టు గుర్తించిన కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు ఆయన్ను పురపాలక శాఖ ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. నాగారం కమిషనర్ వాణికి దమ్మాయిగూడ ఇంచార్జి బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.



జాతీయ సదస్సులో మాట్లాడుతున్న నందిని సిధారెడ్డి

## కథ ఆసక్తిని రేకెత్తించాలి

### సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి

**కరీంనగర్‌రూరల్:** కథ పాఠకులకు ఉత్సాహం, ఆసక్తిని కలిగించాలని సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి అన్నారు. బుధవారం కరీంనగర్ మండలం నగునూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో 'కరీంనగర్ జిల్లా కథా సాహిత్యం – సమాలోచన'పై తెలంగాణ సాహిత్య అకాడమీ, కళాశాల సంయుక్తంగా రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సును సిధారెడ్డి ప్రారంభించి ప్రసంగించారు. కథాసాహిత్యం అంటే మానవ సంబంధాలు, పాత్రల వ్యక్తీకరణ, సంఘంలో మంచీచెడులు, జీవిత సన్నివేశాలు అన్ని తెలుసుకొనేలా చేసేదని తెలిపారు. గురుకుల కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, రచయితలు డాక్టర్ కాల్వ మల్లయ్య, ఆచార్య కే యాదగిరి, పెద్దింటి అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 'అలివి వల'కు చెక్

- స్థానికుల పొట్టకొడితే క్రిమినల్ కేసులు
- అధికారులకు మంత్రి తలసాని ఆదేశాలు
- 'నమస్తే తెలంగాణ' కథనానికి సర్కారు స్పందన
- మత్స్యకారుల హర్షం




శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో అలివి వలతో చేపల వేట (ఫైల్)

**మహబూబ్‌నగర్ ప్రధాన ప్రతినిధి/హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో అలివి వలలతో అక్రమంగా చేపల వేటను సాగిస్తూ స్థానిక మత్స్యకారుల పొట్టకొడుతున్న దళారులను ఉపేక్షించేది లేదని తెలంగాణ ప్ర భుత్వం హెచ్చరించింది. 'అలివి గాని వలలు' శీర్షికన గురువారం 'నమస్తే తెలంగాణ' ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనానికి రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. స్థానికంగా కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు ఇదే విషయాన్ని ఏపీ మత్స్యశాఖ దృష్టికి తీసుకెళ్లనున్నారు. సర్కార్ స్పందించి చర్యలకు ఉపక్రమించడంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా తమకు న్యాయం జరుగుతుం దని, ఇందుకు చొరవ తీసుకున్న 'నమస్తే తెలంగాణ'కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

### రంగంలోకి దిగిన అధికారులు..

మంత్రి ఆదేశాలతో అధికారులు ఆగమేఘాల మీద కదిలారు. వనపర్తి కలెక్టర్ యాస్మిన్ బాషా వెంటనే ఆర్డీవో చంద్రారెడ్డి, డీఎస్పీ కిరణ్‌కుమార్, మత్స్యశాఖ ఏడీ ఎస్ఎ రహమాన్‌తో సమావేశమయ్యారు. వనపర్తి జిల్లా పరిధిలోకి వచ్చే నదీ పరీవాహక ప్రాంతాలైన చెల్లపాడు, కాలూరు, గూడెం గ్రామాల్లో ఆంధ్రా ప్రాంతం నుంచి వలస వచ్చిన దళారులు నిషేధిత అలివి వలలను ఉపయోగించి చేపలు పడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని అధికారులు తెలిపారు. గతంలోనూ పలుమార్లు దాడులు జరిపి అలివి వలలను స్వాధీనం చేసుకున్నప్పటికీ మళ్లీ అదే దందాను కొనసాగిస్తున్నట్టు వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. భవిష్యత్తులో అలివి వలల ద్వారా ఎవరూ చేపలు పట్టకుండా ఉండేందుకు పోలీసు, రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు, స్థానిక లైసెన్సు కలిగిన మత్స్యకారులతో సంయుక్తంగా టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు కలెక్టర్ ప్రకటించారు. అలివి వలల ద్వారా చేపలు పట్టడాన్ని శాశ్వతంగా నిరోధించేందుకు స్థానిక మత్స్యకార సంఘాలతో చిన్నంబావి మండల కేంద్రంలో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని ఆదేశించారు. కృష్ణానది పరీవాహకంలో నిఘా పెట్టేలా పోలీసు పెట్రోలింగ్‌కు ఆదేశించారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో నం.9ను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. నాగర్‌కర్నూల్ కలెక్టర్ శ్రీధర్ సైతం స్పందించి ప్రత్యేక బృందాన్ని తనిఖీలకు పంపించారు. చేపల దందాను అడ్డుకునేందుకు శుక్రవారం సమావేశాన్ని నిర్వహించనున్నారు. సర్కారు స్పందనపై స్థానిక మత్స్యకారులు సంబురపడుతున్నారు.

### ఇక క్రిమినల్ కేసులే..

నిషేధిత అలివి వలలను వినియోగించి చేపల వేట కొనసాగించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో ప్రభుత్వం విడుదల చేసిన చేపపిల్లలను అలివి వలలతో వేటాడుతున్న ఘటనపై మంత్రి తలసాని స్పందించారు. గురువారం మంత్రి నివాసంలో మత్స్యశాఖ కమిషనర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమానికి ఉచితంగా చేపపిల్లలను విడుదల చేస్తుందన్నారు. తెలంగాణ మత్స్యకారుల ఉపాధిని దెబ్బతీసేలా శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో అలివి వలలతో చేపలను వేటాడిన వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని మత్స్యశాఖ కమిషనర్‌ను ఆదేశించారు. అక్రమ వేటను అరికట్టేందుకు పోలీస్, రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులతో బృందాలను ఏర్పాటు చేయాలని వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యాలకు గండికొట్టే వారు ఎంతటివారైనా ఉపేక్షించవద్దని సూచించారు. ఈ ఘటనను ఏపీ మత్స్యశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని మత్స్య శాఖ కమిషనర్ సువర్ణను ఆదేశించారు. నిషేధిత వలలతో చేపల వేటను అరికట్టేందుకు మత్స్యశాఖ అధికారిని పర్యవేక్షకుడిగా నియమించినట్టు మంత్రి తెలిపారు.

### 'నమస్తే తెలంగాణ'కు కృతజ్ఞతలు



అలివి వలలతో చేపల దోపిడీని వెలుగులోకి తీసుకొచ్చిన 'నమస్తే తెలంగాణ'కు కృతజ్ఞతలు. వాటితో వేటకు రావాలంటే అక్రమార్కులు భయపడాలి. సర్కార్ మాకోసం ఖర్చు చేసిన డబ్బులు వృథాకాకుండా చూసే బాధ్యత అధికారులదే.
- పుట్ట బాలస్వామి, ఎల్లూరు, కొల్లాపూర్ మండలం

### ఇక మా వలల దుమ్ము దులుపుతాం



ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి వలలు, బండ్లు, ఆటోలు, పరికరాలను ఇచ్చింది. ఉచితంగా చేప పిల్లలను వదిలింది. అలివి వలల వల్ల అవన్నీ వృథా అయినయ్. వాటిని లేకుండా చేస్తే అటకెక్కిన మా వలల దుమ్ము దులుపుతాం.
- విరూపాక్షమ్మ, ఎల్లూరు, కొల్లాపూర్ మండలం

### దొరకంగనే తగులబెట్టాలి..



గతంలో అలివి వలలను అధికారులకు పట్టించాం. కానీ ఆ వలలను తిరిగి వారికే ఇచ్చేసి చేతులు దులుపుకొన్నారు. ప్రభుత్వం నిషేధించిన వలలను ఎక్కడ స్వాధీనం చేసుకుంటే అక్కడే తగులబెట్టాలి. అప్పుడే ఇలాంటి ప్రయత్నం చేయరు.
- చిన్న భాస్కర్, ఎల్లూరు, నాగర్ కర్నూలు జిల్లా

# 'కరోనా'పై అలర్ట్

### అన్ని జిల్లాల్లో ప్రత్యేక వార్డులు
### కరపత్రాలతో అవగాహన



మహబూబ్‌నగర్ జిల్లా దవాఖానలో ప్రత్యేక పరికరాలను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. అన్ని జిల్లాల కలెక్టర్లను అప్రమత్తం చేసింది. ప్రభుత్వ దవాఖానల్లో ప్రత్యేకంగా కరోనా ఐసోలేషన్ వార్డులను ఏర్పాటు చేశారు. నల్లగొండ జిల్లా కేంద్ర దవాఖానలో 20 పడకల ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేయగా రెండ్రోజుల్లో మిర్యాలగూడ, దేవరకొండ, నందికొండ దవాఖానల్లో ఐసోలేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని 20 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రెండు అర్బన్ సెంటర్లలో ప్రత్యేక బృందాలు సిద్ధంగా ఉన్నాయి. ఆదిలాబాద్‌లోని రిమ్స్ దవాఖానలో 6 పడకలతో ప్రత్యేకవార్డులో మందులు, మాస్కులు, కృత్రిమ శ్వాసపరికరాలు అందుబాటులో ఉంచారు. ఇప్పటికే వరంగల్ ఎంజీఎం దవాఖానలో 25 పడకలతో ప్రత్యేకంగా విభాగాన్ని ఏర్పాటుచేశారు. వైరస్ సోకకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రజలకు సూచిస్తూ కరపత్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

**ఆందోళన చెందొద్దు: మంత్రి శ్రీనివాస్‌గౌడ్**
మహబూబ్‌నగర్ జనరల్ దవాఖానలో ఏర్పాటు చేసిన కరోనా ఐసోలేషన్ ప్రత్యేక వార్డును గురువారం ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పరిశీలించారు. వైద్య పరికరాలు, వసతులు, మందులను, ఎన్–95 మాస్కులు, 200 మందికి సిద్ధంగా ఉంచిన సూట్‌లను పరిశీలించారు. కరోనా వైరస్ పట్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కనీస జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందని మంత్రి అన్నారు.



జగిత్యాల జిల్లా కేంద్రంలో పసుపు రైతుల ర్యాలీ

## పసుపు రైతుల భారీ ర్యాలీ

- మద్దతు ధర కల్పించాలని నిరసన
- ఎంపీ అర్వింద్ రాజీనామాకు డిమాండ్

**జగిత్యాల టౌన్:** పసుపు పంటకు మద్దతు ధర, బోనస్ ఇవ్వాలని రైతులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జగిత్యాల జిల్లా రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో 400 మంది రైతులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పలువురు రైతులు మాట్లాడుతూ.. జిల్లాలో 40 వేల ఎకరాల్లో పసుపు సాగు చేస్తున్నామని, ఎకరం సాగుకు రూ.లక్ష నుంచి రూ.1.20 లక్షల వరకు ఖర్చు అవుతుందన్నారు. మార్కెట్‌లో ఎకరా పంటకు రూ.50 వేల నుంచి రూ.80వేల వరకే వస్తుండగా, ఎకరా పంటకు రూ.30 వేల వరకు నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు రోజుల్లో పసుపు బోర్డు తెస్తానని బాండ్ పేపర్ రాసిచ్చి.. మాట మార్చిన నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి

**ఇందల్వాయి/మేడిపల్లి:** రాష్ట్రంలోని రహదారులు రక్తసిక్తమయ్యాయి. నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో గురువారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతిచెందారు. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయిలో ఓ కారు చెట్టును ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు చనిపోగా, మరోముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్యనగర్‌కు చెందిన ఆరుగురు స్నేహితులు ధర్పల్లి మండలంలోని స్నేహితుడి పెండ్లికి వెళ్లి వస్తుండగా ఇందల్వాయిలో చెట్టును ఢీకొట్టారు. కారులో ఉన్న బాలకృష్ణ, గౌతమ్, నిఖిల్‌కుమార్, సాయినికేత్, ప్రశాంత్, శ్రావణ్ తీవ్రంగా గాయపడ్డారు. టోల్‌ప్లాజా సిబ్బంది క్షతగాత్రులను జిల్లా కేంద్ర ప్రభుత్వ దవాఖానకు తరలించగా బాలకృష్ణ, గౌతమ్‌రెడ్డి, నిఖిల్‌కుమార్ మృతిచెందారు. ప్రశాంత్, శ్రావణ్, సాయినికేత్ పరిస్థితి విషమంగా ఉన్నది. మరో ఘటనలో జగిత్యాల జిల్లా మేడిపల్లిలో ఆర్టీసీ బస్సు–బైకు ఢీకొట్టిన ఘటనలో ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం గూండ్లపల్లికి చెందిన కుంచాల శివ(30), అదే జిల్లా సంతనూతులపాడు మండలం మంగమూరుకు చెందిన వేణు నవీన్ (25) అక్కడికక్కడే చనిపోయారు. వీరిద్దరు మేడిపల్లిలో బత్తుల వెంకటేశ్వర్లు అనే మేస్త్రీ వద్ద తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు.

## ఏసీబీకి చిక్కిన అధికారులు



ఎస్టీవో సైదులు



వెంకటేశ్వర్లు

**భద్రాచలం, నమస్తే తెలంగాణ/కోనరావుపేట:** భద్రాద్రి కొత్తగూడెం, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో ముగ్గురు అవినీతి అధికారులు ఏసీబీ వలకు చిక్కారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో అసిస్టెంట్ అగ్రికల్చర్ డైరెక్టర్‌గా పని చేసిన బొల్లుమల్లు నారాయణ 2008లో పదవీ విరమణ పొందారు. ప్రొహిబిషన్ పీరియడ్ కన్ఫర్మ్ కాకపోవడంతో పెన్షన్ రావడం లేదు. పెన్షన్ సెటిల్ చేసేందుకు నారాయణను భద్రాచలం సహాయ కోశాధికారి కార్యాలయంలో పనిచేస్తున్న ఎస్టీవో సైదులు, సీనియర్ అకౌంటెంట్ వెంకటేశ్వర్లు రూ.1.50 లక్షలు డిమాండ్ చేశారు. గురువారం భద్రాచలం కరకట్ట సమీపంలో బాధితుని నుంచి రూ.1.50 లక్షలు లంచం తీసుకుంటుండగా సీనియర్ అకౌంటెంట్ వెంకటేశ్వర్లును పట్టుకున్నారు. ఆయన ద్వారా డబ్బులు అడిగిన ఎస్టీవో సైదులును కూడా అదుపులోకి తీసుకున్నారు.

**కోనరావుపేటలో పంచాయతీ కార్యదర్శి..**
రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం ఎగ్లాస్‌పూర్ పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ ఏసీబీకి చిక్కాడు. ఎగ్లాస్‌పూర్‌కు చెందిన స్వామిగౌడ్ ఇంటి నిర్మాణ అనుమతి కోసం 2019 ఆగస్టులో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌ను కలిశాడు. అందుకు తనకు రూ.5 వేలు ఇవ్వాలని స్వామిగౌడ్‌ను డిమాండ్ చేశాడు. గురువారం బాధితుడి నుంచి ప్రవీణ్ రూ.2 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

# రైతు ఆత్మహత్యాయత్నం

- సిద్దిపేట అర్బన్ తాసిల్ కార్యాలయం వద్ద హల్‌చల్
- రికార్డులు మార్చారని ఆరోపణ



ఆత్మహత్యకు యత్నించిన రైతు కిష్టయ్య

**సిద్దిపేట అర్బన్:** తన భూమి రికార్డులను మార్చారని, కొద్దినెలలుగా 1బీ రికార్డులు రావడం లేదని ఆరోపిస్తూ ఓ రైతు గురువారం సిద్దిపేట అర్బన్ తాసిల్ కార్యాలయ ఆవరణలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లికి చెందిన కాసుల కిష్టయ్యకు 1975లో ప్రభుత్వం రెండెకరాల భూమిని మిట్టపల్లి శివారులోని 308 సర్వే నంబరులో కేటాయించింది. దాన్ని ఆయన 2012లో సిద్దిపేటకు చెందిన కృష్ణమూర్తికి విక్రయించాడు. ఈ క్రమంలో మిట్టపల్లికి చెందిన మరో వ్యక్తి ఈ స్థలం తనదంటూ రావడంతో సమస్య సిద్దిపేట అర్బన్ తాసిల్ కార్యాలయానికి చేరింది. విచారణ జరిపిన అధికారులు ఈ భూమి కాసుల కిష్టయ్యకు చెందినదిగా ప్రకటించారు. కాసుల కిష్టయ్య సదరు స్థలాన్ని కృష్ణమూర్తి అనే వ్యక్తికి విక్రయించినట్టు తెలుసుకున్న ప్రస్తుత తాసిల్దార్ అమ్మిన, కొన్న వారికి గతనెల 25న నోటీసులు జారీచేశారు. తన స్థలం విక్రయించకుండా తాసిల్దార్ అడ్డుకుంటున్నారని, రికార్డులు మార్చారని ఆరోపిస్తూ గురువారం తాసిల్ కార్యాలయ ఆవరణలో కిష్టయ్య ఆత్మహత్యకు ప్రయత్నించాడు.

### విచారణకు మంత్రి హరీశ్‌రావు ఆదేశం

రైతు ఆత్మహత్యాయత్నంపై స్పందించిన ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు ఘటన వెంటనే విచారణ జరిపించాలని కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డిని ఆదేశించారు. రైతు కాసుల కిష్టయ్య భూరికార్డుల సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. కార్యాలయాల వద్దకు వచ్చే రైతులను గౌరవించాలని మంత్రి సూచించారు.

## నేటినుంచి ఆర్డీఎస్‌కు నీరు

**అయిజ:** రాజోళి బండ డైవర్షన్ స్కీం(ఆర్డీఎస్) పరిధిలోని 20 వేల ఎకరాల ఆయకట్టును కాపాడేందుకు తుంగభద్ర డ్యామ్ నుంచి 1.90 టీఎంసీల నీటిని విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వం తుంగభద్ర బోర్డును కోరింది. ఈ మేరకు బోర్డు కార్యదర్శికి నీటి పారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్‌రావు గురువారం లేఖ రాశారు. 2019–20 సంవత్సరానికి సంబంధించి తుంగభద్ర డ్యామ్ నుంచి ఆర్డీఎస్ నీటి వాటా కింద 5.435 టీఎంసీలు ఇచ్చేందుకు గత నవంబర్‌లో బోర్డు నిర్ణయించింది. అయితే.. తుంగభద్ర నదిలో ప్రస్తుతం ప్రవాహం లేనందున ఆర్డీఎస్ ఆయకట్టుకు సాగునీరు, అయిజ, వడ్డేపల్లి, రాజోళి, మానవపాడు, ఉండవెల్లి, అలంపూర్ మండలాల్లో తాగు నీటికోసం చెరువులు నింపేందుకు 1.90 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కోరారు. ఈనెల 17 వరకు టీబీ డ్యామ్ నుంచి నీటిని విడుదల చేయాలని బోర్డుకు పంపిన లేఖలో కోరినట్టు ఆర్డీఎస్ ఈఈ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు టీబీ డ్యామ్ నుంచి నీటిని విడుదల చేయనున్నట్టు టీబీ డ్యామ్ సెక్షన్ అధికారి విశ్వనాథ్ తెలిపారు.

**ఆర్థిక మాంద్యం ఒకవైపు బుసలు కొడుతుంటే మరోవైపు కరోనా వైరస్ దేశ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను అల్లకల్లోలానికి గురిచేస్తున్నది. కర్ణుడి చావుకు కారణాలెన్నో అన్నట్లు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలు ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నాయి. మరోవైపు స్టాక్ మార్కెట్లు పాతాళానికి పడిపోగా, రూపాయి బక్కచిక్కుతున్నది. వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ప్రభుత్వం సార్వత్రిక బడ్జెట్ ప్రవేశపెట్టిన నాటి నుంచి స్టాక్ మార్కెట్లు నేల చూపులే చూస్తున్నాయి. వీటికితోడు చైనాలో ప్రబలిన కరోనా వైరస్ దెబ్బ దేశ ఆర్థిక వ్యవస్థతోపాటు స్టాక్ మార్కెట్లను కుప్పకూలుస్తున్నది. గడిచిన వారం రోజుల్లో సెన్సెక్స్ 2 వేల పాయింట్లకు పైగా నష్టపోవడంతో మదుపరుల సంపద ఏకంగా రూ.12 లక్షల కోట్లు హారతి కర్పూరంలా కరిగిపోయింది.**




2013-14 నుంచి 2018-19 మధ్య జీడీపీ, నిరుద్యోగం, డాలరుతో రూపాయి మారకం విలువ, ద్రవ్యోల్బణం తీరిలా..




# ఐసీయూలో దేశ ఆర్థికం!

## నానాటికీ క్షీణిస్తున్న జీడీపీ గణాంకాలు.. ఎగిసిపడుతున్న ద్రవ్యోల్బణం

## బ్యాంకింగ్, తయారీ తదితర కీలక రంగాలు కుదేలు.. పడిపోతున్న స్టాక్ మార్కెట్లు

## ఆందోళనకరంగా రూపాయి విలువ.. వేధిస్తున్న నిరుద్యోగం, పెట్టుబడుల కొరత

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ :** భారత ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతున్నది. గడిచిన ఇరవై మూడేండ్లలో ఇంత దారుణంగా పడిపోవడం ఇదే తొలిసారి. 1996 తర్వాత స్థూల దేశీయోత్పత్తి 4.5 శాతానికి పడిపోవడం ఆర్థిక వ్యవస్థ పతనావస్థను సూచిస్తున్నది. ఐసీయూకు చేరిన భారత ఆర్థిక వ్యవస్థకు చికిత్స చేయడానికి సమర్థులైన ఆర్థిక వేత్తలే మన దేశంలో కరువయ్యారా?.. మాజీ ఆర్బీఐ గవర్నర్లు రఘురామ్ రాజన్, ఊర్జిత్ పటేల్, ప్రధాన ఆర్థిక సలహాదారు అర్వింద్ సుబ్రమణియన్, నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ అర్వింద్ పనగరియా వంటి నిపుణుల సేవలను వినియోగించుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందా?.. అంటే ఔననే సమాధానం వినిపిస్తున్నది. దేశ ఆర్థిక వ్యవస్థను సుసంపన్నం చేసేలా కేంద్రం వద్ద కనీసం ఒక్క విభిన్న పథకం కూడా లేకపోవడం విచారించదగ్గ విషయం. ఇంతకీ, మన దేశ ఆర్థిక వ్యవస్థ పతనమవ్వడానికి.. స్థూల దేశీయ ఉత్పత్తి దారుణంగా పడిపోవడానికి గల కారణాలేమిటి? అంతర్జాతీయ మార్కెట్లో మందగమన పరిస్థితులు, పెద్ద నోట్ల రద్దు, లోపభూయిష్టంగా జీఎస్టీ అమలు, విదేశీ ఎగుమతుల్లో క్షీణత ప్రభావం వాహన, జౌళి రంగాలపై పడటం, నిర్మాణ, మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు గణనీయంగా తగ్గిపోవడం వంటి అంశాల కారణంగా దేశ జీడీపీ క్రమక్రమంగా పతనమవుతూ వస్తున్నది. దీంతో రైతులు, కూలీలు, కార్మికులు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు, వృత్తి నిపుణులు.. ఇలా ప్రతిఒక్కరూ ఇబ్బంది పడుతున్నారు. మన దేశంలో ఉత్పత్తి, నిర్మాణ, గనుల రంగాలు దారుణంగా దెబ్బతిన్నాయి. ఆర్థిక, రియల్ ఎస్టేట్, వృత్తిపరమైన సేవలు, వ్యక్తిగత వినియోగం వంటివి గణనీయంగా తగ్గముఖం పట్టాయి. భారత జీడీపీ వరుసగా ఆరు త్రైమాసికాల నుంచి, అంటే ఏడాదిన్నర నుంచి క్షీణిస్తున్నది. వ్యవసాయ ఉత్పత్తులు కేవలం రెండు శాతం చొప్పున వృద్ధి చెందాయి. వినియోగదారుల ధరల ఆధారిత ద్రవ్యోల్బణం 1.9% నుంచి 7.4 శాతానికి పెరుగగా.. వ్యవసాయ రుణాలు 18.3 నుంచి 5.3 శాతానికి, చిన్న, మధ్యతరహా సంస్థలకిచ్చే రుణాలు 6.7 నుంచి 1.6 శాతానికి పడిపోయింది. పారిశ్రామిక సూచి వృద్ధి కూడా 0.6 శాతానికి పరిమితమైంది. దేశంలో దాదాపు ప్రతి భారీ పరిశ్రమ వృద్ధి సున్నా లేదా ప్రతికూలానికి జారుకున్నది. కర్ణుడి చావుకి లక్ష కారణాలు అన్నట్లు.. భారత ఆర్థిక వ్యవస్థ పతనమవ్వడానికి గల కారణాలకు లెక్కే లేదు. ఒక దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందాలంటే ఆ దేశంలో వస్తువులు, సేవలు వంటివాటికి గిరాకీ పెరగాలి. గిరాకీ అధికంగా ఉన్నప్పుడే ఉత్పత్తి కూడా పెరుగుతుంది. ఇందుకోసం భారీ స్థాయిలో కార్మిక శక్తిని వినియోగించాల్సి ఉంటుంది. కార్మికులకు ఉపాధి అవకాశాలు మెరుగైనప్పుడే, తమకు కావాల్సిన వస్తువుల్ని కొనుగోలు చేయగల్గుతారు. ఆర్థిక లావాదేవీలు వరుస క్రమలో జరుగుతున్నప్పుడే ఆర్థిక వ్యవస్థ మెరుగ్గా ఉంటుంది. కాకపోతే, మన వద్ద గిరాకీయే లేకపోతే ఎలా? ఆర్థిక వ్యవస్థ పతనం కాకుండా మరెలా ఉంటుంది? స్థూలంగా గమనిస్తే.. మన దేశ జీడీపీలో వినియోగం వాటా ఎంత లేదన్నా 55-58 శాతం దాకా ఉంటుంది. వ్యక్తిగత వినియోగం తగ్గినప్పు డు, దాని ప్రతికూల ప్రభావం ఆర్థిక వ్యవస్థ మీద పడటమూ సర్వసాధారణమే కదా!



**కొత్త** పెట్టుబడుల్ని ఆకర్షించడంలో కేంద్రం ఘోరంగా విఫలమైంది. 2019 ఏప్రిల్ నుంచి జూన్ మధ్యలో కొత్తగా వచ్చిన పెట్టుబడుల వాటా 20.5 శాతం మాత్రమే. 2004 సెప్టెంబరు నుంచి దేశీయ ఆర్థిక స్థితిగతుల్ని క్షుణ్ణంగా గమనిస్తే.. పెట్టుబడుల ఆకర్షణలో ఇంతకంటే క్షీణత లేదనే చెప్పాలి. దీన్నిబట్టి చూస్తే భారత ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తుపై విదేశీ సంస్థలకు పెద్దగా నమ్మకం లేకుండా పోయింది.




**దేశీయ** బ్యాంకింగ్ రంగం కష్టకాలాన్ని ఎదుర్కొంటున్నది. నిరర్థక ఆస్తుల (మొండి బకాయిలు) విలువ ఎంతలేదన్నా రూ.10 లక్షల కోట్ల దాకా ఉంటుందని అంచనా. దీంతో కొత్త రుణగ్రహీతలకు అప్పులిచ్చే పరిస్థితులు బ్యాంకులకు లేకుండా పోయాయి. పైగా ఇటీవల పలు బ్యాంకుల్ని విలీనం చేయడంతో పెట్టుబడిదారులు, డిపాజిటర్ల మనసులో వ్యతిరేక భావాలు నెలకొన్నాయి. ఒకరకమైన అరాచక వాతావరణం నెలకొన్నది.



**భారతదేశపు** ఆర్థిక వృద్ధి కథలో వ్యవసాయ రంగానిదీ కీలకమైన పాత్రే. స్థూల దేశీయోత్పత్తిలో వ్యవసాయానిదే దాదాపు పదిహేను శాతం వాటా. పైగా, మన దేశంలోని 55 శాతం ప్రజలు వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. అలాంటి ఈ రంగ మూ గడ్డు పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నది. రైతు పండించిన పంటకు కనీస మద్దతు ధర లభించడం లేదు. దీంతో దేశవ్యాప్తంగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

### జీడీపీ తగ్గిందెంత?

**2014 నుంచి** 2019 మధ్యకాలంలో సరాసరిగా 7.5 శాతానికిపైగా వృద్ధి చెందిన భారత ఆర్థిక వ్యవస్థ.. 2019 సెప్టెంబర్ వరకు 4.5 శాతానికి పడిపోయింది. గత ఆరేండ్లలోనే ఇదే కనిష్ఠ స్థాయి. ఉత్పత్తి రంగంలో క్షీణత వల్ల వ్యవసాయ రంగం కార్యకలాపాలు దారుణంగా పడిపోయాయి. వాస్తవానికి, 2014లో భారత ఆర్థిక వ్యవస్థ రెండు లక్షల కోట్ల డాలర్లకు చేరుకుంటుందని, ఇది 2019 నాటికి మూడు ట్రిలియన్ డాలర్లకు ఎగబాకుతుందని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) గతంలో అంచనా వేసింది. రష్యా, బ్రెజిల్, ఇటలీ వంటి దేశాల ఆర్థిక వ్యవస్థలను అధిగమిస్తుందని అప్పట్లోనే అంచనా వేసింది. 2014లో క్షీణత దశ నుంచి భారత్ కోలుకున్నదని, సమర్థవంతమైన విధానాల వల్ల ఆర్థిక వృద్ధి ఐదు శాతం దాటిందని ప్రశంసించింది. కాకపోతే, ప్రస్తుత పరిస్థితుల్లో భారత్ వృద్ధి రేటు ఆశించినదానికంటే బలహీనంగా నమోదు అయ్యిందని ఐఎంఎఫ్ డైరెక్టర్ గెర్రీ రైస్ అభిప్రాయపడ్డారు.

| ఏడాది | జీడీపీ (శాతాల్లో) |
|---|---|
| 2013 | 6.4 |
| 2014 | 7.2 |
| 2015 | 8.0 |
| 2016 | 8.2 |
| 2017 | 7.2 |
| 2018 | 6.8 |
| 2019 | 4.5 |
| 2020 | 4.8? |

### ప్రమాద సంకేతాలిస్తున్న సర్వే సంస్థలు

“ కరోనా వైరస్ నేపథ్యంలో ప్రపంచ జీడీపీ వృద్ధిరేటు అంచనాల్ని 3.3 శాతం నుంచి 2.9 శాతానికి తగ్గిస్తున్నాం. ఈ ప్రాణాంతక మహమ్మారి ప్రపంచ సమస్యగా పరిణమించింది. దీని ప్రభావం దాదాపు అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థల్ని కుదిపేస్తున్నది.

-క్రిస్టాలినా జార్జీవా, ఐఎంఎఫ్ చీఫ్

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం భారత జీడీపీ 4.9 శాతానికే పరిమితం కావచ్చు. వచ్చే ఆర్థిక సంవత్సరానికిగాను గతంలో వేసిన మా అంచనాల్నీ సవరిస్తున్నాం. 6.2 శాతం నుంచి 5.1 శాతానికి తగ్గిస్తున్నాం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కరోనా ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది.

-ఆర్థిక సహకార, అభివృద్ధి సంస్థ (ఓఈసీడీ)

‘ఈ ఏడాది భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధిరేటు అంచనాల్ని 5.4 శాతానికి తగ్గిస్తున్నాం. ఇంతకుముందు 6.6 శాతంగా అనుకున్నప్పటికీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కరోనా వైరస్ ప్రభావం నేపథ్యంలో మా అంచనాల్ని సవరిస్తున్నాం’

-గ్లోబల్ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ మూడీస్

‘ఈ ఆర్థిక సంవత్సరం భారత జీడీపీ వృద్ధిరేటు అంచనాలను 4.9 శాతానికి తగ్గిస్తున్నాం. గత అంచనా 5.1 శాతంగా ఉన్నది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి కూడా 5.9 శాతం నుంచి 5.4 శాతానికి కుదిస్తున్నాం. కరోనా వైరస్ ప్రభావంతో దేశీయ మార్కెట్లో డిమాండ్, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు ఏర్పడుతున్నాయి’

-క్రిస్టాలినా జార్జీవా, ఐఎంఎఫ్ చీఫ్

**కార్పొరేట్** ట్యాక్స్ కోతల రూపంలో సొమ్మంతా తీసుకెళ్లి రెండు వందల కార్పొరేట్ సంస్థల చేతిలో పోస్తే ఆర్థిక వ్యవస్థ చక్కబడుతుందనే భ్రమల్లో కేంద్రం ఉన్నట్టుగా అనిపిస్తున్నది. దీనివల్ల కార్పొరేట్ సంస్థలు అందించే వస్తువులు, సేవలు వినియోగదారులకు నామమాత్రపు ధరకే చేరే అవకాశాలున్నాయి. కాకపోతే, వాటిని అందుకునే ఆర్థిక స్థోమత లేనప్పుడు.. తక్కువ రేటుకే వస్తువులు, సేవలు లభించినా ప్రయోజనం శూన్యమే కదా! అందుకే, కేంద్రం ప్రజల కొనుగోలు శక్తిని పెంచేలా పటిష్ఠమైన చర్యలు తీసుకుంటే ఉత్తమమని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. కానీ, గత ఆరేండ్లుగా ఇలాంటి ఉపయోగకరమైన నిర్ణయాల్ని కేంద్రం తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు.




### అంతర్జాతీయ కారణాలేమిటి?

అంతర్జాతీయ ఆర్థిక వాతావరణంలో పెనుమార్పుల కారణంగా వాహన, జౌళి పరిశ్రమలకు గిరాకీ గణనీయంగా తగ్గింది.

భారత ఎగుమతులపై ప్రతికూల వాతావరణం ఏర్పడింది. వాహన రంగంలో వేలాదిమంది ఉద్యోగాల్ని కోల్పోయారు. పలు రంగాల్లో భారతదేశం ప్రపంచ లీడర్‌గా ఎదుగుతుండగా, ఈ ప్రతికూల వాతావరణం ఒక్కసారిగా దెబ్బతీసింది.

డొనాల్డ్ ట్రంప్ దూకుడు విధానాల కారణంగా, అమెరికా, చైనాల మధ్య వాణిజ్య యుద్ధం ఏర్పడింది. దీంతో ఆ రెండు దేశాలు పతనమయ్యాయి. దాని ప్రభావం మన ఆర్థిక వ్యవస్థ మీద పడింది.

భారత ఆర్థిక మంత్రి తీసుకుంటున్న నిర్ణయాల వల్ల ఆర్థిక వ్యవస్థ కాస్త నెమ్మదిగానే కోలుకునే అవకాశమున్నది.

కరోనా వైరస్ వల్ల చైనా మార్కెట్ ఎంతమేరకు దెబ్బతిన్నది? దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్‌కు కలిగే నష్టమేమిటనే విషయాల్ని అంచనా వేయడానికి మరికొంత సమయం పడుతుందని మూడీస్ వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థ విశ్లేషిస్తున్నది.



**పెద్దనోట్ల** రద్దు దేశీయ ఆర్థిక వ్యవస్థను దారుణంగా దెబ్బతీసింది. జీఎస్టీ (గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్) వల్ల కేంద్రానికి దాదాపు లక్ష కోట్ల దాకా పన్ను వసూళ్లు వస్తున్నాయి. ఇది మన ఆర్థిక వ్యవస్థను మెరుగుపరిచే నిర్ణయమే. కాకపోతే అమలులో ఘోరమైన తప్పిదం చేయడం వల్ల చిన్నాచితక వ్యాపారులు అనేక సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. అసలే వీరికి గల ఆర్థిక శక్తి అంతంత మాత్రమే. జీఎస్టీ సొమ్మును వెనక్కి తెచ్చుకునేందుకు రకరకాల తంటాలు పడుతున్నారు. తమ సొమ్మంతా ప్రభుత్వం చేతిలో ఇరుక్కుపోవడంతో వ్యాపారులు గగ్గోలు చేస్తున్నారు.



**కరోనా** వైరస్‌తో దేశ వృద్ధిరేటుపై స్వల్ప ప్రభావం మాత్రమే చూపనున్నదని బ్లూంబర్గ్ ఇండెక్స్ తాజాగా వెల్లడించింది. ఈ వైరస్ దెబ్బకు అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు భారీగా పతనమవడంతో ఇది దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవడానికి దోహదపడనున్నదని తెలిపింది.

---

# యెస్ బ్యాంక్‌కు ఊపిరి!

## రూ.12 వేల కోట్ల నుంచి 14 వేల కోట్ల సాయం అందించనున్న ఎస్బీఐ కన్సార్టియం

**న్యూఢిల్లీ/ముంబై, మార్చి 5:** ఆర్థిక ఇబ్బందులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ సంస్థ యెస్ బ్యాంక్‌కు ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ, మరికొన్ని ఆర్థిక సంస్థలు ఊపిరిలూదనున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)లు యెస్ బ్యాంక్‌ను ఆదుకోవాలని ఎస్బీఐకి సూచించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఎస్బీఐతోపాటు ప్రైవేట్ రంగ బ్యాంకులైన ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ, కొటక్ మహీంద్రా, యాక్సిస్, ఇండస్ ఇండ్ బ్యాంక్‌లతో కూడిన కూటమి యెస్ బ్యాంక్‌కు చేయూతనివ్వనున్నట్లు గురువారం సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది.




### మెజారిటీ వాటా కొంటారా?

ఎస్బీఐ నేతృత్వంలోని బ్యాంకర్ల కూటమిని యెస్ బ్యాంక్‌లో మెజారిటీ వాటాను కొనుగోలు చేయాలని కేంద్ర ప్రభుత్వం కోరినట్లు తెలుస్తున్నది. ముంబైలో జరిగిన ఎస్బీఐ బోర్డు సమావేశంలో ఈ అంశంపై చర్చ జరిగినట్లు తెలియవస్తుండగా, ఏ నిర్ణయం తీసుకున్నారన్నదానిపై మాత్రం సమాచారం లేదు. మరోవైపు ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీని కూడా వాటా కొనుగోలుకు మోదీ సర్కారు ముందుకు తోస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే యెస్ బ్యాంక్‌లో ఎల్ఐసీకి 8 శాతం వాటా ఉన్నది. ఈ క్రమంలో ఎస్బీఐ, ఎల్ఐసీ కలిసి 49 శాతం వాటాను పొందే వీలున్నది. ఒకప్పుడు మదుపరులకు అత్యంత ఇష్టదాయకమైన సంస్థగా ఉన్న యెస్ బ్యాంక్‌లో యాజమాన్య మార్పులు జరిగిన దగ్గర్నుంచి కష్టాలు మొదలైయ్యాయి. గతేడాది మార్చిలో కొత్త చీఫ్ ఎగ్జిక్యూటివ్ రవ్నీత్ గిల్ రాగా, గత ఆరు నెలలుగా రూ.15 వేల కోట్ల నిధులను సమీకరించేందుకు నానా సమస్యల్ని ఎదుర్కొంటున్నది.

### రూ.50వేలకు మించి తీసుకోవద్దు

**ఆర్థిక** సంక్షోభంలో కూరుకుపోయిన యెస్ బ్యాంక్‌ను ఆదుకునేందుకు ఆర్బీఐ విశ్వప్రయత్నాలనే చేస్తున్నది. సంస్థ పునరుద్ధరణలో భాగంగా గురువారం మారటోరియం విధించిన సెంట్రల్ బ్యాంక్.. నగదు ఉపసంహరణలపైనా పరిమితులు పెట్టింది. ఖాతాదారులు నెలకు రూ.50 వేలకు మించి తీసుకోరాదని నిర్ణయించింది. అంతకుమించి కావాలంటే ఆర్బీఐ అనుమతి తప్పనిసరి. ఇక తక్షణమే బోర్డును రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఎస్బీఐ మాజీ సీఎఫ్‌వో ప్రశాంత్ కుమార్‌ను బ్యాంక్ అడ్మినిస్ట్రేటర్‌గా నియమించింది. డిపాజిటర్ల ప్రయోజనాల రక్షణార్థం ప్రభుత్వంతో చర్చించి ఆర్బీఐ ఈ నిర్ణయాలు తీసుకున్నది.

# సెలెక్ట్‌లో సామ్‌సంగ్ 5జీ ఫోన్లు

**హైదరాబాద్, మార్చి 5:** ప్రముఖ మొబైల్ రిటైల్ విక్రయ సంస్థ సెలెక్ట్‌లో సామ్‌సంగ్‌నకు చెందిన 5జీ ఆధారిత ఎస్20 సిరీస్ మొబైళ్లు లభించనున్నాయి. హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో సామ్‌సంగ్‌నకు చెందిన ఎస్20, ఎస్20 ప్లస్, ఎస్20 అల్ట్రా మోడళ్లను కంపెనీ బ్రాండ్ అంబాసిడర్ జూనియర్ ఎన్టీఆర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కంపెనీ సీఎండీ వై గురు మాట్లాడుతూ..వినియోగదారులకు నూతన టెక్నాలజీతో తయారైన మొబైళ్లు అందించడంలో సంస్థ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. 6.9 అంగుళాల టచ్‌స్క్రీన్ కలిగిన ఈ గెలాక్సీ ఎస్20 అల్ట్రాలో 12జీబీ ర్యామ్, మూడు కెమెరాలు, 4000 ఎంఏహెచ్ బ్యాటరీ వంటి ఫీచర్స్ ఉన్నాయి.




5జీ ఫోన్లను విడుదల చేస్తున్న జూనియర్‌ఎన్టీఆర్



# హైదరాబాద్‌లో డిజైన్ కేఫ్ సెంటర్

**హైదరాబాద్, మార్చి 5:** గృహ ఇంటీరియర్ బ్రాండ్ డిజైన్ కేఫ్..హైదరాబాద్‌లో తన తొలి ఎక్స్‌పీరియన్ సెంటర్‌ను ఆరంభించింది. 8,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో వినియోగదారులు అభిరుచి మేరకు ఇంటిని డిజైన్ చేసి ఇవ్వనున్నట్లు కంపెనీ కో-ఫౌండర్, సీఈవో గీతా రామనన్ తెలిపారు. భాగ్యనగరంలో గృహాల డిజైన్ మార్కెట్ శరవేగంగా పుంజుకుంటున్న నేపథ్యంలో ఇక్కడ డిజైన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. గతేడాది రూ.100 కోట్ల ఆదాయాన్ని గడించిన సంస్థ..వచ్చే మూడేండ్లలో రూ.350 కోట్లకు చేరుకునే అవకాశాలున్నాయన్నారు. వచ్చే ఏడాది చివరి నాటికి టాప్-10 నగరాలకు విస్తరించనున్నట్లు ఆమె ప్రకటించారు.

# బీడీఎల్ రూ.183 కోట్ల మధ్యంతర డివిడెండ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వరంగ సంస్థ భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను రూ.183.28 కోట్ల మధ్యంతర డివిడెంట్‌ను ప్రకటించింది. దీంట్లో కేంద్ర ప్రభుత్వ వాటా కింద రూ.100.51 కోట్ల విలువైన చెక్‌ను గురువారం ఢిల్లీలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు కంపెనీ చైర్మన్, ఎండీ సిద్ధార్థ మిశ్రా అందచేశారు.

# రూ.8.29 లక్షల కోట్లు

- ఈ ఏడాది విమానయాన రెవిన్యూ నష్టంపై ఐఏటీఏ అంచనా
- కరోనా నేపథ్యంలో భారీగా తగ్గిన అంతర్జాతీయ ప్రయాణాలు
- చాలా దేశాల రూట్లను నిలిపివేస్తున్న ఎయిర్‌లైన్స్
- ఇప్పటివరకు 2లక్షలకుపైగా విమాన సర్వీసులు రద్దు



**సింగపూర్, మార్చి 5:** కరోనా వైరస్ ప్రభావం ప్రపంచ విమానయాన రంగంపై స్పష్టంగా కనిపిస్తున్నది. ఈ అంటువ్యాధి ఒక దేశం నుంచి మరో దేశానికి వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో విమాన ప్రయాణాలు భారీగా తగ్గుముఖం పట్టాయి. ఆయా దేశాల ప్రభుత్వాల ఆదేశాలతో ఎయిర్‌లైన్స్ సైతం తమతమ రూట్లను పెద్ద ఎత్తున తగ్గించేస్తున్నాయి. కొన్ని మార్గాలకైతే తాత్కాలికంగా సేవలను నిలిపివేస్తున్నాయి. దీంతో ఈ ఏడాది అంతర్జాతీయ విమానయాన పరిశ్రమకు రూ.8.29 లక్షల కోట్ల (113 బిలియన్ డాలర్లు) ఆదాయం వరకు పడిపోవచ్చని అంతర్జాతీయ వాయు రవాణా సంఘం (ఐఏటీఏ) గురువారం అంచనా వేసింది. రెండు వారాల క్రితం ఈ అంచనా కేవలం రూ.29.3 బిలియన్ డాలర్లుగానే ఉండటం గమనార్హం. కానీ ఇప్పుడది నాలుగింతలు పెరిగింది. వైరస్ నేపథ్యంలో 2లక్షలకుపైగా విమాన సర్వీసులు రద్దయ్యాయి. చైనాలో పుట్టిన ఈ మహమ్మారి ధాటికి 3,200 మందికిపైగా చనిపోగా, 95వేల మందికిపైగా బాధితులున్నారు. మొదట్లో వైరస్ ప్రభావం చైనాలోనే ఎక్కువగా కనిపించింది. ప్రస్తుతం 80 దేశాలకు వ్యాపించింది. భారత్‌లోనూ 29 కేసులు నమోదైయ్యాయి. ఈ నేపథ్యంలో విదేశీ ప్రయాణాలు మానుకోవాలని కేంద్ర ప్రభుత్వం సైతం ప్రజలకు సూచిస్తున్నది. అన్ని దేశాల తీరూ ఇలాగే ఉండటంతో ఆ ప్రభావం విమానయాన రంగం రెవిన్యూను దెబ్బతీస్తున్నది. ఇదిలావుంటే ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా వాటాల అమ్మకం కష్టమేనన్న అభిప్రాయాన్ని ఐఏటీఏ వ్యక్తం చేసింది.

### భారత వాణిజ్యంపై ప్రభావం

**భారత** వాణిజ్యంపై కరోనా వైరస్ ప్రభావం దాదాపు రూ.2,556 కోట్లు (348 మిలియన్ డాలర్లు)గా ఉండొచ్చని ఐక్యరాజ్య సమితి (యూఎన్) అంచనా వేసింది. టాప్-15 వైరస్ ప్రభావిత దేశ ఆర్థిక వ్యవస్థల్లో భారత్ కూడా ఉందని తెలిపింది. చైనా ఉత్పాదక రంగం కుప్పకూలిన నేపథ్యంలో ప్రపంచ వాణిజ్యం కూడా దెబ్బతిన్నదని చెప్పింది. చైనాయేతర దేశాల్లో అత్యధికంగా యూరోపియన్ యూనియన్ దేశాల ఆర్థిక వ్యవస్థలు 15.6 బిలియన్ డాలర్ల మేర నష్టపోతున్నాయని యూఎన్ వెల్లడించింది. ఆ తర్వాత అమెరికా (5.8 బిలియన్ డాలర్లు), జపాన్ (5.2 బిలియన్ డాలర్లు), దక్షిణ కొరియా (3.8 బిలియన్ డాలర్లు), తైవాన్ (2.6 బిలియన్ డాలర్లు), వియత్నాం (2.3 బిలియన్ డాలర్లు) దేశాలున్నాయి. ఇన్‌స్ట్రుమెంట్స్, మెషినరీ, ఆటోమోటివ్, కమ్యూనికేషన్ విడిభాగాల రంగాలు వైరస్ ప్రభావంతో చతికిలపడ్డట్లు యూఎన్ పేర్కొన్నది. భారత్‌లో రసాయన పరిశ్రమ 129 మిలియన్ డాలర్ల మేర ప్రభావితం కానుండగా, టెక్స్‌టైల్స్, దుస్తులు 64 మిలియన్ డాలర్లు, ఆటోమోటివ్ రంగం 34 మిలియన్ డాలర్లు, ఎలక్ట్రికల్ మెషినరీ 12 మిలియన్ డాలర్లు, తోలు ఉత్పత్తులు 13 మిలియన్ డాలర్లు, మెటల్స్, దాని ఆధారిత ఉత్పత్తులు 27 మిలియన్ డాలర్లు, కలప, ఫర్నీచర్ ఉత్పత్తులు 15 మిలియన్ డాలర్ల చొప్పున నష్టపోనున్నాయి.

నమస్తే తెలంగాణ WWW. NTNEWS.COM
శుక్రవారం 6 మార్చి 2020

# జిందగీ

/nt.zindagi

## ఒక్కరోజు కలెక్టర్!



**మహారాష్ట్రలోని ఓ స్కూల్ విద్యార్థిని కలెక్టర్‌గా మారింది. జిల్లా, మండల స్థాయి అధికారులకు ఆదేశాలు ఇస్తూ.. అత్యవసరంగా చేయాల్సిన పనులు చెబుతూ తనకిచ్చిన ఒక్కరోజు పాలనను విజయవంతంగా ముగించింది.**

స్కూల్ విద్యార్థిని కలెక్టర్ కావడం ఏంటి..? అని అనుకుంటున్నారా? వచ్చే ఆదివారం అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా ఈ విద్యార్థినికి కలెక్టర్ అయ్యే అవకాశం దక్కింది. ఎలాగంటే బుల్దానా జిల్లా కలెక్టర్ సుమన్ రావత్ వారం రోజుల పాటు వివిధ పాఠశాలల్లో తెలివైన విద్యార్థినులకు ఒక్కరోజు కలెక్టర్‌గా అవకాశం ఇవ్వాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా గత సోమవారం పూనమ్ దేశ్‌ముఖ్ అనే విద్యార్థినిని ఒక్కరోజు కలెక్టర్‌గా ఎంపిక చేశారు. 'అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా.. వారంపాటు తెలివైన అమ్మాయిలను ఒక్కరోజు కలెక్టర్‌గా ఉంచటానికి అవకాశం ఇస్తున్నాం. ఈరోజు పూనమ్ దేశ్‌ముఖ్‌ను ఎంపిక చేశాం' అని ట్విటర్ వేదికగా తెలిపారు కలెక్టర్ సుమన్ రావత్. దీంతో పాటు విద్యార్థిని కలెక్టర్ కుర్చీలో కూర్చొని ఉన్న ఫొటోను కూడా షేర్ చేశారు. ఈ ఫొటోను చూసిన నెటిజన్లంతా 'మీరు సూపర్ మేడమ్' అని కొనియాడుతున్నారు. కొంతమంది 'మీది చాలా మంచి ఆలోచన' అని రిప్లై ఇచ్చారు. ఇక ప్రస్తుతం ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## మిథాలీ తర్వాత షఫాలీ

**పట్టుమని పదిహేడేండ్లు కూడా లేని టీనేజర్ ఐసీసీ టీ-20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచింది. అది కూడా రెండేండ్లుగా టాప్‌లో కొనసాగుతున్న సీనియర్ ప్లేయర్‌ను పక్కకునెట్టి ఈ ఘనతను సాధించింది. ప్రపంచ క్రికెట్ చూపునంతా తనవైపు తిప్పకున్నదీ యువ సంచలనం షఫాలీ వర్మ.**



టీంఇడియా మహిళా క్రికెట్ మణిహారం మన మిథాలీరాజ్ తర్వాత.. టీ-20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచింది 16 యేండ్ల షఫాలీవర్మ. బ్యాట్‌తో దండయాత్ర చేస్తూ.. మెరుపువేగంతో ప్రత్యర్థుల బంతులను బౌండరీలకు పంపించగల సత్తా ఉన్న యువక్రీడా కెరటం షఫాలీ. హర్యానాలోని రోహతక్‌కు చెందిన షఫాలీ వర్మ అబ్బాయిలాంటి ఆకారం, ముక్కుసూటితనంతో మహిళా క్రికెట్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నది. భారత మహిళల క్రికెట్‌లో ఓ సంచలనంగా మారి.. బ్యాట్‌ను ఝుళిపించడంలో వీరేంద్ర సెహ్వాగ్‌ను, నిలకడలో విరాట్ కోహ్లీని గుర్తుకుతెస్తున్నది షఫాలీ. క్రికెట్ ఆరంగ్రేటం నుంచే తన అభిమాన ఆటగాడు మన మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ రికార్డులను బద్దలుకొడుతూ.. డ్యాషింగ్ ప్లేయర్‌గా గుర్తింపు తెచ్చుకున్నది షఫాలీ వర్మ. ఫార్మెట్ ఏదైనా.. అద్భుతమైన ఫామ్‌లో కొనసాగుతూ చిచ్చిరపిడుగులా విరుచుకుపడడం షఫాలీ నైజం. మెన్స్ క్రికెటర్లు కొట్టినట్లే ఫోర్లు, సిక్సర్లు ఎడాపెడా కొడుతూ.. స్టేడియంలో అందరిచూపునూ తనవైపు తిప్పుకునేలా చేస్తుంటుంది. ఈ టీ-20 మహిళా ప్రపంచకప్‌లో ప్రతి మ్యాచ్‌లోనూ షఫాలీ తనదైన ప్రతిభచూపింది. నాలుగు మ్యాచ్‌లాడిన షఫాలి మెరుపువేగంతో 161 పరుగులు చేసి అదరగొట్టింది. సెమీ ఫైనల్స్‌కు చేరుకునే కీలకమైన న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో షఫాలి వర్మ 34 బంతుల్లో 46 పరుగులు చేసింది. మన టీం గెలుపులో ప్రధాన పాత్ర పోషించి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకుంది.

## రేపటి కోసం పెట్టుబడి

**చాలామంది డబ్బు సంపాదిస్తారు. దాన్ని జాగ్రత్తగా దాచుకుంటారు. కానీ అధికంగా సంపాదించాలంటే మాత్రం పెట్టుబడులు పెట్టాలంటున్నారు ఆర్థిక నిపుణులు. చిన్న మొత్తాల్లో ఆ పెట్టుబడు లేంటంటే..**



- కేవలం జీతంపై ఆధారపడితే జీవితం బాగానే నడుస్తుంది. కానీ భవిష్యత్‌లో ఉద్యోగం ఊడిపోతే? అందుకే సంపాదిస్తున్న సమయంలోనే పెట్టుబడి మార్గాలు ఆలోచించాలి.
- మొదటిసారి పెట్టుబడి పెట్టాలనుకునేవారు మ్యూచ్‌వల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టవచ్చు. ఇప్పుడు ప్రతి బ్యాంకులో మ్యూచువల్ ఫండ్స్ అకౌంట్ ఓపెనింగ్ అందుబాటులో ఉంది. ఈ విధానంలో తక్కువ రిస్క్ ఉంటుంది.
- వివిధ కంపెనీలు గోల్డ్ బాండ్స్ విక్రయిస్తున్నాయి. ఈ రోజు రేట్‌తో బంగారం కొంటే బంగారం బదులుగా ఒక బాండ్ ఇస్తారు. భవిష్యత్‌లో ఎప్పుడు కావాలంటే అప్పుడు బాండ్ ఇచ్చి డబ్బులు తీసుకోవచ్చు. మార్కెట్ రేట్ ప్రకారం నగదు లేదంటే బంగారం తీసుకోవచ్చు.
- భూమి విలువ రోజు రోజుకూ పెరిగిపోతున్నది. ఈ నేపథ్యంలో పెట్టుబడి పెట్టాలనుకునేవారు భూముల్ని కొనుగోలు చేయవచ్చు. ఎక్కువ ధర పలికినప్పుడు అమ్ముకోవచ్చు.
- అధిక రాబడి కోసం నెల నెలా ఆర్డీ(రికరింగ్ డిపాజిట్) మాదిరిగా కొంత చెల్లించి మ్యూచువల్ ఫండ్స్‌లోనూ పెట్టుబడి చేయవచ్చు.

## పెసరట్టు రుచిగా ఉండాలంటే..



- పెసరట్టు రుచిగా ఉండాలంటే.. పెసర్లతో పాటు బబ్బెర్లు, మినుములు కూడా మిక్సీ పట్టుకోవాలి.
- ఇడ్లీలు పాత్రలకే అతుక్కుపోతున్నాయా? పాత్రలకు నూనె రాస్తే సరి.
- గుడ్డు తినడానికి చాలామంది ఇష్టపడరు. కాస్త కారంలో నిమ్మరసం పిండి ఆ మిశ్రమానికి అద్దుకొని గుడ్డును తింటే రుచిగా ఉంటుంది.
- ఒక పాత్రలో కొన్ని నీళ్లు తీసుకొని బాగా మరిగించి పారబోసి ఆ తర్వాత పాలను వేడి చేస్తే పాలు పగలవు.



జకాడ మగ్గంపై జరీ అద్దుకొని..

# సిద్దిపేట పీతాంబరం

**ఎవరు ఊహించగలరు..
కనుమరుగైపోయిన
పీతాంబరం మళ్లీ పుడుతుందని?
ఎవరు కల కనగలరు.. అంతరించిపోయిన
కళను మళ్లీ బతికించగలరని?
ఎవరు సాహసించగలరు..
ఆనవాళ్లు కోల్పోతున్న
ఆ పట్టు మళ్లీ మెరిపించాలని?
కానీ.. జరిగింది. జకాడ మగ్గంపై జరీ
అద్దుకొని జనప్రియమై..
సిద్దిపేట అంగట్ల.. చీరల వరుసలో
తళ తళ
మెరవనుంది!**



**చేనేత** ఉన్నతమైన వృత్తి. తెలంగాణ విషయానికి వస్తే ఓ మాట ఎక్కువే చెప్పొచ్చు. మన చేనేత ప్రపంచం మెచ్చిన చేనేత. మన కళ ప్రపంచాన్ని గెలిచిన కళ. అంతరించిపోతున్న కళలకు ప్రాణం పోయాలన్న సంకల్పం మనది. ఎప్పుడో సుమారు వందేండ్ల కిందట అంతరించిపోయిన పీతాంబరం మళ్లీ పురుడు పోసుకుందంటే కళలకు ఇక్కడ లభిస్తున్న ఆదరణేంటో అర్థం చేసుకోవచ్చు. చేనేతలాంటి కళలు ఏ విధంగా పూర్వ వైభవం సాధిస్తున్నాయో అవగాహన పొందవచ్చు.

### ఒకటి పూర్తయింది

సిద్దిపేట గొల్లభామ చీరలకు పేటెంట్. పీతాంబరం ఇక్కడ ఓ బ్రాండ్. నిజాం కాలంలో సిద్దిపేట కేంద్రంగా చేనేత కుటుంబాలు పీతాంబరం చీరలను సాధారణ మగ్గాలపై నేసేవి. ధనవంతులు బంగారు జరీతో పీతాంబరాలు నేయించుకునేవారు. చీర అంచులపై నెమళ్లు.. ఏనుగుల చిత్రాలతోపాటు వివిధ రకాల డిజైన్లతో చూడముచ్చటగా ఉండేవి. అలాంటి పీతాంబరాన్ని సిద్దిపేటలో నేతన్నలు మళ్లీ నేస్తున్నారు. ప్రస్తుతం ఒక చీర పూర్తయ్యింది. రెండో చీర మొదలైంది.

### 15 రోజుల అధ్యయనం

అంతరించిపోతున్న కళలను వెలికితీయాలనేది సీఎం కేసీఆర్ ఉద్దేశం. ఇందుకోసం అన్ని శాఖలూ పనిచేస్తున్నట్లుగానే చేనేత జౌళిశాఖ కూడా పనిచేస్తున్నది. ఈ శాఖ సంచాలకులు శైలజారామయ్య దీనికోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చేనేతకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారు. అలా వెలుగులోకి వచ్చిందే సిద్దిపేట పీతాంబరం. వందేండ్ల కింద అంతరించిపోయిన పీతాంబరానికి మంత్రులు కేటీఆర్.. హరీశ్‌రావు పునర్జన్మ ప్రసాదించారు. సిద్దిపేట పట్టణానికి చెందిన మాస్టర్ వీవర్ తుమ్మ గాలయ్య సహకారంతో దీనిని రూపొందిస్తున్నారు. గాలయ్య ఇంట్లో ఉన్న నిజాం కాలం నాటి పీతాంబరాన్ని శైలజారామయ్య పరిశీలించారు. హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్ ఎక్స్‌పర్ట్‌కు అప్పగించారు. వీరంతా పీతాంబరంపై పూర్తి అవగాహన తెచ్చుకొని ఎన్ని డిజైన్లు ఉన్నాయి? అడ్డం పోగులు ఎన్ని? నిలువు పోగులు ఎన్ని? వెండి పోగులు ఎన్ని? అని 15 రోజుల పాటు పీతాంబరంపై అధ్యయనం చేశారు.

### అందరి సహకారంతో

నేతన్న పనితనం ఉట్టిపడేలా పీతాంబరం చీరలు ఉంటున్నాయి. నెలకు రెండు లేదా మూడు పీతాంబరం చీరెలను నేసే లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తున్నారు. చీరెను నేసేందుకు సుమారు లక్ష రూపాయల విలువ చేసే జకాడ మగ్గాన్ని వాడుతున్నారు. వీవర్స్ సొసైటీ హైదరాబాద్ సహకారం.. సికింద్రాబాద్ డివిజనల్ మార్కెటింగ్ ఆఫీసర్ కలింగరెడ్డి పర్యవేక్షణలో ఈ పీతాంబరం తయారవుతున్నది. ముడిసరుకు కోసం రూ.20 వేలు ఖర్చు చేసి తుమ్మ గాలయ్య తెప్పిస్తుండగా.. ఒక పీతాంబరం నేసేందుకు కార్మికులు రూ. 10 వేలు పొందుతున్నారు.



### జకాడ మగ్గంపై..

అత్యంత విశిష్టత కలిగిన సిద్దిపేట పీతాంబరాన్ని జకాడ మగ్గం మీద ఎలా డిజైన్ చేయవచ్చు? అని ఏమేం చేయాలని పూర్తి అవగాహనతో ఎక్స్‌పర్ట్స్ అంతా సిద్దిపేటకు వచ్చారు. గాలయ్య వర్క్‌షాప్‌లో ప్రభుత్వ సహకారంతో జకాడ మగ్గాన్ని ఏర్పాటు చేశారు. అంతేకాదు లూమ్స్.. పరికరాలను అందించారు. పీతాంబరంపై పూర్తి అవగాహన ఉన్న గాలయ్యకు నేత పనిని అప్పగించారు. ధర్మపురి నుంచి ఒక కార్మికున్ని తీసుకొచ్చారు. అతడు నాలుగైదు రోజులు పనిచేసి వెళ్లిపోయాడు. గాలయ్యకు సహాయకులుగా సిద్దిపేటకు చెందిన నేత కార్మికులు అంజె నాగరాజు, గాజుల నారాయణలు పీతాంబరం చీరను నేస్తున్నారు.

### చేనేత దినోత్సవానికి పన్నెండు

ప్రస్తుతం ఒక పీతాంబరం నేశారు. దీనిని చేనేత జౌళిశాఖ సంచాలకులు శైలజారామయ్యకు అందజేశారు. రెండో పీతాంబరాన్ని నేసేందుకు పని ప్రారంభించారు. చేనేత జౌళిశాఖ దినోత్సవం సందర్భంగా ఆగస్టు 7వ తేదీ వరకు 12 పీతాంబరాలను నేయాలనే లక్ష్యం పెట్టుకున్నారు. ఒక్కో పీతాంబరం నేయడానికి 10 రోజులు పడుతుందని కార్మికులు చెబుతున్నారు. చీరె పొడవు 6 మీటర్లు.. వెడల్పు 50 ఇంచులు ఉంటుంది.

... కత్తుల శ్రీనివాస్‌రెడ్డి
సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ
బింగి శ్రీనివాస్



## బ్రేస్‌లెట్ ఆకట్టుకునేట్టు!

గాజుల గలగలలు మెల్లమెల్లగా తగ్గిపోతున్నాయి. ఆ స్థానాన్ని భర్తీ చేయడానికే అన్నట్లు వచ్చేశాయి బ్రేస్‌లెట్లు. ఒకప్పుడు మగవాళ్లకే పరిమితమైన ఇవి ఇప్పుడు ఆడవాళ్ల చేతులనూ సుకుమారంగా తాకుతున్నాయి. కాలేజ్‌కి వెళ్లే అమ్మాయిలకు ఇవి పర్‌ఫెక్ట్ అంటున్నారు ఫ్యాషనిస్టులు. బంగారం, వెండి అనే కాదు.. ఇమిటేషన్, ముత్యాలు, స్టోన్స్, మెటల్ రేడియం, పూసలతో అందంగా బ్రేస్‌లెట్లు ముస్తాబవుతున్నాయి. వీటిని సంప్రదాయ దుస్తుల్లో కంటే.. వెస్టన్‌వేర్ వేసుకున్నప్పుడు ధరిస్తే మరింత బెటర్. ఇమిటేషన్‌కి సంబంధించిన జువెలరీలకు పెద్దగా ఖర్చు కూడా ఉండదు. అయిదు వందల రూపాయల్లోపే ఈ బ్రేస్‌లెట్‌లు రావడంతో ఎక్కువగా అమ్మాయిలు వీటిపై దృష్టి పెడుతున్నారు.



ఈ స్పెషల్ టూర్
## ప్యాకేజీ మీ కోసమే!



**స్వేచ్ఛగా విహరించాలని, కొత్త కొత్త ప్రదేశాల్ని సందర్శించాలని చాలామంది మహిళలకు ఉంటుంది. కానీ ఒక్కరే వెళ్లలేరు. పోనీ ఫ్యామిలీతో వెళ్దాం అంటే ఖర్చు తడిసి మోపెడవుతుంది. ఇవన్నీ దృష్టిలో ఉంచుకొని కేవలం మహిళలను మాత్రమే దుబాయ్ తీసుకెళ్లాలని ఆలోచించిందో సంస్థ. దుబాయ్ అందాల్ని వీక్షించేందుకు ఈనెల 8న ప్రయాణం ప్రారంభం కానుంది.**

మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలను దుబాయ్ తీసుకెళ్లే కార్యక్రమాన్ని ప్రతి ఏటా చేపడుతున్నది 'ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్'. ఇటీవల మహిళల కోసం ప్రత్యేకంగా ఓ ఆఫర్‌ను కూడా ప్రకటించింది. 'డాజ్లింగ్ దుబాయ్– వుమెన్స్ స్పెషల్' పేరుతో ఈ టూర్ ప్యాకేజీని అందిస్తున్నది. ఐదు రోజుల పాటు సాగే ఈ టూర్ ప్యాకేజీకిగాను రూ. 50 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ టూర్ ముంబై నుంచి ప్రారంభం కానుంది. ప్యాకేజీలో భాగంగా ఫ్లైట్ టికెట్లు, దుబాయ్ వీసా ఫీజు, బ్రేక్‌ఫాస్ట్, డిన్నర్, దుబాయ్ సిటీ టూర్, హోటల్ వసతి, ట్రావెల్ ఇన్సూరెన్స్ వంటివన్నీ కవర్ అవుతాయి. ముంబై ఎయిర్‌పోర్టులో ఈనెల 8న ఉదయం 4:55కు ప్రయాణం ప్రారంభమవుతుంది. మరుసటి రోజు దుబాయ్ సిటీ టూర్, దుబాయ్ మ్యూజియం, దుబాయ్ షాపింగ్ మాల్‌లో షాపింగ్, బుర్జ్ ఖలీఫా సందర్శన తదితర సందర్శనలుంటాయి. మార్చి 12న రాత్రి షార్జాలో 11:45 గంటలకు ఫ్లైట్ఎక్కి మహిళలు ముంబై చేరుకుంటారు. విదేశాలు చూడాలనుకునే వాళ్లకు ఇది చక్కని అవకాశం అంటున్నారు టికెట్స్ బుక్ చేసుకున్న మహిళలు.

## రోగనిరోధక శక్తి పెంచే ఆహారం

**కేరళలో కరోనా వచ్చిన వారికి డాక్టర్లు మందులతో పాటు కొన్ని పండ్లు, కూరగాయలు, ఆకుకూరల్ని ఇచ్చారు. ఫలితంగా వారు పూర్తి ఆరోగ్యంగా ఉన్నారు. అది వ్యాధి నిరోధక శక్తిని పెంచే ఆహారం. అలాంటి ఆహారం ఏంటంటే?**



- టమాటా, బొప్పాయి, నారింజ, జామకాయి, యాపిల్, కమలం, బత్తాయి, ఉసిరి, నిమ్మకాయ, ద్రాక్ష, కివి, పైనాపిల్, స్ట్రాబెర్రీ, మామిడి, చెర్రీపండ్లలో సి విటమిన్ ఎక్కువగా ఉంటుంది. ఈ పండ్లలో ఏదో ఒకటి రోజూ తినడం మంచిది.
- టమాటాలు రోజూ వాడుతుంటాం. కాకపోతే వాటిని కూరలో ఎక్కువగా వాడుతుంటాం కాబట్టి సి విటమిన్ బాడీకి చేరదు. కూరతో పాటుగా ఖాళీ సమయాల్లో టమాటాలను తింటే ఎక్కువ ప్రయోజనం ఉంటుంది.
- ఏ పండ్లలో సి విటమిన్ ఉంటుందా? అని లోతుగా ఆలోచించాల్సిన పనిలేదు. పుల్లగా ఉండే అన్ని పండ్లలో సి విటమిన్ ఉంటుంది.
- కూరగాయల్లో బ్రకోలీలో ఎక్కువగా సి విటమిన్ ఉంటుంది. అలాగే పచ్చి మిర్చి, పాలకూర, కాలీఫ్లవర్, ఆవాలు, బంగాళా దుంప ఇవి రోజువారీ ఆహారంలో ఉండేలా చూసుకుంటే బాడీకి సి విటమిన్ సరిపడా అందుతుంది.



## తాగ'కుండ' ఉండలేరు!



- మట్టికుండ ఫిల్టర్‌లా పనిచేస్తుందని వైద్యులు చెబుతున్నారు. మట్టికి ఉండే మంచి లక్షణాల వల్ల నీటిలోని మలినాలను కుండ పీల్చుకొని సురక్షితమైన నీటిని మనకు ఇస్తుంది.
- కేవలం ఎండాకాలంలో నీటి చల్లదనం కోసం మాత్రమే కాకుండా కాలంతో సంబంధం లేకుండా మట్టికుండలోని నీటిని తాగవచ్చు.
- మట్టికుండ నీటికి రక్షణ కవచంలాగే కాదు తనలోని ఔషధ గుణాల్ని కూడా నీటికి జతచేస్తుంది. శరీరానికి కావాల్సిన మినరల్స్, ఎలక్ట్రోలైట్స్ నీటితో కలిసి బ్యాక్టీరియా, వైరస్ వంటి వాటిని నీటిలో కలవనివ్వవు.
- సాధారణంగా వేసవిలో అధిక వేడి ఉంటుంది. దీంతో శరీరంలో ఆమ్లత్వ స్థితి ఎక్కువైపోతుంది. ఈ సమయంలో మట్టికుండలోని నీటిని తాగడం వల్ల ఆమ్లత్వం తగ్గి శరీరం సాధారణ స్థితికి చేరుకుంటుంది.

నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
శుక్రవారం 6 మార్చి 2020

## పరాజితుల చరిత్ర ఇది


వరప్రసాద్, తమ్మారెడ్డి భరద్వాజ

'పలాస 1978' చిత్రానికి సమర్పకుడిగా నా పేరు వేసుకోవడం గర్వం గా ఉంది. 1978ల నాటి సాంఘిక పరిస్థితులకు అద్దంపడుతు వాస్తవికత ప్రధానంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాము' అన్నారు ప్రముఖ దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ. ఆయన సమర్పణలో రక్షిత్, నక్షత్ర జంటగా కరుణకుమార్ దర్శకత్వంలో రూపొందిన 'పలాస 1978' చిత్రం నేడు ప్రేక్షకులముందుకురానుంది. ఈ సందర్భంగా తమ్మారెడ్డి భరద్వాజ పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'నరసింగరావు నిర్మించిన 'మా భూమి' తర్వాత సామాజిక అంతరాల్ని చర్చిస్తూ యథార్థ జీవితాల్ని ప్రతిబింబించిన సినిమాలు రాలేదు. 'పలాస 1978' చూసినప్పుడు అలాంటి అనుభూతికలిగింది. నా మనసుకు పూర్తిగా నచ్చిన సినిమా ఇది. దేశంలోని ప్రతి ఊరిలో గాంధీజీ, అంబేద్కర్ విగ్రహాలు దర్శనమిస్తాయి. కానీ వారి ఆశయసాధనకు ఎవరూ కృషి చేయడం లేదు. అలాగే ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రస్తుతం సమాజంలో అణచివేత, వివక్ష లేవనుకుంటున్నారు. అయితే అవి మనకు తెలియని రూపంలో కనిపిస్తుంటాయి. అలాగే మహిళా సమానత్వం గురించి ఎంత చెప్పుకున్నా ఇప్పటికీ మహిళలు వివక్షను ఎదుర్కొంటున్నారు. డబ్బులేని వర్గాలు కూడా తమలో తాము పోట్లాడుకుంటున్నారు. ఇలాంటి అంశాల్ని స్పృశించే చిత్రమిది. ఈ సినిమా నేటి సమాజానికి కనువిప్పు కలిగిస్తుంది' అన్నారు. చిత్ర నిర్మాత వరప్రసాద్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో 1970దశకం నాటి కుల వివక్ష, సామాజిక వైరుధ్యాలను చర్చించాం. ఎప్పు డూ విజేతలే తమ చరిత్రను రాసుకుంటారు. ఓడిపోయిన వారి కథ కాలప్రవాహంలో మరుగునపడిపోతుంది. ఈ చిత్రం ఓడిపోయిన వారి కథను తెలియజెపుతుంది. కమర్షియల్ పంథాలోనే ఓ విభిన్నమైన సినిమాను చూసిన అనుభూతిని మిగుల్చుతుంది' అన్నారు.

## ధియేటర్ల మూసివేత అవాస్తవం


నారాయణదాస్, దామోదరప్రసాద్

కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో థియేటర్ల యాజమాన్యాలు తగినంత రక్షణ చర్యలు చేపట్టాలని తెలుగు చలన చిత్ర నిర్మాత మండలి కోరింది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో ప్రొడ్యూసర్ కౌన్సిల్ ఓ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. థియేటర్ల వద్ద తగినన్ని శానిటైజర్స్ ఏర్పాటు చేయాలని, ప్రేక్షకులకు సురక్షిత వాతావరణాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేసింది. థియేటర్ల యాజమాన్యాలు చేపడుతున్న రక్షణ చర్యలు సంతృప్తికరంగా ఉన్నాయని, అయితే మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సూచించింది. కరోనా భయాందోళనల నేపథ్యంలో థియేటర్లను మూసివేస్తున్నారని సోషల్‌మీడియాలో పుకార్లు వస్తున్నాయని, వాటిలో వాస్తవం లేదని నిర్మాతల మండలి ప్రకటించింది. సినిమాల విడుదల యథావిథిగా ఉంటుందని, ప్రేక్షకులు కూడా వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకుంటే మంచిదని తెలిపింది. ఈ కార్యక్రమంలో నారాయణదాస్ నారంగ్, దామోదరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రవితేజ సరసన


నిధి అగర్వాల్

'ఇస్మార్ట్‌శంకర్'లో గ్లామర్ తళుకులతో ఆకట్టుకుంది నిధి అగర్వాల్. ఈ సినిమాతో తెలుగులో తొలి సక్సెస్‌ను అందుకున్న ఈ ముంబాయి ముద్దుగుమ్మ త్వరలో రవితేజతో జోడీకట్టబోతున్నది. వివరాల్లోకి వెళితే.. రవితేజ హీరో గా రమేష్ వర్మ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్నది. ఏ స్టూడియోస్ పతాకంపై హవీష్ ప్రొడక్షన్స్‌లో కోనేరు సత్యనారాయణ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రం లో ఇద్దరు కథానాయికలు నటించనున్నారు. ఓ హీరోయిన్‌గా నిధి అగర్వాల్‌ను చిత్రబృందం ఎంపికచేసింది. మరో కథానాయిక ఎవరనేది త్వరలో ప్రకటించనున్నారు. మే నెలాఖరున ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభంకానున్నది. ఈ సినిమాలో రవితేజ ద్విపాత్రాభినయంలో కనిపించనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో వెల్లడించనున్నారు. ప్రస్తుతం నిధి అగర్వాల్ తెలుగులో అశోక్ గల్లా కొత్త చిత్రంతో పాటు తమిళంలో జయం రవి సరసన 'భూమి' అనే చిత్రంలో నటిస్తున్నది. కన్నడంలో ఈ ఏడాది నాయికగా అరంగేట్రం చేయబోతున్నది.


సుకుమార్, అల్లు అరవింద్, సూర్యప్రతాప్, నిఖిల్, బన్ని వాసు

## సుకుమార్ రచించిన '18పేజీస్'

ప్రముఖ దర్శకుడు సుకుమార్ కథ, స్క్రీన్‌ప్లే అందించగా నిఖిల్ కథానాయకుడిగా నటిస్తున్న '18పేజీస్' చిత్రం గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. పల్నాటి సూర్యకుమార్ ('కుమారి 21ఎఫ్' ఫేమ్) దర్శకత్వం వహిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో జీఏ2 పిక్చర్స్ మరియు సుకుమార్ రైటింగ్స్ పతాకాలపై బన్ని వాసు నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి అల్లు అర్జున్ కుమార్తె బేబి అర్హ క్లాప్‌నివ్వగా, నిర్మాత బన్ని వాసు కుమార్తె హన్విక కెమెరా స్విఛాన్ చేశారు. తొలి సన్నివేశానికి సుకుమార్ గౌరవ దర్శకత్వం వహించారు. 'వినూత్నమైన కాన్సెప్ట్ ఇది. యువత మెచ్చేలా ఉంటుంది. నవ్యమైన ఇతివృత్తంతో సుకుమార్ కథనందించారు. తెలుగు ప్రేక్షకులకు సరికొత్త అనూభూతిని పంచే సినిమా అవుతుంది' అని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రానికి కెమెరా: యువరాజ్, ఆర్ట్: రమణ వంక, సంగీతం: గోపీ సుందర్, లైన్ ప్రొడ్యూసర్: బాబు, ఎగ్జిక్యూటివ్ నిర్మాతలు: శరణ్ రాపర్తి, అశోక్.బి, కథ, స్క్రీన్‌ప్లే: సుకుమార్, నిర్మాత: బన్ని వాసు, దర్శకత్వం: పల్నాటి సూర్యప్రతాప్.

## ఇమేజ్‌ను మార్చే సినిమా


పాయల్ రాజ్‌పుత్

'ఈ సినిమాలో ఐపీఎస్ అధికారిణిగా ఛాలెంజింగ్ పాత్రలో నటించాను. ఈ క్యారెక్టర్ చేయడానికి విజయశాంతి స్ఫూర్తినిచ్చారు. ఆమె నటించిన సినిమాలు చూసి పోలీస్ పాత్రను చేశాను' అని చెప్పింది పాయల్‌రాజ్‌పుత్. ఆమె ప్రధాన పాత్రలో రూపొందుతున్న తాజా చిత్రానికి '5డబ్ల్యుఎస్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 'సాధారణ ప్రశ్నలు అసాధారణ సమాధానాలు' ఉపశీర్షిక. ప్రణదీప్ దర్శకుడు. యశోద ఠాకూర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను బుధవారం హైదరాబాద్‌లో చిత్రబృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా పాయల్ రాజ్‌పుత్ మాట్లాడుతూ ''ఆర్‌ఎక్స్100', 'ఆర్‌డీఎక్స్‌లవ్' సినిమాలతో నాకు వచ్చిన స్టీరియోటైప్ ఇమేజ్‌ను బ్రేక్ చేసే సినిమా ఇది. కెరీర్‌లో ఒక్కసారైనా పోలీస్ పాత్రలు చేయాలని నటీనటులంతా కలలు కంటారు. ఆ సువర్ణావకాశం నాకు ఈసినిమాతో దొరికింది. డూప్ లేకుండా ఈ సినిమాలో ఫైట్స్ అన్ని నేనే స్వయంగా చేశాను. నా స్నేహితుల్లో ఉన్న పోలీస్, ఐపీఎస్ అధికారులతో మాట్లాడి ఈ పాత్ర తీరుతెన్నులను అవగాహన చేసుకుంటూ నటించాను' అని చెప్పింది. దర్శకుడు మాట్లాడుతూ 'క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ మిస్టరీ డ్రామా ఇది. ఐదు ప్రశ్నల చుట్టూ తిరుగుతుంది. ఓ పోలీస్ ఆఫీసర్ జీవితంలో జరిగిన సంఘటనల నుంచి స్ఫూర్తి పొంది తెరకెక్కిస్తున్నాం. రెగ్యులర్ పోలీస్ కథలకు భిన్నంగా మానవీయ విలువలతో సాగుతుంది. వేసవిలో సినిమాను విడుదల చేస్తాం' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో యశోదా ఠాకూర్, శివకుమార్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠాలు నేర్చుకున్నాను

'తండ్రీకొడుకుల అనుబంధం నేపథ్యంలో సాగే చిత్రమిది. ప్రస్తుతం విద్యావిధానం ఎలా ఉంది? చదువుకు తగిన ఉద్యోగాలు దొరుకుతున్నాయా?లేదా? అనే అంశాలను చర్చిస్తూ వినోదాత్మకంగా రూపొందించాం' అని అన్నా రు రాహుల్ విజయ్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'కాలేజ్‌కుమార్'. హరి సంతోష్ దర్శకుడు. ఎల్.పద్మనాభ నిర్మించారు. నేడు ఈ చిత్రం విడుదలకానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో రాహుల్ విజయ్ పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'కన్నడ చిత్రానికి రీమేక్ ఇది. మూలకథను తీసుకొని తెలుగు నేటివిటీకి అనుగుణంగా మార్పులు చేస్తూ రూపొందించాం. సమకాలీన పరిస్థితులకు అద్దంపడుతూ కుటుంబ విలువలు, సెంటిమెంట్, ప్రేమ అంశాలతో సాగుతుంది. చదవడం గొప్పా? చదివించడం గొప్పా? అనే అంశాలను చర్చిస్తూ బలవంతపు చదువుల వల్ల యువతరం ఎదుర్కొనే సంఘర్షణను ఈ సినిమాలో చూపిస్తున్నాం. యూనివర్సల్ పాయింట్ కావడంతో తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి తెరకెక్కించాం. గత సినిమాల నుంచి కొన్ని పాఠాలు నేర్చుకున్నాను. ఫలితం అనేది నా చేతిలో ఉండదని తెలిసింది. నాకు అప్పగించిన పాత్రలకు న్యాయం చేయడానికే కృషిచేస్తాను. నటుడిగా ఫెయిల్ కాలేదు కాబట్టే అవకాశాలు వస్తున్నాయి. ప్రస్తుతం తెలుగులో 'బ్లాక్ అండ్ వైట్' అనే సినిమా చేస్తున్నాను. థ్రిల్లర్ కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కుతున్నది. మరో రెండు సినిమాలు చర్చల దశలో ఉన్నాయి' అని చెప్పారు.


రాహుల్ విజయ్

## ఓ స్త్రీ జీవితం 'మదా'

'మదా' చిత్రం అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో 26 పురస్కారాల్ని గెలుచుకుంది. తెలుగు సినిమా గొప్పదనాన్ని ఖండాంతరాల్లో చాటుతున్న ఇలాంటి చిత్రాల్ని ఆదరించాల్సిన అవశ్యకత మనపై ఉంది' అన్నారు ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్. ఆయన ముఖ్యఅతిథిగా 'మదా' చిత్ర మోషన్‌పోస్టర్ ఆవిష్కరణ గురువారం హైదరాబాద్‌లో జరిగింది. సైకలాజికల్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రానికి శ్రీవిద్య బసవ దర్శకత్వం వహించారు. త్రిష్ణ ముఖర్జీ కథానాయిక. ఇందిరా బసవ నిర్మాత. ఈ సందర్భంగా హరీష్ శంకర్ మాట్లాడుతూ 'సినిమా చూశాను. ఇన్నోవేటివ్ కాన్సెప్ట్‌తో ఆద్యంతం అద్భుతంగా తీర్చిదిద్దారు. ప్రతి ఫ్రేమ్‌లో సృజనాత్మకత కనిపించింది. ఈ తరహా సినిమాలు విజయం సాధిస్తే మరిన్ని గొప్ప కథలు వస్తాయి' అన్నారు. 'మూడేళ్లుగా ఈ సినిమాతో ప్రయాణం సాగిస్తున్నాం. 30 అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ప్రదర్శింపబడి 26 అవార్డులను గెలుచుకుంది. నేటి సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల్ని భిన్న కోణంలో ఆవిష్కరించే సమాంతర చిత్రమిది. ప్రతి స్త్రీ కథాంశంతో కనెక్ట్ అవుతుంది' అని దర్శకురాలు చెప్పింది. కథలోని నవ్యత నచ్చి ఈ సినిమాకు సహాయసహకారాలు అందిస్తున్నానని నిర్మాత మహేష్ కోనేరు పేర్కొన్నారు.


త్రిష్ణ ముఖర్జీ










నమస్తే తెలంగాణ
శాస్త్ర
[ కరీంనగర్ ]
శుక్రవారం 6 మార్చి 2020

'కరోనావైరస్'కు మరో ఆరు నెలల్లో వ్యాక్సిన్‌ను తయారు చేసే కార్యాన్ని శాస్త్రవేత్తలు తలకెత్తుకొన్నారు. దీనికి గాను సరికొత్త సాంకేతికతను ఉపయోగించబోతున్నట్టు వారు ప్రకటించారు.

ఆరోగ్యశాస్త్రం

## 6 నెలల్లో కరోనా వ్యాక్సిన్



**ఏదేని వ్యాధి** నిరోధానికి వ్యాక్సిన్‌ను సృష్టించడమంటే ఏండ్ల తరబడి సమయం పడుతుంది. కారణం, అది పలు సుదీర్ఘ విధానాలతో కూడుకొని ఉంటుంది కనుక. ముందు జంతువులపైన, పిమ్మట మనుషులపైన క్లినికల్ ప్రయోగాలు జరిపి, అంతర్జాతీయంగా ఆ మేరకు 'ప్రామాణిక ఆమోదం' పొందవలసి ఉంటుంది. అయితే, ప్రస్తుత 'కొవిడ్–19' (కరోనావైరస్) సృష్టిస్తున్న మారణహోమం నేపథ్యంలో ప్రసిద్ధులైన శాస్త్రవేత్తలు కొత్త సాంకేతికతలతో అత్యంత వేగవంతంగా వ్యాక్సిన్‌ను రూపొందించే కార్యక్రమాన్ని తమ భుజస్కందాలపై వేసుకొన్నారు. గత నెల (ఫిబ్రవరి) మొదటివారంలోనే మొదలైన ఈ ప్రయత్నాలు మరో 12 వారాలలో క్లినికల్ పరీక్షలకు సిద్ధం కావచ్చునని అంటున్నారు. 2017లో ఎబోలా (పశ్చిమ ఆఫ్రికాలో పుట్టి, సుమారు 11,000 మందికిపైగా పొట్టన పెట్టుకొన్న) వైరస్ నేపథ్యంలో ఏర్పడిన సీఈపీఐ (CEPI: Coalition for Epidemic Preparedness Innovations) నిపుణుల బృందమే ఈ బాధ్యతనూ తలకెత్తుకోవడం విశేషం. పై శాస్త్రవేత్తలలో అమెరికా నుంచి ఆస్ట్రేలియా వరకు అందరూ ప్రసిద్ధులేనని అంటున్నారు.

జీవశాస్త్రం

## కొత్త కీటకం



**బహుళ** ఈకలతో కూడిన కొత్త రకపు కీటకాన్ని దక్షిణాఫ్రికాలో శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఇది చూడటానికి సీతాకోక చిలుకలా ఉన్నా వాటి జాతికి చెందింది కాదని వారన్నారు. చిమ్మెట (moths)ల తరగతికి చెందిన ఈ కొత్త రకపు కీటకాన్ని 'ఎల్యూసిటిడా' (Alucitidae) గా పిలుస్తున్నారు. దీనికి అనేక ఈకలు ఉన్నట్టు ఎంటొమాలజిస్టులు (క్రిమి కీటక శాస్త్రవేత్తలు) చెబుతున్నారు. చూడటానికి సీతాకోకచిలుక (butterfly) ను పోలిన రెక్కలతో వుండే ఈ చిమ్మెటలు నిజానికి బటర్‌ఫ్లయి జాతివి కావు. దక్షిణాఫ్రికాలో తాజాగా వెలుగులోకి వచ్చిన ఈ కీటకాలు సాధారణంగా ఉష్ణ, ఉపోష్ణ ప్రదేశాలలోనే ఉంటున్నట్టు వారు గుర్తించారు. వీటికి ఈకలు మొత్తం ఆరు భాగాలుగా ఉన్నాయని, ఇంకా కొన్నింటికైతే ఏడు భాగాల ఈకలూ వున్నట్టుకూడా వారు తెలిపారు.

ఆధునిక జీవనం

## చీరకట్టులో సోఫియా



అద్భుతమైన మానవరూప రోబో 'సోఫియా' కోల్‌కతాలోని ఒక ఆడిటోరియంలో చీరకట్టుతో కనిపించి, సందర్శకులను ఆశ్చర్యంలో ముంచెత్తింది.

**'ప్రపంచ** మొట్టమొదటి రోబో సిటిజన్'గా పేర్గాంచిన సోఫియా (మానవరూప రోబో) మన దేశానికి మళ్లీ (రెండవసారి) వచ్చి ప్రజలను మంత్రముగ్ధులను చేసింది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 65 దేశాలను సందర్శించిన ఈ రోబోను ఇటీవల కోల్‌కతాలోని 'నజ్రుల్ మాంచా' (Nazrul Mancha) ఆడిటోరియంలో బెంగాలీ చీరకట్టుతో ప్రదర్శించారు. ఈ సందర్భంగా సోఫియా తీరు, సమాధానాలు సమావేశంలో పాల్గొన్న వారికి ఆశ్చర్యాన్నేకాక ఎంతో ఆసక్తినీ కలిగించాయి.

హాంగ్‌కాంగ్‌కు చెందిన 'హాన్సన్ రోబోటిక్స్' (Hanson Robotics) కంపెనీ 2016లో అభివృద్ధి పరిచిన మానవరూప రోబో 'సోఫియా'. ఒక సామాజిక 'కృత్రిమ స్త్రీ'గా ఇప్పటికీ 'ఆమె' ఒక సంచలనం. దీనిని తొలిసారిగా 2016 ఫిబ్రవరి 14న యాక్టివేట్ (క్రియాశీలం) చేయగా, అదే ఏడాది మార్చినెల మధ్యలో టెక్సాస్ (అమెరికా) రాజధాని ఆస్టిన్‌లో ప్రజలముందు ప్రదర్శించారు. సుమారు 60కి పైగా ముఖకవళికలను ప్రదర్శించే అద్భుత సామర్థ్యం ఈ రోబో సొంతం.

2017 డిసెంబర్‌లో తొలిసారిగా ఇండియాలో దీనిని ప్రదర్శించారు. మళ్లీ తాజాగా రెండవసారి కోల్‌కతాలోని పై ఆడిటోరియంలో జరిగిన ఒకానొక సాంకేతిక సంబంధమైన సమావేశంలో సోఫియాను స్థానిక (బెంగాలీ) చీరకట్టుతో ప్రదర్శించడం గమనార్హం. ఈ సందర్భంగా 'ఆమె' ప్రదర్శనా చాతుర్యం ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. సందర్శకులు అడిగిన అనేక ప్రశ్నలకు సోఫియా ఇచ్చిన సమాధానాలు ఆలోచింపజేసేవిగానూ ఉన్నాయి. 'ఒక పౌరురాలిగా అన్ని రకాల హక్కులనూ నేను కలిగి ఉన్నాను' అని సోఫియా చెప్పింది. 'రెండవసారి భారతదేశ సందర్శన నాకెంతో సంతోషాన్ని కలిగిస్తున్నది. ప్రజలు ఆహారం తింటున్న దృశ్యం చూసేవేళ నాకూ తినాలనిపించింది' అంటూ సోఫియా చెప్పుకొచ్చింది.



సోఫియా చీరకట్టులో కనపడిన తీరు, ఆయా సందర్భాలలో ప్రదర్శించిన ముఖకవళికలు అందరినీ ఆకట్టుకొన్నాయి. కోల్‌కతాలోని తన అభిమాన సందర్శనీయ ప్రదేశాలనూ ఈ 'కృత్రిమ స్త్రీ' వెల్లడించింది. 'మదర్ థెరిసాకు ఆశ్రయమిచ్చిన కోల్‌కతా నగరం' అన్న సోఫియా ప్రశంసా అందరికీ నచ్చింది. పలువురు ఇంజినీరింగ్ విద్యార్థులు అడిగిన ప్రశ్నలకూ చక్కగా సమాధానాలు ఇచ్చింది. ''మీ పరీక్షలు సమీపిస్తున్నాయని నాకు తెలుసు. బాగా చదువండి. కేవలం జ్ఞాపకశక్తి (memorising) పైనే ఆధారపడకండి' అంటూ 'సృజనాత్మకతను పెంపొందించుకోవలసింది'గా సూచించింది.

విశ్వశోధన

# కొత్త జీవ ప్రపంచం!

- మన సౌరవ్యవస్థకు 'దగ్గర్లో' అనువైన బాహ్యగ్రహం
- మాతృనక్షత్రం నుంచి జీవానుకూల కక్ష్యలోనే
- జీవం, నీరు రెండింటితో కూడిన ఉపరితలం

గ్రహాంతర లోకాల రహస్యాల శోధనలో ఒక కీలక ముందడుగు పడింది. ఐదేండ్ల క్రితం (2015) కనుగొన్న 'కే2–18బీ' అనే బాహ్యగ్రహం తన మాతృనక్షత్ర కక్ష్యలో 'నివాసయోగ్య ప్రాంతం' (habitable–zone)లోనే నెలకొని ఉన్నట్టు తాజా పరిశోధనలు తేల్చాయి. దీనికి సంబంధించి ఇదే 'మొట్టమొదటి బాహ్యగ్రహం'గానూ శాస్త్రవేత్తలు వెల్లడించారు.




**'గ్రహాంతర జీవుల'** అన్వేషణకోసం అత్యంతాసక్తితో ఎదురుచూస్తున్న మానవాళికి, శాస్త్రవేత్తలకు ఒకింత ఆసక్తిని కలిగించేలా మాతృనక్షత్రం నుంచి 'నివాసయోగ్య ప్రాంతం' లో నెలకొన్న 'బాహ్యగ్రహం' (exoplanet) తాలూకు పరిశోధన ఒకటి ఇటీవల వెలుగుచూసింది. 'కే2–18బీ'గా పిలుస్తున్న పై 'కొత్త ప్రపంచం' మన సౌరవ్యవస్థ నుంచి కేవలం 124 కాంతి సంవత్సరాల దూరంలోనే ఉన్నట్లు పరిశోధకులు తేల్చారు. గతంలో కనుగొన్న పలు బాహ్యగ్రహాలు (మన సౌరకుటుంబం ఆవలివి) వాటి మాతృనక్షత్రాల నుంచి 'నివాసయోగ్యం కాని ప్రాంతాల' (non–habitable–zone)లోనే నెలకొని ఉండగా, 'నివాసయోగ్యమైన' ప్రదేశంలో స్థిరకక్ష్యలో తిరుగుతున్న 'మొట్టమొదటి గ్రహం' ఇదేనని వారన్నారు. మన భూమి ఎలాగైతే సూర్యునినుంచి 'నివాసయోగ్య ప్రదేశం'లో, సుస్థిరకక్ష్యలో నెలకొని ఉన్నదో.. అలాగే, అంతటి నిర్ణీత దూరంలోనే ఆ భారీ బాహ్యగ్రహం నెలకొని ఉన్నట్టు శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఈ కారణంగానే అక్కడి ఉష్ణోగ్రతలు గ్రహ ఉపరితలంపై జీవానికి, నీటికి అనుకూలంగా ఉన్నట్లు తాము భావిస్తున్నామని వారన్నారు.

కెప్లర్, స్పిట్జర్, హబుల్ టెలిస్కోపులు అందించిన సమాచారాల (డేటా) మేళవింపుతోనే 2019లో జరిగిన రెండు స్వతంత్ర పరిశోధనలు ఈ ఫలితాన్ని సాధించడం గమనార్హం. మహోన్నతమైన విశ్వవైశాల్యంతో పోల్చి చూసినప్పుడు 'కే2–18బీ' బాహ్యగ్రహం మన భూగ్రహానికి చాలా 'దగ్గర్లో'నే ఉన్నట్టు భావించాలని శాస్త్రవేత్తలు అంటున్నారు. ఇది భూమికన్నా రెండు రెట్లు పెద్దదైనప్పటికీ నెప్ట్యూన్‌కంటే చిన్నదే. 'కే2–18' పేర్న పిలిచే మాతృతారనుంచి దీని కక్ష్య నెలకొని వున్న ప్రాంతం 'నివాసయోగ్యం' కావడం వల్ల ఈ భారీగోళం ఉపరితలంపై జీవం, నీరు రెండూ నెలకొని ఉండి ఉంటాయని వారు అన్నారు. మన పాలపుంతకు చెందిన సుదూర తారా సమూహ మండలమైన సింహరాశిలోని ఎర్రకుబ్జ (red dwarf) నక్షత్రమే 'కే2–18'. దీని చుట్టూ రెండు గ్రహాలు తిరుగుతుండగా, వాటిలో ఒకటి 'కే2–18బీ'. కాగా, మరొకటి 'కే2–18సీ'. 'కే2–18బీ'నే 'ఎపిక్ (EPIC) 201912552 బీ'గానూ శాస్త్రవేత్తలు పిలుస్తున్నారు.

'కే2–18బీ' గ్రహాన్ని నిజానికి 2015లోనే 'కెప్లర్ స్పేస్ టెలిస్కోప్' సమాచారం ఆధారంగా శాస్త్రవేత్తలు ప్రాథమికంగా కనుగొన్నారు. మన భూమికన్నా పరిమాణంలో రెండు రెట్లు పెద్దదేకాక ద్రవ్యరాశిలోనూ ఎనిమిది రెట్లు అధికం. అందుకే, దీనిని 'మహాభూమి' (Super Earth) గానూ వ్యవహరిస్తున్నారు. మాతృనక్షత్రం (కే2–18) చుట్టూ ఒక ప్రదక్షిణ చేయడానికి ఇది 33 భూమి రోజులను తీసుకొంటున్నది. కిందటేడాది (2019)లో జరిగిన రెండు స్వతంత్ర పరిశోధనలు ఈ గ్రహం 'నివాసయోగ్య ప్రాంత' కక్ష్యలోనే తిరుగుతున్నట్టు వెల్లడించాయి. ఇందుకుగాను కెప్లర్‌తోసహా స్పిట్జర్ (Spitzer), హబుల్ (Hubble) స్పేస్ టెలిస్కోపులు అందించిన సమాచారాన్నీ వారు మేళవించి విశ్లేషించారు.

కెప్లర్ స్పేస్ టెలిస్కోప్ 'కే2' మిషన్‌లో భాగంగా మొత్తం 1,200 బాహ్యగ్రహాలను కనుగొనగా, పైన పేర్కొన్న 'మహాభూమి' 18వది. అందుకే, దానికి 'కే2–18బీ'గా పేరు పెట్టినట్లు తెలుస్తున్నది. ఇది 'నివాసయోగ్య ప్రాంతం'లోనే సంచరిస్తున్న సంగతిని మౌలికంగా 2017లోనే 'స్పిట్జర్ స్పేస్ టెలిస్కోప్' అందించిన సమాచారం స్థిరపరిచింది. పిమ్మట మరింత కచ్చితత్వంతో కూడిన పరిశోధనలను ఆ మహాగ్రహంపై నిర్వహించారు. ప్రత్యేకించి 'ఎమ్–కుబ్జ' (M-type main sequence stars) నక్షత్రాలకు చెందిన బాహ్యభూముల అధ్యయనానికి ఉపయోగించే విశిష్ట పరికరాల (High Accuracy Radial Velocity Planet Searcher: HARPS), Calar Alto high-Resolution, Near-infrared and optical Echelle Spectrographs: CARMENES) సహాయంతో కూడా విశ్లేషించి, ఈ మేరకు నిర్ణయం తీసుకొన్నట్టు శాస్త్రవేత్తలు తెలిపారు.

### ఘన ఉపరితలం ఉంటేనే సుమా!

*'కే2–18బీ' గ్రహాన్ని మొదట్లో 'మినీ నెప్ట్యూన్'గా శాస్త్రవేత్తలు భావించారు. అక్కడి వాతావరణం 'అత్యధిక ఉదజని వాయు కవచం'తో కూడి ఉన్నట్లు వారు నమ్మారు. ఇలాంటప్పుడు జీవం ఉనికికి తక్కువ అవకాశాలు ఉంటాయి. కానీ, కేంబ్రిడ్జి శాస్త్రవేత్తలు దీనికి విరుద్ధంగా, సదరు 'దట్టమైన కవచం ఉదజని వాయువుది కాదని' నిర్ధారించారు. మరింత ఆధునాతన గణాంకాలు, నమూనాల ఆధారంగానే 'అక్కడి వాతావరణం జీవానుకూలంగా' ఉన్నట్లు వారు తేల్చారు. ఈ పరిశోధన 'ది ఆస్ట్రోఫిజికల్ జర్నల్ లెటర్స్'లో ప్రచురితమైంది. వాతావరణంలో నీటిఆవిరి ఉన్నంత మాత్రాన సదరు గ్రహం జీవానుకూలమని చెప్పలేమని, అందుకోసం ఘన ఉపరితలమూ ఉండాలని మరికొందరు శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. వచ్చే ఏడాది (2021)లో జేమ్స్ వెబ్ (James Webb) స్పేస్ టెలిస్కోప్, 2028లో ఏరీల్ (ARIEL) స్పేస్ టెలిస్కోప్ ప్రయోగాల తర్వాత ఈ మహాభూమికి చెందిన మరింత లోతైన సమాచారం అందవచ్చు.*

అదే నక్షత్రానికి చెందిన రెండోగ్రహాన్ని (కే2–18సీ) కూడా ఇదే పద్ధతిలో పరిశీలించారు. దీని తాలూకు స్థిరకక్ష్య ఇప్పటి కింకా నిర్ధారణ కాలేదు. 'కే2–18' కుబ్జతార వ్యవస్థ సింహరాశి (Leo) నక్షత్రమండలంలోనే ఉన్నప్పటికీ ఆ తారల సమూహానికి ఆవలివైపు ఇది నెలకొని ఉన్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. గ్రహాంతర జీవుల ఉనికిని తెలుసుకోవడంలో శాస్త్రవేత్తలకు ఆశలు రేకెత్తిస్తున్న ఈ కొత్త భారీగ్రహం మన భూమినుంచి 110 కాంతి సంవత్సరాల దూరంలో ఉన్నట్టు మొదట్లో భావించినా, తదనంతరం మరింత కచ్చితత్వపు డేటా ఆధారంగా ఆ దూరాన్ని 124 కాంతి సంవత్సరాలుగా నిర్ధారించారు. మాతృ ఎరుపు కుబ్జతార నుంచి 0.12–0.25 ఎయు (AU: Astronomical Unit/ 18–37 మిలియన్ కి.మీ.) దూరంలో 'నిర్ధారిత నివాసయోగ్య ప్రాంతం'లోనే అది ఉన్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు.

ఆ గ్రహానికి చెందిన వాతావరణంపైనా విస్తృత పరిశోధనలు జరిగాయి. 'కే2–18బీ' వాతావరణంలో హైడ్రోజన్–హీలియంతోపాటు నీటిఆవిరి (water vapor) గాఢత కూడా పెద్ద మొత్తంలో ఉన్నట్టు తేలింది. 'ఇది మేఘాల ఆవిర్భావానికి కావలసిన అత్యధిక స్థాయి' అని వారన్నారు. క్యూబెక్ (కెనడా) ప్రావిన్స్‌లోని 'యూనివర్సిటీ ఆఫ్ మాంట్రియల్', ఇంగ్లాండ్ (లండన్)లోని యూనివర్సిటీ కాలేజ్ లండన్ (యుసీఎల్)కు చెందిన పరిశోధకులు విడివిడిగా జరిపిన రెండు స్వతంత్ర అధ్యయనాలలో పై విషయాలు వెల్లడైనాయి. యుసీఎల్ నాయకత్వంలోని అధ్యయనం గతేడాది సెప్టెంబర్ 11నాటి 'నేచర్ అస్ట్రానమీ' పత్రికలో ప్రచురితమైంది. మరోవైపు 'యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జి' పరిశోధకులూ ఈ మేరకు అధ్యయనం జరిపారు. ఇప్పటికి అనేక బాహ్యగ్రహాల వాతావరణాలలో నీటిఆవిరి లభ్యమైనా అవి నివాసయోగ్య ప్రాంతంలో ఉండకపోవడం ఇక్కడ గమనార్హం. అయితే, పై గ్రహం నివాసయోగ్య ప్రదేశంలో నెలకొని ఉన్నప్పటికీ అక్కడి భౌగోళిక పరిస్థితులు జీవం ఉనికికి అనుకూలమా కాదా అన్నదీ నిరూపణ కావలసి ఉన్నది.

**దోర్బల బాలశేఖరశర్మ**

నమ్మలేని నిజం

## కాలినడకన 'ఐదుసార్లు' భూప్రదక్షిణ



**కాలినడకన** భూమిచుట్టూ తిరగడమంటే మాటలా? అదికూడా భూమధ్యరేఖ ప్రాంతం మీదుగా అయిదుసార్లు! పని కట్టుకొని వెళ్లాలంటే ఎవరికీ సాధ్యం కాకపోవచ్చు. కానీ, ఒక 'ఆరోగ్యవంతుడైన సగటు మనిషి' సుమారు 80 ఏండ్ల తన జీవితకాలంలో తనకు తెలియకుండానే 'ఇంతటి నడక' నడిచేస్తున్నాడని శాస్త్రవేత్తలు అంటున్నారు. అటువంటి వ్యక్తి సగటున రోజుకు 7,500 అడుగులు వేస్తాడు. ఈ లెక్కన 8 దశాబ్దాలపాటు (జీవిత పర్యంతం) మొత్తం 21,62,62,500 అడుగులు పూర్తి చేస్తాడు. అలా అతను ప్రయాణించిన దూరం 1,10,000 మైళ్లు. ఇది చక్కగా భూమధ్యరేఖ ప్రదేశం మీదుగా భూమి చుట్టూ సుమారు అయిదుసార్లు (ఒక పర్యాయ దూరం 40,075 కి.మీ.) సాగే దూరంతో సమానమని వారు అంటున్నారు.

శాస్త్రీయం

# నదులే పునాదులు

**ఈ నెల 14న 'నదుల పరిరక్షణ చర్యలకోసం అంతర్జాతీయ దినోత్సవం' జరుపుకొంటున్నాం. ఈ సందర్భంగా నదీనదాలపట్ల మన బాధ్యతను గుర్తుచేసే చిన్న ప్రస్తావన.**






**మన భూమిపై** మానవాళితోసహా సమస్త జీవజంతు, పక్షి, వృక్షజాతుల ఉనికి అంతా నీటిపైనే ఆధారపడి ఉంటుందన్నది సుస్పష్టం. వర్షం, భూగర్భజలాల తర్వాత ఉన్నంతలో శక్తిదాయకమైనవిగా నదీజలాలనే పేర్కొంటాం. అటువంటి నదుల పరిరక్షణ చర్యల కోసం అంతర్జాతీయంగా ఒక ప్రత్యేక దినోత్సవమే అమలులో ఉందంటే, అవి ఎంతగా కలుషితమై పోయాయో అర్థమవుతున్నది. ప్రతీ సంవత్సరం మార్చి 14వ తేదీని 'ఇంటర్నేషనల్ డే ఆఫ్ యాక్షన్ ఫర్ రివర్స్'గా జరుపుకొంటున్నాం. ఈ ఏడాది 22వ దినోత్సవం. మనిషి ప్రకృతి విధ్వంసక చర్యల బారిన పడుతున్న వాటిలో నదులు సైతం బలైపోతున్న తీరు అత్యంత దయనీయం.

చెరువు నీటివలె నదుల జలాలు ఒక్కచోట స్థిరంగా ఉండక ఎల్లవేళలా పలు ప్రదేశాలకు ప్రవహిస్తూ ఉంటాయి. ఈ ప్రత్యేకత వల్లే నదీజలాలకు ఎప్పటికప్పుడు కొత్తదనంతోకూడిన సారవంతమైన జీవశక్తి సమకూరుతుంది. భూమి ఉపరితలంపైన మట్టిపొరలలోంచి ప్రవహిస్తున్న కారణంగానే నదుల నీరు సహజసిద్ధంగా అలా శుద్ధి అవుతుంటుంది.

ప్రపంచవ్యాప్తంగానే గత కొన్ని దశాబ్దాల కిందటి నదుల స్థితికి, నేటి పరిస్థితులకు తీవ్ర వ్యత్యాసం కనిపిస్తున్నది. ఒకవైపు పెద్ద, మధ్యతరహా, చిన్న ఆనకట్టల నిర్మాణం, మరోవైపు నదీ ప్రదేశాలు తగ్గుముఖం పడుతుండటం, ఇదే సమయంలో రకరకాల వ్యర్థాలు, మురుగు, రసాయనిక కాలుష్యాలను నదులలోకే మళ్లిస్తుండటం వంటివి నదుల పరిరక్షణలో ఎదురవుతున్న ప్రధాన సవాళ్లు. కాలానుగుణంగా ప్రవహించే నదులతోపాటు హిమపర్వతాలు, భూమి ధ్రువప్రాంతాల (అర్కిటిక్, అంటార్కిటికా)లోని మంచు కరగడం వల్ల ఏర్పడే జీవనదులనూ వివిధరకాల సమస్యలు, సంక్షోభాలనుంచి రక్షించుకోవలసి ఉంది.

ఋతుపవనాలు సవ్యంగా ఉన్నంత కాలం నదులపై ఆనకట్టల అవసరం పెద్దగా కలుగలేదు. వర్షాకాలంలో వానలు పడక, కాలం కాని కాలంలో అతివృష్టి ఏర్పడి, వరదలు సంభవించి నదులు పొంగిపొర్లుతున్న పరిస్థితులను ఈమధ్య చూస్తున్నాం. ఆనకట్టల అవసరం పెద్ద ఎత్తున ఏర్పడుతున్న తరుణంలో నదుల సహజ సౌందర్యం చెడకుండానూ చూడవలసి ఉంటుంది. జీవజాతులకు నీటి అవసరాలు తీర్చే జలచక్రంలో ప్రధానపాత్ర పోషిస్తున్న నదుల పరిరక్షణకు ఈ ప్రత్యేక దినోత్సవాన్ని ఒక స్ఫూర్తిగా తీసుకోవాలి. ఇందుకు ప్రభుత్వాలు, స్వచ్ఛందసంస్థలతోపాటు ప్రజలంతా దీనిని బాధ్యతగా చేపట్టగలగాలి. దీని కోసం అన్ని రకాల చర్యలకూ ఉపక్రమించి, సాధ్యమైనంత వేగవంగా నదీమతల్లులను కాపాడుకొందాం.

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

## జిప్‌మర్‌లో పీజీ కోర్సులు

పుదుచ్చేరిలోని జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (జిప్‌మర్) పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం ప్రకటన విడుదల చేసింది.

- **కోర్సులు:** ఎండీ, ఎంఎస్, ఎండీఎస్, పీడీఎఫ్, పీడీసీ (జూలై 2020)
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 9
- **పరీక్షతేదీ:** మే 16
- **వెబ్‌సైట్:** www.jipmer.edu.in

## డీఆర్‌డీవోలో

డీఆర్‌డీవోకి చెందిన సాలిడ్ స్టేట్ ఫిజిక్స్ ల్యాబొరేటరీ (ఎస్‌ఎస్‌పీఎల్)లో జేఆర్‌ఎఫ్ భర్తీకి ప్రకటన విడుదలైంది.

జూనియర్ రిసెర్చ్ ఫెలో(జేఆర్‌ఎఫ్)
- **మొత్తం ఖాళీలు:** 18
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ.
- **వయస్సు:** 28 ఏండ్లు మించరాదు.
- **దరఖాస్తు:** ఈమెయిల్ ద్వారా
- **చివరితేదీ:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్ (ఫిబ్రవరి 29–మార్చి06)లో ఈ ప్రకటన వెలువడిన తేదీ నుంచి 15 రోజుల్లోపు.
- **వెబ్‌సైట్:** https://www.drdo.gov.in

## బెల్‌లో

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్)లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.



- **మొత్తం ఖాళీలు:** 84
- **పోస్టులవారీగా ఖాళీలు–అర్హతలు:**
- డిప్యూటీ ఇంజినీర్ (పర్మినెంట్)–1
- **అర్హతలు:** బీఈ/బీటెక్ (సీఎస్‌ఈ, ఐటీఐ, ఎలక్ట్రానిక్స్ లేదా సైబర్‌సెక్యూరిటీ) అనుభవం 0–2 ఏండ్లు.
- ప్రాజెక్ట్ ఇంజినీర్ (కాంట్రాక్ట్)–67
- **అర్హతలు:** బీఈ/బీటెక్ (ఎలక్ట్రానిక్స్/ మెకానికల్), రెండేండ్ల అనుభవం ఉండాలి.
- ట్రెయినీ ఇంజినీర్–12
- **అర్హతలు:** బీఈ/బీటెక్ (మెకానికల్)
- ట్రెయినీ ఇంజినీర్ (ఎలక్ట్రికల్)–4
- **అర్హతలు:** బీఈ/బీటెక్ (ఎలక్ట్రికల్)
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 14
- **వెబ్‌సైట్:** www.bel-india.in

## మిధానిలో అప్రెంటిస్

హైదరాబాద్‌లోని మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్ (మిధాని)లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

అప్రెంటిస్
- **మొత్తం ఖాళీలు:** 104
- **విభాగాలవారీగా ఖాళీలు:** గ్రాడ్యుయేట్ ఇంజినీరింగ్ అప్రెంటిస్ (జీఏటీ)–14, డిప్లొమా ఇంజినీరింగ్ (టీఏటీ)–10, ట్రేడ్ అప్రెంటిస్ (ఐటీఐ)–80 ఉన్నాయి.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **ఇంటర్వ్యూతేదీలు:** మార్చి 19, 20, 21
- పూర్తి కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **వెబ్‌సైట్:** www.midhani.gov.in

## బీఈసీఐఎల్‌లో

బెంగళూరులోని బ్రాడ్‌కాస్ట్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్) తాత్కాలిక ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **మొత్తం ఖాళీలు:** 19
- **పోస్టులు–ఖాళీలు:** డేటా ఎంట్రీ ఆపరేటర్, సపోర్టింగ్ స్టాఫ్.
- **అర్హతలు:** పదోతరగతి, డిగ్రీ ఉత్తీర్ణత, సంబంధిత పనిలో అనుభవం.
- **ఎంపిక విధానం:** టెస్ట్/ ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** మార్చి 9
- **వెబ్‌సైట్:** https://www.becil.com

నమస్తే తెలంగాణ
ఆట
12
[ కరీంనగర్ ]
శుక్రవారం 6 మార్చి 2020
WWW.NTNEWS.COM

మహిళల టీ20 ప్రపంచకప్

# వరుణుడి అండతో..

## తొలిసారి ఫైనల్ చేరిన భారత్



**ఇంగ్లండ్‌తో సెమీస్ మ్యాచ్ వర్షార్పణం**

**మరో సెమీఫైనల్లో దక్షిణాఫ్రికాపై ఆస్ట్రేలియా గెలుపు**

**ఆదివారం ఫైనల్లో భారత్, ఆసీస్ అమీతుమీ**

నాకౌట్ మ్యాచ్‌లో భారత ప్లేయర్లు విజృంభిస్తారనుకున్న చోట వరుణుడు దంచికొట్టడంతో ఒక్క బంతి కూడా పడకుండానే తొలి సెమీఫైనల్ రద్దైంది. గత టోర్నీ సెమీస్‌లో ఇంగ్లండ్ చేతిలో ఎదురైన పరాజయానికి బదులు తీర్చుకోవాలనుకున్న హర్మన్ బృందానికి వర్షం కూడా సహకరించడంతో టీమ్‌ఇండియా తొలిసారి మహిళల టీ20 ప్రపంచకప్ ఫైనల్‌కు చేరింది. గ్రూప్ దశలో సాధించిన వరుస విజయాలు ఫలితాన్నిచ్చాయి. ఆరంభ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై అద్వితీయ విజయంతో ప్రపంచకప్ వేటను మొదలుపెట్టిన మన అమ్మాయిలు ఆదివారం జరిగే తుదిపోరులో మరోసారి ఆ జట్టునే ఢీకొట్టనున్నారు.

**సిడ్నీ:** మహిళల పొట్టి ప్రపంచకప్ చరిత్రలో భారత జట్టు తొలిసారి ఫైనల్‌కు చేరింది. ఇప్పటివరకు ఆరుసార్లు మెగాటోర్నీ బరిలో దిగి మూడుసార్లు సెమీస్‌లోనే నిష్క్రమించిన టీమ్ ఇండియా.. గురువారం ఇంగ్లండ్‌తో జరుగాల్సిన సెమీఫైనల్ మ్యాచ్ వర్షార్పణం కావడంతో ముందడుగేసింది. గ్రూప్-ఏలో ఆడిన అన్ని మ్యాచ్‌ల్లో నెగ్గి 8 పాయింట్లతో నాకౌట్‌కు చేరిన హర్మన్ గ్యాంగ్.. ఇంగ్లిష్ జట్టు (6 పాయింట్లు)తో తలపడాల్సి ఉండగా.. భారీ వర్షం కారణంగా ఒక్క బంతి పడకుండానే మ్యాచ్ రద్దైంది. దీంతో గ్రూప్ దశలో సాధించిన పాయింట్ల ఆధారంగా భారత్ తుదిపోరుకు అర్హత సాధించింది. నాకౌట్ మ్యాచ్‌కు రిజర్వ్ డే లేకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో భారమైన హృదయాలతో ఇంగ్లండ్ జట్టు ఇంటి బాటపట్టింది. మ్యాచ్ ఆడకుండా ఫలితం రావడం సరైంది కాదన్న భారత సారథి హర్మన్‌ప్రీత్ కౌర్.. ఇకముందైనా కీలక మ్యాచ్‌లకు రిజర్వ్ డే కేటాయించడం మంచిదని పేర్కొంది. మరో సెమీఫైనల్లో దక్షిణాఫ్రికాపై డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం 5 పరుగుల తేడాతో విజయం సాధించిన ఆస్ట్రేలియా వరుసగా ఆరోసారి ఫైనల్లో అడుగుపెట్టింది. ఆదివారం మెల్‌బోర్న్ వేదికగా జరుగనున్న తుదిపోరులో భారత్, ఆసీస్ అమీతుమీ తేల్చుకోనున్నాయి.

**టాస్ కూడా పడకుండానే..**

గురువారం ఉదయం నుంచే సిడ్నీలో ఎడతెరిపిలేని వర్షం కురుస్తుండటంతో మొదట టాస్‌ను వాయిదా వేశారు. ఆ తర్వాత కూడా వరుణుడు శాంతించకపోవడంతో పలు మార్లు వాయిదా పడుతూ వచ్చిన తొలి సెమీఫైనల్ చివరకు టాస్ కూడా పడకుండానే ముగిసింది. దీంతో భారత్ ముందంజ వేసింది. అదే మైదానంలో జరగాల్సిఉన్న రెండో సెమీఫైనల్‌కు కూడా వర్షం అడ్డుపడేలా కనిపించినా.. చివరకు కాస్త తెరిపినివ్వడంతో మ్యాచ్ సాగింది.


లానింగ్ (49*)

## ఆసీస్ ఆరోసారి

మహిళల క్రికెట్‌లో తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శిస్తున్న ఆస్ట్రేలియా వరుసగా ఆరోసారి పొట్టి ప్రపంచకప్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. గురువారం ఇక్కడ జరిగిన రెండో సెమీఫైనల్లో డక్‌వర్త్ లూయిస్ (డ/లూ) పద్ధతి ప్రకారం ఆసీస్ 5 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను చిత్తుచేసింది. రెండు సెమీఫైనల్స్‌కు ఒకే మైదానం కావడంతో ఈ మ్యాచ్ కూడా వర్షార్పణం అయ్యే సూచనలు కనిపించినా.. చివరకు వరుణుడు శాంతించడంతో మ్యాచ్ సాగింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా నిర్ణీత ఓవర్లలో 5 వికెట్లకు 134 పరుగులు చేసింది. కెప్టెన్ మెగ్ లానింగ్ (49 నాటౌట్) టాప్ స్కోరర్. సఫారీ బౌలర్లలో డిక్లెర్క్ (3/19) రాణించింది. అనంతరం మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిగించడంతో డ/లూ ప్రకారం దక్షిణాఫ్రికా లక్ష్యాన్ని 13 ఓవర్లలో 98 పరుగులకు కుదించగా.. ప్రొటీస్ జట్టు 92/5తో నిలిచింది.



“ ప్రపంచకప్‌ను ఇలా ముగించడం నిరాశ పరిచింది. సెమీఫైనల్‌కు రిజర్వ్ డే ఉంటే బాగుండేది. గ్రూప్ దశలో దక్షిణాఫ్రికా చేతిలో ఓడటం వల్లే ఈ పరిస్థితి ఎదురైంది. ఈ విషయంలో ఇంతకంటే చేసేదేమీ లేదు.

**- హీతర్ నైట్ , ఇంగ్లండ్ కెప్టెన్**

## ఎక్కడ మొదలుపెట్టామో.. తిరిగి అక్కడికే..

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

టీ20 విశ్వకప్‌లో భారత అమ్మాయిల పోరాటం ఎక్కడ ఆరంభమైందో.. ఆఖరుకు అక్కడికే చేరింది. టోర్నీ ప్రారంభ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాను ఓడించి శుభారంభం చేసిన టీమ్ ఇండియా.. ఫైనల్లో మరోసారి ఆసీస్‌ను ఎదుర్కొనేందుకు రెడీఅయింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8) నాడు జరుగనున్న పొట్టి ప్రపంచకప్ తుదిపోరులో హర్మన్ గ్యాంగ్ కంగారూ బృందాన్ని ఢీకొననుంది. ఐసీసీ టోర్నీల్లో నాకౌట్ మ్యాచ్‌లు ఆడిన అనుభవం పెద్దగా లేని భారత జట్టు.. కీలక పోరులో ఆసీస్‌ను ఎలా ఎదుర్కొంటుందో చూడాలి. మహిళల టీ20ల్లో ఇది ఏడో ప్రపంచకప్ కాగా.. అందులో ఆస్ట్రేలియా ఆరోసారి ఫైనల్ చేరిందంటేనే.. ఆ జట్టు ఆధిపత్యం ఎలా సాగుతుందో చెప్పొచ్చు. అయితే, తొలి మ్యాచ్‌లో కంగారూలపై నెగ్గడం హర్మన్ గ్యాంగ్‌లో ఆత్మ విశ్వాసం నింపే విషయం.

బ్యాటింగ్‌లో భారీ స్కోరు చేయకున్నా.. బౌలర్లు విజృంభించడంతో ప్రపంచకప్ మొదటి మ్యాచ్‌లో భారత్.. ఆసీస్‌పై ఆధిపత్యం కనబర్చింది. యువ ఓపెనర్ షఫాలీ వర్మ మెరుపులకు.. జెమీమా రోడ్రిగ్స్, దీప్తి శర్మ నిలకడ తోడవడంతో ఓ మోస్తరు స్కోరు చేసిన టీమ్‌ఇండియా.. ఆనక బౌలింగ్‌లో సత్తాచాటింది. లెక్కకు మిక్కిలి ఐసీసీ నాకౌట్ మ్యాచ్‌లు ఆడిన అనుభవం ఉన్న ఆసీస్‌కు ఒత్తిడిని జయించడం వెన్నతో పెట్టిన విద్య. మరి తొలిసారి ఫైనల్ చేరిన టీమ్‌ఇండియా.. ఒత్తిడికి తలొగ్గుతుందా..? ఆస్ట్రేలియాను చిత్తుచేసి సగర్వంగా ట్రోఫీని ముద్దాడుతుందా తెలియాలంటే మహిళల దినోత్సవం వరకు ఆగాల్సిందే!

“ చిన్నప్పటి నుంచి నేను మ్యాచ్ ఆడటం మా అమ్మ ఎప్పుడూ చూడలేదు. ఇన్నాళ్లకు ఆమె నా ఆట ప్రత్యక్షంగా చూసేందుకు ఇక్కడికి వస్తే.. వర్షం కారణంగా అసలు మ్యాచే జరుగలేదు. వాతావరణం అనుకూలించక మ్యాచ్ జరుగకపోవడం దురదృష్టకరం. నాకౌట్ మ్యాచ్‌లకు భవిష్యత్తులో రిజర్వ్ డేలు ఉంటే బాగుంటుంది. షఫాలి, స్మృతి చక్కటి ఆరంభాలు ఇస్తున్నారు. ఫైనల్లో కూడా వాళ్లు ఇలాగే రాణిస్తారని ఆశిస్తున్నా.

**- హర్మన్, భారత కెప్టెన్**



## క్వార్టర్స్‌లో మనీశ్, ఆశీష్


ఆశీష్

**అమన్ (జోర్డాన్):** భారత బాక్సర్లు మనీశ్ కౌశిక్ (63 కేజీలు), ఆశీష్ కుమార్ (75 కేజీలు) ఆసియా ఒలింపిక్స్ క్వాలిఫయర్స్‌లో క్వార్టర్స్ ఫైనల్స్‌కు దూసుకెళ్లి.. టోక్యో ఒలింపిక్స్ అర్హతకు ఓ విజయం దూరంలో నిలిచారు. గురువారం జరిగిన పురుషుల ప్రిక్వార్టర్స్ బౌట్లలో మనీశ్ 5-0తో చెన్‌ఇన్ లై (తైవాన్)పై ఏకపక్షంగా గెలువగా.. ఆశీష్ 5-0తో ఒముబెక్ బెక్జిగిట్‌ఉలు (కిర్గిస్థాన్)ను చిత్తు చేశాడు. క్వార్టర్స్‌లో మూడో సీడ్ చింజోరింగ్ బార్తార్సుక్ (మంగోలియా)తో మనీశ్, మైకేల్ ముష్కిత (ఇండోనేషియా)తో ఆశీష్ తలపడనున్నారు. ఈ బౌట్లు గెలిచి సెమీస్ చేరితే టోక్యో బెర్త్ పక్కాకానుంది.

## సింధు, సైనాకు సవాలే..


సింధు

ఇండియా ఓపెన్ ‘డ్రా’ విడుదల

**న్యూఢిల్లీ:** కొంతకాలంగా ఫామ్ లేమితో ఇబ్బంది పడుతున్న భారత షట్లర్లకు సొంత గడ్డపై జరుగనున్న ఇండియా ఓపెన్‌లో కష్టమైన ‘డ్రా’ ఎదురైంది. ఈ నెల 24 నుంచి ప్రారంభం కానున్న ఈ టోర్నీ ‘డ్రా’ గురువారం విడుదలైంది. 2017 టైటిల్ విజేత, ప్రపంచ చాంపియన్ సింధు మహిళల సింగిల్స్ తొలిరౌండ్‌లో చెయింగ్ గాన్ యీ (హాంకాంగ్)తో తలపడనుంది. ఆరంభ సవాళ్లు అధిగమించి సింధు క్వార్టర్స్ చేరితే.. మిచెలీ లీ (కెనడా) రూపంలో కఠిన ప్రత్యర్థి ఎదురయ్యే చాన్స్ ఉంది. మరోవైపు టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించడమే లక్ష్యంగా సాగుతున్న 2015 టైటిల్ విన్నర్ సైనా నెహ్వాల్.. తొలి రౌండ్‌లో పైయూ పో (చైనీస్ తైపీ)తో తలపడనుంది.

## క్రొయేషియాతో భారత్ ఢీ

**జగ్రెబ్:** డేవిస్‌కప్ క్వాలిఫయర్స్‌లో కఠిన ప్రత్యర్థి క్రొయేషియాను ఢీకొట్టేందుకు భారత టెన్నిస్ జట్టు సిద్ధమైంది. రెండు రోజుల పాటు ఇరు జట్ల మధ్య జరిగే ‘టై’ శుక్రవారం ప్రారంభం కానుంది. సింగిల్స్‌లో భారత్ తరఫున రామ్‌కుమార్ రామనాథన్, ప్రజ్నేశ్ గుణేశ్వరన్ బరిలోకి దిగనున్నారు. డబుల్స్‌లో రోహన్ బోపన్న, లియాండర్ పేస్ ఆడనుండగా.. సుమిత్ నాగల్ బెంచ్‌కే పరిమితమయ్యే అవకాశం ఉంది. పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ 37వ ర్యాంకర్ మారిన్ సిలిచ్ రూపంలో కఠిన పరీక్షే ఎదురుకానున్నా.. మంచి ఫామ్‌లో ఉన్న రామ్‌కుమార్, ప్రజ్నేశ్ గుణేశ్వరన్ అద్భుతాలు చేస్తారా చూడాలి. ఈ ‘టై’డబుల్స్‌లో గెలిచిన జోడీ ఈ ఏడాది నవంబర్‌లో జరిగే డేవిస్‌కప్ ఫైనల్స్‌కు అర్హత సాధించనున్న నేపథ్యంలో ఈ పోరు కీలకంగా మారింది. తన కెరీర్‌లో చివరి డేవిస్ కప్ ఆడుతున్న భారత దిగ్గజ ప్లేయర్ లియాండర్ పేస్ సత్తా చాటాలని పట్టుదలగా ఉన్నాడు.


లియాండర్ పేస్


అంతర్జాతీయ మహిళల దినోత్సవాన్ని (మార్చి 8) పురస్కరించుకొని చీరకట్టులో క్రికెట్ ఆడి ఆకట్టుకున్న భారత వన్డే కెప్టెన్ మిథాలీ రాజ్

## టాప్‌లో హారిక

**లుసానే:** ఫిడే మహిళల గ్రాండ్ ప్రిలో భారత గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక అదరగొడుతున్నది. మూడో రౌండ్‌లో ప్రపంచ చాంపియన్ వెంజున్ (చైనా)ను ఓడించిన ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ హారిక.. గురువారం జరిగిన నాలుగో రౌండ్‌లో ననా జాగ్నిడ్జే (జార్జియా)ను చిత్తుచేసింది. నల్లపావులతో బరిలోకి దిగిన తెలుగమ్మాయి.. కీలక సమయాల్లో సరైన నిర్ణయాలతో 27ఎత్తుల్లోనే ప్రత్యర్థిని చిత్తుచేసింది. టోర్నీ తొలి రెండు రౌండ్లను డ్రా చేసుకొని.. తదుపరి రెండు గెలువడంతో మొత్తం మూడు పాయింట్లతో ద్రోణవల్లి హారిక పట్టికలో అగ్రస్థానానికి చేరింది.

### పోలీసులు విఫలమైతే..

## ప్రజాస్వామ్యం విఫలమైనట్లే


అజిత్ దోవల్

**గుర్గావ్:** చట్టం అమలు చేయడంలో పోలీసులు విఫలమైతే.. ప్రజాస్వామ్యం విఫలమైనట్లేనని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ తెలిపారు. పోలీసులు ప్రజల నమ్మకాన్ని చూరగొనాలన్నారు. బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (బీపీఆర్డీ) ఆధ్వర్యంలో గుర్గావ్‌లో గురువారం యువ సూపరింటెండెంట్స్ ఆఫ్ పోలీస్ (ఎస్పీల) సదస్సు జరిగింది. దేశవ్యాప్తంగా తరలివచ్చిన యువ పోలీసు అధికారులనుద్దేశించి అజిత్ దోవల్ మాట్లాడారు. ఈశాన్య ఢిల్లీలో ఇటీవల జరిగిన మత ఘర్షణలను నియంత్రించడంలో పోలీసులపై విమర్శలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సమాజంలో పోలీసు పాత్ర గురించి దోవల్ ప్రధానంగా మాట్లాడారు. ‘ప్రజాస్వామ్యంలో చట్టాన్ని అమలు చేయడమన్నది పవిత్రమైన విధి. ఈ చట్టాలు రాజులు లేదా మత నాయకులు చేసినవి కావు. ప్రజాప్రతినిధులు చేసిన చట్టాలను మీరు అమలు చేయాలి. మీరు విఫలమైతే, ప్రజాస్వామ్యం విఫలమవుతుంది’ అని వ్యాఖ్యానించారు. ‘మన సమాజం చాలా ఏండ్లుగా బానిసత్వంలో ఉన్నది. పోలీసులపై ప్రజల్లో ఉన్న భ్రమలు తొలిగిపోలేదు. తమ భద్రత, ఫిర్యాదులను పట్టించుకోరని పేద, అణగారిన ప్రజలు భావిస్తారు. పోలీసులు తమ పని తీరుతో ఆ ముద్రను తొలిగించేందుకు కృషి చేయాలి’ అని దోవల్ పిలుపునిచ్చారు.

## ‘ముందుగానే బదిలీ సమాచారం’

**న్యూఢిల్లీ:** తన బదిలీ సమాచారం ముందుగానే అందిందని ఢిల్లీ హైకోర్టు నుంచి బదిలీ అయిన న్యాయమూర్తి ఎస్ మురళీధర్ తెలిపారు. తనను పంజాబ్, హర్యానా హైకోర్టుకు బదిలీ చేస్తున్నట్లు సీజేఐ బోబ్డే నుంచి ఫిబ్రవరి17న సమాచారం అందినట్లు గురువారం పేర్కొన్నారు. బీజేపీ నేతలపై కేసులు నమోదు చేయాలనడంతోనే తనను బదిలీ చేశారన్న అపోహలను తొలిగించే ప్రయత్నం చేశారు.

### పుస్తకాల సంచి లేకుండానే పాఠశాలకు

**బెంగళూరు:** పాఠశాల విద్యార్థులపై పెరిగిపోతున్న పుస్తకాల బరువును తగ్గించడంతో పాటు వారిలో నైపుణ్యాన్ని వెలికితీసే దిశగా కర్ణాటక ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. నెలలో రెండు శనివారాలు విద్యార్థులు పుస్తకాల బ్యాగ్ లేకుండానే పాఠశాలకు వెళ్లవొచ్చని సీఎం యెడియూరప్ప తెలిపారు.

# కాంగ్రెస్ ఎంపీల సస్పెన్షన్

- బడ్జెట్ సమావేశాలు ముగిసేవరకూ ఏడుగురిపై లోక్‌సభ స్పీకర్ వేటు

**న్యూఢిల్లీ, మార్చి 5:** సభ నియమావళిని ఉల్లంఘిస్తూ.. సమావేశాలను అడ్డుకుంటున్నారన్న కారణంతో ఏడుగురు కాంగ్రెస్ ఎంపీలను లోక్‌సభ స్పీకర్ గురువారం సస్పెండ్ చేశారు. బడ్జెట్ సమావేశాలు పూర్తయ్యేవరకు ఈ సస్పెన్షన్ అమల్లో ఉంటుందన్నారు. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ, ఆమె కుటుంబసభ్యులకు కరోనా వైరస్ వైద్య పరీక్షలు చేయాలంటూ (భారత్‌లో ఈ వైరస్ సోకిన వారిలో ఎక్కువగా ఇటలీకి చెందిన పర్యాటకులు ఉండటం.. సోనియాగాంధీ ఇటలీలో జన్మించిన నేపథ్యంలో) బీజేపీ మిత్రపక్షమైన రాష్ట్రీయ లోక్‌తాంత్రిక్ పార్టీ ఎంపీ హనుమాన్ బెనివాల్ వ్యాఖ్యానించారని, ఆయన్ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్‌చేస్తూ..



కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లారు. స్పీకర్ పోడియంపై ఉన్న పేపర్లను లాక్కొని చించేశారు. దీంతో కాంగ్రెస్ ఎంపీలు గౌరవ్ గొగోయ్, టీఎన్ ప్రతాపన్, డీన్ కురియాకోస్, మనిక్క ఠాగూర్, రాజ్‌మోహన్ ఉన్నిథన్, బెన్ని బెహనన్, గుర్జీత్‌సింగ్ ఆవ్‌జ్లాను స్పీకర్ స్థానంలో ఉన్న బీజేపీ ఎంపీ మీనాక్షిలేఖి సస్పెండ్ చేశారు.

**ఇది ప్రతీకార రాజకీయం**

స్పీకర్ నిర్ణయంపై కాంగ్రెస్ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇది మోదీ ప్రభుత్వ నిరంకుశ నిర్ణయానికి తార్కానమని, ప్రతీకార రాజకీయాలకు నిదర్శనమని ఆరోపించింది. లోక్‌సభలో కాంగ్రెస్ నాయకుడు అధిర్ రంజన్ చౌదరి మాట్లాడుతూ.. ఎంపీల సస్పెన్షన్ నిర్ణయం స్పీకర్‌ది కాదని, ప్రభుత్వానిదని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు ఎలాంటి తప్పు చేయలేదని, ఢిల్లీ హింసాకాండ గురించి గట్టిగా గళాన్ని వినిపిస్తున్న ప్రతిపక్షాన్ని బలహీనపరిచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. మరోవైపు, లోక్‌సభ స్పీకర్ స్థానానికి ఏ మాత్రం గౌరవం ఇవ్వకుండా పేపర్లను లాక్కొని చించేసిన ‘ఎంపీ’ సభ్యత్వాన్ని రద్దు చేయమని స్పీకర్‌కు విజ్ఞప్తి చేస్తామని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి మీడియాతో అన్నారు. కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్‌ను ఉద్దేశించే ఈ వ్యాఖ్యలు చేశారని అధికార వర్గాలు తెలిపాయి.

## తగ్గిన పీఎఫ్ వడ్డీరేటు

**న్యూఢిల్లీ:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను ప్రావిడెంట్ ఫండ్ డిపాజిట్లపై వడ్డీరేటును తగ్గించింది ఈపీఎఫ్‌వో. దాదాపు 6 కోట్ల ఖాతాదారులను నిరాశపరుస్తూ ఏడేండ్ల కనిష్ఠ స్థాయిలో 8.50 శాతానికే పరిమితం చేసింది. గత ఆర్థిక సంవత్సరం ఇది 8.65 శాతంగా ఉన్నది. బోర్డు సమావేశ నిర్ణయంతో రూ.700 కోట్లకుపైగా మిగులు ఉంటుందని కేంద్ర కార్మిక శాఖ మంత్రి సంతోష్ గంగ్వార్ తెలిపారు.

### పాక్‌లో భవనం కూలి.. 11 మంది మృతి

**కరాచీ:** పాకిస్థాన్‌లోని కరాచీలో గురువారం మూడంతస్తుల భవనం కూలింది. ఈ ఘటనలో 11 మంది మరణించగా 36 మంది గాయపడ్డారు. మృతుల్లో ఓ మహిళ ఉన్నట్లు స్థానిక మీడియా పేర్కొంది. మరోవైపు శిథిలాల కింద చిక్కుకున్నవారిని రక్షించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

## మగతోడు లేకుండా పిల్లలు

### అమెరికా జూలో మూడు పిల్లలకు జన్మనిచ్చిన సరీసృపం

***వాషింగ్టన్:*** *పురుష జీవితో సంపర్కం లేకుండానే బల్లి జాతికి చెందిన ఓ సరీసృపం మూడు పిల్లలకు జన్మనిచ్చింది. ఈ ఘటన అమెరికాలో టెనెస్సీలోని చట్టానూగా జూలో చోటు చేసుకున్నది. ‘చార్లీ’ అనే ఓ కొమోడో డ్రాగన్(బల్లి జాతికి చెందిన సరీసృపం) జూలో గత కొంతకాలంగా ఉంటుంది. సంతానాన్ని వృద్ధి చేసే ఉద్దేశంతో చార్లీ ఎన్‌క్లోజర్‌లోకి ఓ మగ కొమోడో డ్రాగన్‌ను జూ సిబ్బంది ఉంచారు. అయితే, ఆ పురుష జీవితో సంపర్కంలో పాల్గొనేందుకు చార్లీ ఆసక్తి కనబర్చలేదు. అయినప్పటికీ, చార్లీ మూడు పిల్లలకు జన్మనిచ్చింది. దీనిపై విచారణ చేపట్టిన సిబ్బంది చార్లీ డీఎన్ఏను పరీక్షించారు. అయితే, అందులో మగ జీవితో సంపర్కం జరుపుకోకుండానే చార్లీకి మూడు పిల్లలు కలిగాయని తేలింది. అయితే మగ జీవితోడు లేకుండా పిల్లల్ని కనడం కొన్ని అకశేరుకాల్లో సాధారణమేనని శాస్త్రవేత్తలు తెలిపారు.*

## మధ్యప్రదేశ్‌లో ముదురుతున్న సంక్షోభం

### కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజీనామా.. మరో ముగ్గురు ఎమ్మెల్యేలు గాయబ్

**భోపాల్ల్:** మధ్యప్రదేశ్‌లో రాజకీయ సంక్షోభం ముదిరే పరిస్థితులు కనిపిస్తున్నాయి. సర్కార్‌ను కూలదోసేందుకు తమ ఎమ్మెల్యేలను బీజేపీ అపహరించిందని కాంగ్రెస్ ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కనిపించకుండా పోయిన ఎమ్మెల్యేల్లో ఒకరైన హర్దీప్ దంగ్(కాంగ్రెస్ ఎమ్మెల్యే).. తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు అసెంబ్లీ స్పీకర్ ఎన్పీ ప్రజాపతికి గురువారం ఓ లేఖను పంపారు. దీంతో మధ్యప్రదేశ్ రాజకీయాలు రసకందాయంలో పడ్డాయి. మరోవైపు, హర్దీప్ దంగ్‌తో పాటు కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్యేలు రఘురాజ్ కాన్సానా, బిసాలాల్ సింగ్, మరో స్వతంత్ర్య ఎమ్మెల్యే షెరా భైయా ఆచూకీ ఇంకా తెలియరాలేదని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా.. తమతో బీజేపీ బేరసారాలు జరిపిందన్న కాంగ్రెస్ ఆరోపణల్ని బీఎస్పీ, ఎస్పీ ఎమ్మెల్యేలు తోసిపుచ్చారు.

## అప్పుడు భూమిపైనంతా నీరేనట!



***న్యూఢిల్లీ:*** *మనం నివసిస్తున్న భూమి 320 కోట్ల ఏండ్ల కిందట ఎలా ఉండేదో ఓసారి ఊహించగలరా?.. ఆ సమయంలో కనీసం అంగుళం కూడా భూభాగం కనిపించకుండా పూర్తిగా సముద్రాలే ఆక్రమించాయట. ఆ తర్వాతే రాతి పొరలు సముద్రాల పైకి తేలి టెక్టానిక్ ప్లేట్లుగా మారాయని తాజాగా అమెరికా శాస్త్రవేత్తలు గుర్తించారు. పశ్చిమ ఆస్ట్రేలియాలోని పనోరమా జిల్లాలో ఉన్న ‘పిల్బారా క్రాటన్’ ప్రాంతంలో కొలరాడో, అయోవా యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు పరిశోధనలు జరిపారు. ఆ నేలలోని ఆక్సిజన్ ఐసోటోప్‌లను పరీక్షించారు. ఇవి దాదాపు 320 కోట్ల ఏండ్ల కిందటివని.. అప్పుడు ఆ ప్రాంతాన్ని పూర్తిగా సముద్రపు నీరు ఆక్రమించి ఉండేదని నిర్ధారించారు. ఈ ఫలితాల ఆధారంగా.. ఒకప్పుడు భూమి మొత్తం సముద్ర జలాలు ఆవరించి ఉండేవని తేల్చారు.*

## కులాంతర వివాహ జంటలకు ‘సేఫ్ హోమ్స్’

**తిరువనంతపురం:** కులాంతర పెండ్లి చేసుకున్న వారికి ఏడాదిపాటు ఉచిత వసతి కల్పించనున్నట్లు కేరళ సామాజికశాఖ మంత్రి శైలజ చెప్పారు. ‘కులాంతర పెండ్లి చేసుకున్న వారికి బెదిరింపులు వస్తున్నాయి. కొన్నిసార్లు ఇంటి నుంచి వెళ్లగొడుతున్నారు. దీంతో సేఫ్ హోమ్స్‌ను ఏర్పాటుచేయాలని నిర్ణయించాం. వారు ఏడాదిపాటు ఈ ఇళ్లలో ఉండొచ్చు’ అని తెలిపారు.